www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No. VJ/042/2015-17
సంపుటి : 66 | సంచిక : 201 | గురువారం 11-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | వెల: రూ.3.00 | విజయవాడ ప్రచురణ



విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాల ముగింపు సభలో ప్రసంగిస్తున్న సురవరం సుధాకరరెడ్డి

హాజరైన సీపీఐ శ్రేణులు



మనువాద, మతోన్మాద, మితవాద, ఫాసిస్టు విధానాలకు పాల్పడుతున్న మోడీ సర్కారును గద్దె దింపి, రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించుకోవడం నేటి తక్షణావ్యశ్యతకత. ఇందుకు వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య, బీజేపీ యేతర శక్తులన్నీ ఒక్కటై ఉద్యమించవలసిన సమయం ఆసన్నమైంది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు, దళితులు, ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించేందుకు వామపక్ష, దళిత, లౌకిక, ప్రజా స్వామ్య శక్తులతో "మహా సంఘటన" ఏర్పాటుకు కంకణధారులు కావడానికి శపథం పూనాలి. ఇది చారిత్రక కర్తవ్యం.

ఒక్కటవుదాం..

- 'మహా సంఘటన' చారిత్రక కర్తవ్యం
- మోడీ మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమం
- ఆరెస్సెస్ రిమోట్ పాలనకు అంతం పలకాలి
- సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం పిలుపు

2లో

కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులు
డి.రాజా

మోడీని వ్యతిరేకిస్తే ఇద్దరు చంద్రులకు జైలే
నారాయణ

బాబూ... అభివృద్ధి ఎక్కడ ?
రామకృష్ణ

మరిన్ని చిత్రాలు జిల్లా టాబ్లాయిడ్‌లో..

మరిన్ని వార్తలు 12లో

ప్రపంచం

కిమ్‌తో భేటీకి రెడీ: మూన్‌జాయ్

సియోల్ : రెండు కొరియాల మధ్య సంబంధాలను పెంపొందించుకునేందుకు అవసరమైతే ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌తో సమావేశమయ్యేందుకు తాను సిద్ధంగానే ఉన్నానని దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్ బుధవారం తెలియజేశారు. గత ఏడాది మే నెలలో మూన్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. ఏడాది పాలన గడిచిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పరిస్థితులు అనుకూలించినట్లయితే రెండు కొరియాల మధ్య శిఖరాగ్ర సమావేశానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. అయితే చర్చలకోసం చర్చలు జరగరాదని సమావేశం ద్వారా ఫలితం ఉండాలని ఆయన అన్నారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను సడలించేందుకు సైనికస్థాయిలో చర్చలకు కూడా రెండు దేశాల ఉన్నతస్థాయి అధికార ప్రతినిధుల సమావేశం నిర్ణయించింది. రెండేళ్లకాలంలో మొదటిసారిగా జరిగిన ఈ చర్చల ఫలితంగా ఉత్తరకొరియా సియోల్‌లో జరిగే వింటర్ ఒలింపిక్స్‌కి తమ క్రీడా బృందాన్ని పంపాలని నిర్ణయించింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఒలింపిక్స్ జరుగుతాయి. కొరియా ద్వీపకల్పంలో ఇది మంచి పరిణామమని మూన్ అన్నారు. కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్ర రహితం చేయడం వేరు, రెండు కొరియాల మధ్య సంబంధాలు పెంపొందడం వేరు అని మూన్ పేర్కొన్నారు. సంబంధాలు మెరుగుపడిన తరువాత ఈ ప్రాంతాన్ని అణ్వస్త్రరహితం చేసే అంశంపైన చర్చలు జరపవచ్చునని మూన్ పేర్కొన్నారు. రెండు దేశాలకు సంబంధించిన పారిశ్రామిక జోన్‌ను 2016 ఫిబ్రవరి నుంచి దక్షిణకొరియా మూసివేసింది. ఉత్తరకొరియా సరిహద్దుల్లోగల కైసాంగ్ పట్టణం పారిశ్రామిక జోన్‌గా ఉంది. ఉత్తరకొరియా అణు పరీక్షలు జరిపిన తరువాతనే ఈ పారిశ్రామిక జోన్‌ను మూసివేశారు. తిరిగి ఈ జోనును పనిచేయించేందుకు ప్రయత్నాలు జరగనున్నాయి. తాను అధికారంలోవున్న కాలంలో ఈ ప్రాంతాన్ని అణ్వస్త్ర రహితం చేసేందుకు కృషి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు మూన్ పేర్కొన్నారు.



ఈయూ ఆర్థిక వ్యవస్థకు బ్రెగ్జిట్ ముప్పు

ప్రపంచబ్యాంకు హెచ్చరిక

లండన్ : యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగేందుకు సజావుగా ఒప్పందం కుదుర్చుకోవడంలో విఫలమైనందున ఇది 2018లో ఐరోపా ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునేందుకు బ్రెగ్జిట్ ముప్పుగా పరిణమించే అవకాశంవుందని ప్రపంచబ్యాంకు హెచ్చరించింది. బ్రెగ్జిట్‌వల్ల ఏదైనా ఆశ్చర్యకరమైన అంశం ఏమైనా ఉందంటే అది ఐరోపా ఆర్థికంగా పుంజుకోకుండా నిలువరించడమే అవుతుందని ప్రపంచబ్యాంకు పేర్కొన్నది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవటం బలంగానే ఉన్నప్పటికీ బ్రెగ్జిట్ కారణంగా ముప్పు ఉంటుందని ప్రపంచబ్యాంకు ప్రతినిధి ఫ్రాన్‌జిస్కా లిసిలుట్టిఒహన్‌సోర్జి జిన్హువా వార్తాసంస్థకు తెలిపారు. ప్రపంచ ఆర్థిక రంగం అవకాశాలపైన విశ్లేషణ జరిపి రచనలుచేసే వారిలో ప్రముఖమైన రచయిత. యూరోపియన్ యూనియన్‌లో అనిశ్చితి ప్రముఖంగా కనిపిస్తోంది. అది మరింత తీవ్రం కావచ్చు అని ఆమె పేర్కొన్నారు. బ్రెగ్జిట్‌పై జరుగుతున్న



చర్చలు ఐరోపా అంతటా పెట్టుబడుల నిర్ణయాలపై హానికర ప్రభావం చూపుతుందని ప్రపంచబ్యాంకు నివేదికను ఉదహరిస్తూ ఆమె పేర్కొన్నారు. బ్రిటన్ ఆర్థికవ్యవస్థపైన ఇప్పటికే ప్రతికూల ప్రభావంవుందని ఆమె పేర్కొన్నారు. బ్రెగ్జిట్ చాలా క్లిష్టమైంది. బ్రిటన్‌లో ఆర్థికవృద్ధి 1.6 శాతం నుంచి 1.4 శాతానికి తగ్గవచ్చునని ఆమె పేర్కొన్నారు. బ్రెగ్జిట్‌కి స్పష్టమైన పంథాలేదు. ఈయూ, బ్రిటన్‌లో రెండవది మరింత క్లిష్టమైన దశ చర్చలలో ప్రవేశించాయి. వాణిజ్యానికి సంబంధించి రెండుపక్షాల మధ్య స్పష్టమైన అవగాహనలేదు. 28 దేశాలతో కూడిన యూరోపియన్ యూనియన్ నుండి బ్రిటన్ వైదొలగుతున్న సందర్భంలో టారిఫ్‌లు, ఆర్థిక సేవలులాంటి అంశాలపైన ఇంతవరకు ఒప్పందం కుదరలేదని రెండు పక్షాలు కూడా లండన్‌లో నెలకొనివున్న ద్రవ్యపెట్టుబడుల మార్కెట్లపైన ఎక్కువగా ఆధారపడుతున్నాయని, రుణాలను చెల్లించేందుకు పెట్టుబడులకోసం ఈ మార్కెట్లపైన ఆధారపడటం ప్రతికూల ప్రభావం కలుగజేస్తుందని ఆమె పేర్కొన్నారు. బ్రెగ్జిట్‌పై ఒప్పందం కుదరడం లేదా టారిఫ్‌లపైన కఠినమైన నిబంధనలు ఉండటం ఒక నమూనాగా చూడలేమని అయితే ఇది వాణిజ్యానికి, వృద్ధికి విధ్వంసకరంగా మారుతుందని ఆమె పేర్కొన్నారు. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకేకాక ఐరోపా ఆర్థిక వ్యవస్థకు కూడా చిక్కులు తెచ్చిపెడుతుందని అన్నారు.

మైన్మార్‌లో రాయిటర్స్ జర్నలిస్టులపై కేసులు

బ్యాంకాక్ : అధికార రహస్య చట్టాన్ని ఉల్లంఘించి అత్యంత ముఖ్యమైన రహస్య పత్రాలను ఇరువురు పోలీసులనుంచి సేకరించారని ఆరోపిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థకు చెందిన ఇద్దరు జర్నలిస్టులను గత ఏడాది డిసెంబర్ 12వ తేదీన మైన్మార్ ప్రభుత్వం అరెస్టు చేసినట్టుగా వెల్లడైంది. ఈ అరెస్టును నిరసిస్తూ మైన్మార్ సరిహద్దుల్లో జర్నలిస్టులు ప్రదర్శన జరిపారు. రహస్య పత్రాలను అందజేసిన పోలీసు అధికారులు రఖిన్ రాష్ట్రంలో పనిచేశారు. ఆ రాష్ట్రంలో రోహింగ్యా ముస్లింలపై సైనిక దళాలు హింసాకాండకు పాల్పడటంతో దాదాపు ఆరున్నర లక్షలమంది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు వలసవెళ్లిన అంశాలకు సంబంధించిన రహస్య పత్రాలను రాయిటర్స్ జర్నలిస్టులు సేకరించినట్టు తెలిసింది. అనేక డజన్లమంది జర్నలిస్టులు నల్లదుస్తులను ధరించి బుధవారం ప్రదర్శన జరిపి అరెస్టు చేసిన తమ సహచరులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో వాలోని, క్యసోయిహో ఉన్నారు. వీరి తరపున కోర్టులో వాదిస్తున్న థాన్‌జాఅంగ్ అనే న్యాయవాది మాట్లాడుతూ వారికి 14 ఏళ్లు జైలుశిక్ష పడే అవకాశంవుందని అన్నారు. అయితే ఇది ఎంతమాత్రం తమకు సమ్మతంకాదని ఇరువురు



జర్నలిస్టులు పేర్కొన్నారు. జర్నలిస్టుల తరపున బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్టు ఆ న్యాయవాది తెలిపారు. పిటిషన్‌పైన ఈనెల 23న విచారణ జరుగుతుందని అన్నారు. మైన్మార్ ప్రభుత్వ చర్యను అంతర్జాతీయ మీడియా గ్రూపులు, హక్కుల గ్రూపులు తీవ్రంగా విమర్శించాయి. వలసపాలనా కాలంనాటి చట్టాలను అమలుచేస్తూ జర్నలిస్టులను అరెస్టు చేయడం సరైందికాదని ప్రభుత్వంలో కీలకపాత్ర ధారి అయిన అంగ్‌సాన్‌సూకీ నుద్దేశించి రాయిటర్స్ ఎడిటర్ స్టీఫెన్‌జెఅగ్లర్ వ్యాఖ్యానించారు. జర్నలిస్టులపై మోపిన అభియోగాలు తమను ఎంతగానో నిరాశపరుస్తున్నాయని ఆయన అన్నారు.

రాజ్యాంగ పరిధిలోనే కెటలోనియా ప్రభుత్వం



మాడ్రిడ్ : పాక్షిక స్వయం ప్రతిపత్తి కలిగిన కెటలోనియా ప్రాంతంలో ఏర్పడే ప్రభుత్వం స్పెయిన్ రాజ్యాంగ పరిధిలోనే పనిచేయాలని ఆదేశ అధ్యక్షుడు మరియనొరజాయ్ హెచ్చరించారు. అదే సమయంలో రాజకీయంగా సాధారణ పరిస్థితిని నెలకొల్పాలని రజాయ్ అన్నారు. స్పెయిన్‌లో మదుపుదారుల ఫోరంను ఆయన ప్రారంభిస్తూ కెటలోనియాలో అనిశ్చితి దేశానికి సవాలుగా నిలిచిందని తెలిపారు. కెటలోనియా ప్రాంతంలో వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితి నెలకొనడంతోపాటు పెట్టుబడులను అనుమతిం చాలని, జాతీయ చట్టాలలో ఉన్న అంశాలు వర్తింపచేయాలని రజాయ్ అన్నారు. కెటలోనియాలో అస్థిరత్వం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థపై నీలినీడలు ఏర్పడ్డాయి, అక్కడి పరిస్థితి చక్కబడితే దేశ ఆర్థిక వ్యవస్థ 3 శాతం వృద్ధి చెందుతుందని, గతంలోవున్న పరిస్థితి మళ్లీ ఏర్పడుతుందని ఆయన చెప్పారు. కెటలోనియా ప్రాంత అధ్యక్షుడు కార్లెస్‌పుయిగ్డిమంట్‌ను ఆయన మంత్రివర్గాన్ని రద్దుచేయడాన్ని సమర్థించుకుంటూ రాజ్యాంగంలోని 155వ ఆర్టికల్ ప్రకారం రద్దు చేశానని అన్నారు. ఆ ప్రాంత పార్లమెంటు ఎన్నికలు గత డిసెంబర్ 21వ తేదీన జరిగాయి. ఇప్పటివరకువున్న షెడ్యూల్ ప్రకారం కెటలోనియా కొత్త పార్లమెంటు డైరెక్టర్ల బోర్డు ఈనెల 17వ తేదీన ఏర్పాటవుతుంది. అనంతరం అధ్యక్షుడుగా ఎవరిని నియమించాలనేది నిర్ణయిస్తారు. ఇప్పటివరకు స్వాతంత్ర్యం కోరుతున్న శక్తుల నాయకుడిగా పుయిగ్డిమంట్ ఉన్నారు. బహుశా ఆయనే అధ్యక్ష బాధ్యతలను స్వీకరించే అవకాశాలు ఉన్నాయి.

టునీషియాలో ఘర్షణలు

టునిస్ : ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలపైన పోలీసులు విరుచుకుపడటంతో రెండు పక్షాల మధ్య ఘర్షణలు తలెత్తి ఒకరు చనిపోయారు. ప్రజా సమూహాలను చెల్లాచెదురు చేసేందుకు పోలీసులు బాష్పవాయువు గోళాలు ప్రయోగించి అనంతరం లాఠీలకు పనిచెప్పారు. ఈ ఘర్షణలు దేశ సరిహద్దుల్లో అశాంతికి దారితీయవచ్చునని ఆందోళన చెందుతున్నారు. ధరల పెరుగుదలతోపాటు పన్నులను కూడా ప్రభుత్వం పెంచివేసింది. దీంతో టెబోర్బా ప్రాంతంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. పోలీసుల లాఠీ ఛార్జీలో అనేక డజన్లమంది ప్రదర్శకులు గాయపడ్డారు. పలు డజన్లమందిని అరెస్టు చేశారు. ఘర్షణల్లో కొందరు పోలీసులు కూడా గాయపడ్డారు. అయితే ఈ ఘర్షణలు మరిన్ని పట్టణాలకు మంగళవారం రాత్రి విస్తరించాయి. 2010-11లలో దేశంలో తలెత్తిన కల్లోల పరిస్థితులు నిరంకుశ అధ్యక్షుడైన జిన్‌ఎల్‌అబి డిన్‌బెల్‌అలిని పదవీచ్యుతిడిని చేశాయి. ప్రస్తుతం జరుగుతున్న నిరసన ఉద్యమం ఆర్థిక పరిస్థితులపైనే ప్రారంభమయ్యింది. జాతీయ బడ్జెట్‌లోపేర్కొన్న అంశాలకు సంబంధించే ఈ నిరసన వ్యక్తమయ్యింది. ఇంధన ధరలు, అనేక వస్తువులపై పన్నులు, సేవల ధరలు పెరిగిపోయాయి. వార్షిక బడ్జెట్‌లో లోటును తగ్గించుకునేందుకే ప్రభుత్వం ప్రజలపైన భారం మోపింది. ఐఎంఎఫ్ ఒత్తిడిమేరకే ప్రభుత్వం ఈ



చర్యలకు పాల్పడిందని నిరసనకారులు తెలిపారు. ఐఎంఎఫ్ 2.9 బిలియన్ డాలర్ల రుణాన్ని టునీషియాకు అందజేసి పలు షరతులు విధించింది. నిరసనకారులు పోలీసు చర్యలపై ఆగ్రహించి బ్యాంకులు, షాపులు, పోలీసు స్టేషన్లపైన దాడులు జరిపారు. రోడ్లపైన టైర్లను కాల్చివేశారు. పోలీస్ స్టేషన్లపై గాసోలిన్‌బాంబులు విసిరారు. కసరిన్ పట్టణంలో అశాంతి నెలకొనడంతో సైన్యం జోక్యం చేసుకున్నదని టిఎపి వార్తాసంస్థ పేర్కొన్నది. అయితే నిరసన ప్రదర్శనలు, ఘర్షణలు ఆగే సూచనలు లేవని ఆవార్తాసంస్థ తెలిపింది.

దావోస్ ఆర్థిక సదస్సుకు ట్రంప్

వాషింగ్టన్ : స్విట్జర్లాండ్ నగరం దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొనే అవకాశాలున్నాయని వైట్‌హౌస్ తెలిపింది. దావో సదస్సు ఈనెలలోనే జరగనుంది. ప్రపంచదేశాల నుంచి పాల్గొనే నేతలతో మాట్లాడే అవకాశం ఉంటుందని. ఈ సందర్భంగా ట్రంప్ అమెరికా ఫస్ట్ ఎజెండాను మరింత ముందుకు తీసుకువెళ్లి అమెరికా వాణిజ్యం, పరిశ్రమలకు సంబంధించిన అంశాలను మరింత పటిష్టం చేసుకునే అవకాశం ఉంటుందని వైట్‌హౌస్ మీడియా ప్రతినిధి సరాహ్‌హక్‌బిశాండర్స్ తెలిపారు. దావోస్ సదస్సులో ప్రధానంగా అమెరికా ఫస్ట్ ఎజెండానే ఉంటుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ వాణిజ్యాన్ని, కార్మికరంగాన్ని వృద్ధిచేసేందుకే అమెరికా ఫస్ట్ ఎజెండాఅని ఆయన పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 26తేదీ వరకు దావోస్‌లో ఆర్థిక సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు బిల్‌క్లింటన్ తరువాత అమెరికా అధ్యక్షుడి హోదాలో హాజరవుతున్నది ట్రంప్ మాత్రమేనని శాండర్స్ పేర్కొన్నారు. గత ఏడాది జరిగిన సదస్సుకు ఉపాధ్యక్షుడు జోబిడెన్ హాజరయ్యారు.

స్పెయిన్‌లో అధిక నిరుద్యోగం

మాడ్రిడ్ : యూరోపియన్ దేశాలలోకెల్లా స్పెయిన్‌లో నిరుద్యోగం ప్రబలిపోయిందని అధికార గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2017 నవంబరులో 16.7 శాతం నిరుద్యోగం ఉన్నట్టు గణాంకాలు వెల్లడించాయి. యూరోపియన్ యూనియన్ కార్యాలయం నివేదిక ప్రకారం గ్రీస్ తరువాత స్పెయిన్‌లోనే ఎక్కువగా నిరుద్యోగం నెలకొనివుంది. గ్రీసు ఇంతవరకు తాజా గణాంకాలను ఇవ్వకపోవడంవల్ల స్పెయిన్ ప్రథమస్థానంలో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే గ్రీసులో 20.5 శాతం నిరుద్యోగం ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. జకోస్లొవేకియాలో అత్యంత తక్కువగా 2.5 శాతం నిరుద్యోగం ఉంది. దాని తరువాత జర్మనీ, మాల్టా ఉన్నాయి. ఈ రెండు దేశాల్లోను 3.6 శాతం నిరుద్యోగులు సమోదయ్యారు.

'కార్పొరేట్' కోసమే సవరణ



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అతుల్‌కుమార్ అంజాన్. పక్కన ప్రసాద్, రావుల వెంకయ్య, వడ్డే తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కార్పొరేట్, ప్రైవేటు రంగాలకు భూములు ధారాదత్తం చేసే కుట్రతోనే 2013-భూసేకరణ చట్టాన్ని సవరించి రాష్ట్రపతికి పంపారని అఖిల భారత కిసాన్‌సెల్(ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్ విమర్శించారు. ఐక్యంగా విజయవాడ ప్రెస్‌క్లబ్బులో బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన '2013 భూసేకరణ చట్టం సవరణ బిల్లును రాష్ట్రపతి ఆమోదించొద్దని' కోరుతూ రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య అధ్యక్షత వహించారు. దేశ వ్యాప్తంగా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ విధా నాల్ని అతుల కుమార్ విశ్లేషించారు. 2013- భూసేకరణ చట్టాన్ని సవరించి పెట్టుబడిదారి విధానాలకు కొమ్ము కాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు నిరసనగా రైతు సంఘాలు సమైక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. దేశంలో ఎకరా, రెండెకరాల చొప్పున చిన్న, మధ్య తరగతి రైతులు వ్యవసాయం సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు.అభివృద్ధి ముసుగులో రైతుల నుంచి వేలాది ఎకరాల రైతుల భూమిని సేకరించేందుకు గాను 2013 భూసేకరణ చట్టానికి సవరణలు చేపట్టారని వాపోయారు. బ్రిటన్, అమెరికా దేశాల్లో వ్యవసాయ రంగా నికి పెద్దపీట వేస్తున్నాయని వివరించారు. మన దేశం నుంచి యూరప్ విత్తనాలు కొనుగోలు చేసి, అక్కడ పండిన పంటలను తిరిగి 60 శాతంవరకూ మనకు దిగుబడి చేస్తోం దని వివరించారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తి రంగం పూర్తిగా తగ్గుముఖం పట్టిందని, వ్యవసాయ రంగం నిర్వీర్య మైందని వాపోయారు. ఏపీలో వ్యవసాయ సాగుకు భూమి లేకుండా చంద్రబాబు నదుల అనుసంధానం వల్ల ఉప యోగమేమిటని ఆయన ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టం సవరణ ప్రతిపాదనకు వ్యతిరేకంగా పార్టీలకు అతీతంగా ఉద్యమించాల్సిన అవసరముందని సూచించారు. 2013 భూసేకరణ చట్టానికి సవరణ చేయొద్దని రైతు సంఘాల ప్రతినిధుల బృందంతో రాష్ట్రపతికి విన్నవిస్తామని వెల్లడించారు.

భూసేకరణ చట్టసవరణపై దశలవారీ ఆందోళన : రావుల

భూసేకరణ చట్టసవరణను వ్యతిరేకిస్తూ దశల వారీగా ఆందోళనలు నిర్వహిస్తామని అఖిలభారత కిసాన్‌సెల్ (ఏఐకేఎస్) జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ దుర్మార్గమైన చర్యల్ని తొప్పికొట్టేందుకు గాను న్యాయపరంగానూ పోరాడతామన్నారు. రైతుల పొట్ట కొట్టేందుకే..2013 భూసేకరణ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేసిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండా దొడ్డిదారిన ప్రభుత్వం సవరణలు చేయడం దారుణమని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన 2013 భూసేకరణ సవరణ చట్టాన్ని ఆమోదించ వద్దని కోరుతూ సంతకాలు సేకరించి రాష్ట్రపతికి నివేదిస్తామన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవే పేరిట భూదోపిడీ: మాజీ మంత్రి వడ్డే

అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే పేరుతో ప్రభుత్వం పెద్దఎత్తున భూసేకరణకు ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు వాపోయారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు పొందేందుకే ప్రభుత్వం భూసేకరణకు దిగుతోందని విమర్శించారు. మచిలీపట్నం పోర్టుకు అవసరానికి మించి అధికంగా భూసేకరణ చేయడమే ఇందుకు నిదర్శనమని ఉదాహరించారు. వామ పక్ష రైతు సంఘాలకృషితో 2013 భూసేకరణ చట్టం వచ్చిందన్నారు.

మోడీ, బాబు రైతు వ్యతిరేకులు : నాగిరెడ్డి

మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తున్నాయని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీఎస్ నాగిరెడ్డి విమర్శించారు. ఏపీ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీఎస్‌ప్రసాదు మాట్లాడుతూ..2013 భూసేకరణ చట్టంలో సామాజిక ప్రభావ మదింపు, గ్రామసభ నిర్వహణ, రైతాంగ ఆమోదం, భూమిపై ఆధారపడిన వారికి నష్టపరిహారం, పునరావాసం, పునర్నిర్మాణం తదితర అంశాల్ని కల్పించారని వివరించారు. ఈ చట్టానికి సవరణ చేయడం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూమిని నమ్ముకుని జీవిస్తున్న గ్రామీణ పేదల పొట్టకొట్టి, సంపన్నులకు కట్టబెట్టే ప్రభుత్వాల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల భార్గవశ్రీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు డి.హరినాథ్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సూచనలకు అనుగుణంగా..రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులకు ధారాదత్తం చేసేందుకుగాను చంద్రబాబు పెద్ద ఎత్తున భూసేకరణ చేపడుతున్నారని విమర్శించారు. భూసేకరణ చట్టం సవరణలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమిద్దామని రైతు సంఘం రాష్ట్రనేత పి.పెద్దిరెడ్డి కోరారు.

సదస్సులో తీర్మానాలు...

2013 భూసేకరణ చట్టానికి సవరణ చేసి రాష్ట్రపతికి పంపిన బిల్లును ఆమోదించొద్దని కోరుతూ సదస్సులో తీర్మానించారు. అమరావతి రాజధాని ప్రాంత రైతు సంఘం నాయకులు అనుమోలు గాంధీ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శులు మల్నీడు యలమందరావు, జగన్నాథం, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తిప్పారెడ్డి రామకృష్ణారావు, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లా కార్యదర్శులు రమేష్, సి.సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, 13 జిల్లాల రైతు సంఘాల నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు నింగిలోకి పీఎస్ఎల్‌వీ సీ-40

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం ఉదయం పీఎస్ఎల్‌వీ సీ-40 ద్వారా కార్టోశాట్-2, మరో 30 ఉపగ్రహాలను నింగిలోకి పంపనుంది. పీఎస్ఎల్‌వీ 42 వెహికల్ ద్వారా 1323 కిలోల బరువు కలిగిన 31 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించనుంది. భారతదేశానికి చెందిన ఒక మైక్రో శాటిలైట్, ఒక నానో శాటిలైట్, కెనడా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, రిపబ్లిక్ ఆఫ్ కొరియాలకు చెందిన 3 సూక్ష్మ మైక్రో శాటిలైట్లు, 26 నానో శాటిలైట్లు మొత్తం 31 ఉపగ్రహాలను పంపేందుకు షార్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అంతర్జాతీయ వినియోగదారుల వాణిజ్య విభాగానికి చెందిన అంతరిక్ష విభాగం కింద భారతదేశంలోని ఒక సంస్థ అయిన ఆంట్రిక్స్ కార్పొరేషన్ లిమిటెడ్ మధ్య వాణిజ్య సేవలలో ఒప్పందంలో భాగంగా ఈ సిరీస్‌ను ప్రయోగించనున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు అన్ని పరీక్షలు నిర్వహించారు. గురువారం ఉదయం 5.28 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. ఈ ఉపగ్రహాన్ని రక్షణరంగం అవసరాలకు కూడా ఉపయోగించనున్నారు.

నాబార్డు నుంచి గ్రాంటు కావాలి : సీఎం

విశాలాంధ్ర - అమరావతి : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి లేఖ రాశారు. గతంలో పేర్కొన్నట్టుగా ఏపీకి చేసే ఆర్థిక సాయాన్ని విదేశీ ఆర్థిక సంస్థల నుంచి కాకుండా నాబార్డు నుంచి గ్రాంట్ రూపంలో అందించాలని కోరారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటన ప్రకారం కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2015 నుంచి 2020 వరకూ ఏపీకి 16,447 కోట్ల రూపాయలు రావాల్సి ఉంటుంది. నిబంధనల దృష్ట్యా ఈ మొత్తాన్ని ఈఏపీ ప్రాజెక్టుల కోసం వాడుకోవడం సాధ్యంకానందున నాబార్డు నుంచి ఇప్పిస్తేనే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొత్త రాష్ట్రాలకు కొంత వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఇచ్చే సాయాన్ని 9010 నిష్పత్తిలో ఇస్తే ఎంతయితే తేడా వస్తుందో ఆ మొత్తాన్ని విదేశీ ఆర్థిక సంస్థ నుంచి చేపట్టే ప్రాజెక్టులకు 2015-2020 మధ్యకాలంలో అందిస్తామనే ప్రకటనను తన లేఖలో సీఎం ప్రస్తావించారు. ఏపీకి 2015-16 సంవత్సరానికి రూ.2,951 కోట్లు అధికంగా నిధులు రావాల్సి ఉంది. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం దాన్ని 2,516 కోట్ల రూపాయలుగా మాత్రమే అంచనా వేసింది. అదే సూత్రం ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరానికి 2,854 కోట్ల రూపాయలు రావాల్సి ఉంది. 2015-16తో పోలిస్తే ఇది 13.43 శాతం అధికం. అదే వృద్ధిరేటు ప్రకారం చూస్తే 2017-18కి రూ.3,238 కోట్లు. అందువల్ల ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాల తరహాల్లోనే విదేశీ ఆర్థిక ప్రాజెక్టుల్లో ఏపీకి 90 :10 నిష్పత్తిలో ప్రత్యేక ఆర్థిక సాయం చేయాలి. ఇప్పటికే అమల్లో ఉన్న 2019-20 వరకూ సంతకం అన్ని ప్రాజెక్టులకు దీన్ని వర్తింపచేయాలి. కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్రకటన నేపథ్యంలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ఈఏపీ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవహారాల విభాగానికి పంపింది. ఈఏపీ కింద చేపట్టే ప్రాజెక్టులు మొదలు కావడానికి, పూర్తికావడానికి చాలా సమయం తీసుకుంటాయి. వీటికి విదేశీ ఆర్థిక సంస్థ నుంచి అనుమతులు పొందడానికి సుదీర్ఘ నిబంధనల ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు ఆర్థిక సాయాన్ని 2020లోపు పూర్తిగా ఖర్చు చేసే సామర్థ్యం ఆంధ్రప్రదేశ్‌కు లేదు' అని జైట్లీకి రాసిన లేఖలో వివరించారు. అందువల్ల పేర్కొన్న ప్రత్యేక ఆర్థికసాయాన్ని నాబార్డు నుంచి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. నాబార్డు ద్వారా ఏయే ప్రాజెక్టుకు నిధులు కావాలో ఆ జాబితాలు కూడా ముఖ్యమంత్రి ఈ లేఖలో అరుణ్‌జైట్లీ దృష్టికి తీసుకెళ్లారు. ఆ మొత్తాన్ని గ్రాంటు రూపంలో ఇవ్వాలని కోరారు.

ఒక్కటవుదాం..!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అవినీతి, అరాచక, మతోన్మాద, ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్న నరేంద్ర మోడీని గద్దె దించేందుకు లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకం కావాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పిలుపునిచ్చారు. విజయవాడలో మూడు రోజులుపాటు జరిగిన సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా, విజయవాడ నగర పార్టీల ఆధ్వర్యాన జింఖానా గ్రౌండ్స్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సురవరంతోపాటు, సీపీఐ పార్లమెంటరీ పార్టీ నాయకులు డి.రాజా, జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. సురవరం సుధాకరరెడ్డి మాట్లాడుతూ గత మూడేళ్ల ఎన్డీఏ పాలనను సమీక్షిస్తే అంతా అవినీతి, అరాచకం, అబద్ధాలతో సాగుతోందని ఆయన ధ్వజమెత్తారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికితీసి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు అకౌంట్‌లో జమ చేస్తామని చెప్పిన మోడీ, దేశం మొత్తం మీద కూడా 15 లక్షలు తీసుకురాలేకపోయారన్నారు. ఎవరెవరి డబ్బు విదేశాల్లో ఉందో దాదాపు 5 వేల మంది పేర్లతో పనామా పేర్లు వెల్లడించినప్పటికీ ఒక్కరి సొమ్ము కూడా వెలికితీయలేకపోయారని ఎద్దేవా చేశారు. నేను తినను, ఎవర్నీ తిననివ్వను అంటూ కబుర్లు చెబుతూ ఆచరణలో మాత్రం తినేవాడికి తిన్నంత అన్నట్లుగా వ్యవహరిస్తూ తినేవారి మూతులు తుడిచే కార్యక్రమం చేపడుతున్నారని విమర్శించారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసేటప్పుడు, తర్వాత ఎంపీగా పోటీ చేస్తున్న సమయంలో ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఆదాయ వివరాలు పరిశీలిస్తే 300 రెట్లు పెరిగింది. ఆయన కుమారుడు ఆస్తులు ఒక్క సంవత్సరంలోనే 80 కోట్లకు పెరిగాయి. ఇక ఎన్నికల సమయంలో మోడీకి విమానం బహుమతిగా అందజేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీ కంపెనీకి అయితే ఒక్క సంవత్సరంలోనే లక్షా 4 వేల కోట్ల అదనపు ఆదాయం లభించింది. అంబానీకి రూ.85 వేల కోట్లు అదనపు ఆదాయం లభించింది. రూ.11 వేల కోట్లకు పైగా ఎగనామం పెట్టిన విజయ్ మాల్యా విదేశాల్లో జల్సాగా తిరుగుతున్నారు. వాస్తవ పరిస్థితులు ఇలా వుంటే మోడీ మాత్రం అవినీతి నిర్మూలనే నా ధ్యేయమంటూ కోతలు కోస్తున్నారని సురవరం విమర్శించారు. అవినీతి నిర్మూలనపై నిజంగా చిత్తశుద్ధి వుంటే 'లోక్‌పాల్' ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. మరోపక్క మతోన్మాదశక్తులు పెట్రేగిపోతున్నాయన్నారు. గోసంరక్షణ దళాలు దాదాపు 30 మందిని పొట్టనబెట్టుకోగా, వీరిలో 24 మంది ముస్లింలేనన్నారు. వీరి హత్యాకాండపై నేరుగా సుప్రీంకోర్టు విచారణకు ఆదేశించినా ఇప్పటి వరకు కనీసం ఒక్క బాధ్యుడిని కూడా శిక్షించలేదన్నారు. పైగా హతుని బంధువులందరిపై వివిధ కారణాలతో కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. మేధావులు, జర్నలిస్టులపై కూడా దాడులు పెద్దఎత్తున జరుగుతున్నాయని, రోజంతా ఉపన్యాసాలు ఇచ్చే ప్రధాని వీటిపై మాత్రం మౌనం పాటిస్తూ 'మహా మౌని మోడీ'గా అవతారమెత్తుతున్నారని ఎద్దేవా చేశారు. మనువాదుల కేంద్రంగా వున్న సంఘ్ పరివార్ కాలం చెల్లిన వర్ణ వ్యవస్థను మళ్లీ పునరుద్ధరించే ప్రయత్నం చేస్తుందని ఆయన మండిపడ్డారు. కేంద్ర పాలనకు ఢిల్లీ కేంద్రమైతే మోడీ పాలనకు ఆర్‌ఎస్ఎస్ కేంద్రమైన నాగపూర్ నుండి రిమోట్‌గా మారిందన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తున్నారు. రైతాంగ సంక్షేమాన్ని విస్మరించారు. కనీసం పంటల ధరలను కూడా నిర్ణయించే పరిస్థితి లేకుండా పోయింది. పంటల బీమా పేరుతో పెద్దమొత్తంలో వసూలు చేసి, దానిలో 10 శాతం కూడా వారికి నష్టపరిహారం చెల్లించలేదని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అడ్రస్ కూడా లేని ఆర్‌ఎస్ఎస్ శక్తులు దేశభక్తి గురించి మాట్లాడడం, ఈ దేశం కోసం అనేకమంది ప్రాణత్యాగాలు చేసిన కమ్యూనిస్టులను విమర్శించడం విడ్డూరంగా వుందన్నారు. మతం పేరుతో దేశాన్ని చీల్చాలనుకునే, ఈ దేశం కోసం నిత్యం శ్రమించే దళితులపై దాడులకు పాల్పడుతున్నవారే దేశ ద్రోహులని సురవరం విమర్శించారు. ప్రజా వ్యతిరేక, అభివృద్ధి నిరోధక మోడీ ప్రభుత్వాన్ని తక్షణమే తొలగించాల్సిన అవసరం వుందన్నారు. అయితే కమ్యూనిస్టులు ఒక్కరే ఈ పని చేయలేరని, దీనిపై లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులంతా ఏకం కావాల్సిన అవసరం వుందన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా వున్న కాంగ్రెస్ పార్టీ, ప్రాంతీయ పార్టీలు, బీజేపీ ప్రభుత్వాలతో ఇబ్బందులు పడుతున్నవారు, మనుధర్మ శాస్త్రాన్ని వ్యతిరేకించేవారు, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని తపించేవారు, దళితులు, మైనార్టీలంతా కలిసి 'మహా సంఘటన'గా ఏర్పడాల్సిన అవశ్యకత ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జె.వి.సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, రావుల వెంకయ్య, మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖరరావు, మాజీ ఎమ్మెల్యే షేక్ నాసర్‌వలి, కృష్ణా జిల్లా, నగర కార్యదర్శులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, జిల్లా, నగర కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.

20 ప్రాజెక్ట్‌లకు రూ.100 కోట్ల నాబార్డ్ రుణం

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రంలోని 9 జిల్లాల్లోని 20 ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వానికి 100.84 కోట్ల రుణాన్ని నాబార్డ్ మంజూరు చేసింది. అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, కృష్ణ, శ్రీకాకుళం, విశాఖపట్నం, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాలలోని 20 ప్రాజెక్టులకు ఈ నిధులు మంజూరయ్యాయి. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి క్రింద రుణాన్ని నాబార్డ్ మంజూరు చేసింది. ఈ రుణం ద్వారా నిర్మించే ప్రాజెక్టులు పూర్తయితే 9965.56 హెక్టార్లకు సాగునీరు అందుతుంది. 2017-18 క్రింద రాష్ట్రానికి ఇప్పటివరకు 720 కోట్లు రుణ సహాయం అందించినట్లు ఆర్‌ఐడీఎఫ్ ప్రారంభించినప్పటి నుండి ఏపీకి 13,634.33 కోట్లు రుణ సహాయం మంజూరు చేశామని, ప్రధానంగా నీటి పారుదల, విద్య, గ్రామీణ అనుసంధానం కార్యక్రమాల కోసం ఈ నిధులు కేటాయించినట్లు నాబార్డ్ ఏపీ సీజీఎం కె.సురేష్‌కుమార్ తెలిపారు.

పండుగ రద్దీతో రైల్వే ప్లాట్‌ఫామ్ టిక్కెట్ ధర పెంపు

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : సంక్రాంతి పండుగ పేరుతో విజయవాడ రైల్వే అధికారులు ప్లాట్‌ఫామ్ టిక్కెట్ ధర పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. రైల్వేశాఖ ప్రజల అవసరాలను పలు రకాలుగా దోచుకోవడం ఆనవాయితీగా మారింది. గతంలో రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించి డిమాండ్‌ను బట్టి రేట్లను నిర్ణయిస్తుంది. అలాగే రైల్వేస్టేషన్‌లో కూడా రద్దీ అధికంగా ఉంటే ప్లాట్‌ఫామ్ టిక్కెట్లు కూడా పెంచుకోవచ్చునని ఆదేశాలు జారీ చేశాయి. దీంతో ఇప్పటి వరకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోనే దసరా, సంక్రాంతి, క్రిస్‌మస్ పండుగల సమయంలో ఈ ప్లాట్‌ఫామ్ టిక్కెట్లను పెంచి అమ్మసాగారు. అయితే గతంలో ఈ ఆనవాయితీ విజయవాడకు కూడా వర్తింప చేశారు.అయితే ఇప్పుడు విజయవాడతో పాటు రాజమండ్రి, నెల్లూరు రైల్వేస్టేషన్‌లలో కుడా అమలు చేయబోతున్నారు. ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫామ్ టిక్కెట్ రూ.10 నుండి ఒక్కసారిగా 20 రూపాయలకు పెంచివేశారు. దీనిని గురువారం నుండి ఈనెల 17వ తేదీ వరకు అమలు చేస్తున్నారు.

పాలవాగు పూడ్చివేతతో రాయపూడికి వరద ముప్పు

సీఆర్డీఏ అధికారులపై స్థానికుల ఆగ్రహం



విశాలాంధ్ర అమరావతి : రాజధాని నిర్మాణంలో సర్కార్ నిర్ణయాలతో రోజుకో వివాదం తెరమీదకు వస్తోంది.ఇప్పటికే భూసేకరణ విషయం వివాదస్పద అంశంగా మారగా, పాలవాగు రూపంలో మరో వివాదం ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోంది. దశాబ్దాల చరిత్రగల పాలవాగు రాజధాని గ్రామాల్లో ఒకటైన రాయపూడి గ్రామం వద్ద కొండవీటి వాగులో కలుస్తుంది. వరదలు ,వర్షాలు సంభవించిన సమయంలో వరద ఉధృతి నుంచి గ్రామాలను కాపాడటంలో ఈ వాగు ప్రధాన పాత్ర పోషిస్తోంది. రాజధాని నిర్మాణంలో భాగంగా పాలవాగుని పూడ్చి వేయడంతో సీఆర్డీఏ అధికా రులపై రాయపూడి , అబ్బు రాజుపాలెం వాసులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇటీవల జరిగిన సామాజిక ప్రభావ అంచనా సర్వేలోనూ వారి నిరసన గళం వినిపించారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా అభివృద్ధి పేరుతో ఏ విధంగా వాగులు , చెరువులు పూడ్చి వేస్తారని రైతులు, గ్రామస్థులు మండిపడు తున్నారు.

పాలవాగు నేపథ్యం

గుంటూరు జిల్లాలోని పెద్దకురపాడు మండలం నుంచి ప్రారంభం మయ్యే పాలవాగు అమరావతి మీదగా తుళ్లూరు మండలంలోని రాయపూడి వరకు అంటే దాదాపు 40 కిలోమీటర్ల ప్రవహించి కొండవీటి వాగులో కలుస్తుంది. అయితే వర్షాకాలంలో ఈ వాగులో వరద నీరు ఉధృత స్థాయిలో ప్రవహిస్తుంది.

రెండు పాయలుగా ప్రవహించే పాలవాగు ఒక పాయ వెలగపూడి , మందడం మీదగా కృష్ణాయపాలెం వద్ద కొండవీటి వాగులో కలుస్తుండగా, మరో పాయ రాయపూడి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. కాగా 40 అడుగులకు పైగా వెడల్పుతో ప్రయాణించే పాలవాగు కింద 1,300 ఎకరాల భూమి సాగువుతుంది. పాలవాగు పూడ్చివేతతో వరద నీరు ప్రవహించే క్రమం తీవ్ర ఇబ్బందులకు దారి తీస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజధానిలో వాగులు చెరువులు పూడ్చే సమ యంలో ప్రత్యామ్నాయ చర్యలకు కూడా అదే స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వాలని వారు డిమాండు చేస్తున్నారు.

లే ఔట్ల కోసం..?

రాజధాని నిర్మాణాలకు భూములు ఇచ్చిన రైతులకు రాజధానిలోనే భూములు కేటాయించాల్సి ఉండటంతో ఇందుకనుగుణంగా పాలవాగుని పూడ్చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పాలవాగుని పూడ్చేసి ఆ ప్రాంతంలో రైతులకు ప్లాట్లు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.పాలవాగు పూడికతో ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరు దిగువకు వచ్చే సమయంలో రాయపూడి వద్ద నిలిచిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. దీనితో వరద నీటి తాకిడి తుళ్లూరు మండలంలోని దొండపాడు, రాయపూడి ,అబ్బురాజుపాలెం గ్రామాలను నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే రాయపూడి గ్రామంలో మురుగునీరు నిలిచి పోతుండగా, రాబోయే వర్షాకాలపు భయాన్ని , ఆందోళనను గ్రామస్థులకు ముందే చవి చూపిస్తోంది.

గ్రీన్ ట్రిబ్యూనల్ తీర్పు ఉల్లంఘన

చెరువులు,వాగులు పూడ్చకుడదన్న నిబంధనను సీఆర్డీఏ అధికారులు తుంగలో తొక్కుతూ, గ్రామమే మునిగి పోయే పరిస్థితి ఉందని తెలిసినా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మల్లెల హరీంద్రనాథ్ చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కి తెలియకుండా అధికార్లు ఇష్టానుసారం వ్యవహరి స్తున్నారని, అధికారుల వైఖరితో సీఎంకి ప్రజలలో ఉన్న ఖ్యాతి దెబ్బ తింటుందన్నారు. పర్యావరణానికి హాని చేసే విధంగా అధికార్లు ,ప్రజాప్రతినిధులు నిర్ణయాలు తీసుకోవడం మంచి పద్ధతి కాదని, సామాజిక ప్రభావ అంచనా సర్వేలో తమ ఇబ్బందులు తెలియచేస్తున్నా ఏ మాత్రం పట్టించుకోక పోవటం శోచనీయమన్నారు. రాజధాని నిర్మాణంతో పాటుగా ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని నియంత పోకడలు మంచి పద్ధతి కాదన్నారు.

– మల్లెల హరీంద్రనాథ్ చౌదరి

వాగు పూడ్చితే ...ఇల్లు మునకే....

రాజధాని అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, ఇప్పటికే కిలోమీటరన్నర పైగా పాలవాగు పూడ్చేశారని చింతరాల కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని,ఆగస్ట్ , సెప్టెంబర్ మాసాల్లోని అధిక వర్షాలకు వరదలు సంభవించి పాలవాగు చివరన ఉన్న రాయపూడి గ్రామం మునిగి పోతుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో ఇబ్బందులు లేని రీతిన అభివృద్ధి పనులు చేపట్టి,రాయపూడి పరిసర గ్రామ ప్రజలు కష్టాలు పరిష్కరించాలని ఆయన కోరారు.

చింతరాల కోటేశ్వరరావు
(తాడికొండ నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు)



నిధుల కోసం చెన్నంపల్లి
కోటలో కొనసాగుతున్న తవ్వకాలు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : చెన్నంపల్లి కోటలో నిధుల కోసం గత 28రోజుల నుంచి చేపట్టిన తవ్వకాలు కొనసాగుతున్నాయి. స్కానర్లతో కొంతమంది అనుభవమున్న వారితో కోటలో నిధి ఉన్న స్థలాన్ని గుర్తించేందుకు ప్రయత్నాలు చేశారు. కోటలో నిధులు ఉన్నాయని గతంలో అనేక మంది తవ్వకాలు జరపడంతో అధికారులు కోటలో గత నెల 13వ తేదీన తవ్వకాలు ప్రారంభించారు. కోటలో పెద్దఎత్తున నిధులు ఉన్నాయని వదంతులు ఉన్నా నేటి వరకు ఎటువంటి ఆనవాలు కానరాలేదు. 102 ఎకరాలలో కోట ఉండటంతోపాటు పెద్దపెద్ద రాళ్లు ఉండటం నిధి ఎక్కడ ఉందో అర్థం కాక సుమారు ఏడు చోట్ల తవ్వకాలు నిర్వహించారు. చివరకు కోటలోని బావిలో రహస్య మార్గం ఉన్నట్లు స్కానర్ ద్వారా గుర్తించిన అధికారులు బావిలోని నీటిని ఇంజన్ల ద్వారా గత రెండు రోజుల నుంచి తోడిపోస్తున్నారు. బావిలో నిధులు దాచి ఉండవచ్చని బావిలోని నీరు తోడి వేస్తుండగా బావిలో రైల్వేశాఖకు సంబంధించిన ఇనుప వస్తువులు బయటపడ్డాయి. గతంలో చెన్నంపల్లి సమీపంలో రైల్వే పనులు చేస్తున్నప్పుడు కొందరు గ్రామస్తులు ఇనుము తీసుకొని దాచుకోగా రైల్వే అధికారులు దాడులు నిర్వహిస్తారన్న విషయం తెలుసుకున్న కొందరు గ్రామస్తులు ఇనుప వస్తువులను బావిలో వేసినట్లు సమాచారం. నీటిని తోడి వేస్తుండగా ఇనుప వస్తువులు బయటపడ్డాయి. బావిలో సుమారు 10 అడుగుల లోతులో ఒక రహస్య రహదారి ఉన్నట్లు గుర్తించారు. ఈ రహదారి చెన్నంపల్లి నుంచి గుత్తి కోట వరకు ఉంటుందంటున్నారు. మట్టితో పూడుకొని పోవడంతో సుమారు 10మీటర్ల వరకు కానవచ్చినట్లు తెలుస్తున్నది. మరో నెల రోజులైనా తవ్వకాలు నిర్వహించి నిధి ఆనవాలు కనుగొనాలని అధికారులు పట్టుదలతో ఉన్నారు.

సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా ?

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఇందిరా సాగర్ పోలవరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారా అని వైసీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ప్రశ్నించారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో లోటస్‌పాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలవరంపై విచారణ జరిపితే చంద్రబాబు నెలరోజుల్లోపే జైలుకు వెళ్తారని చెప్పారు. ప్రభుత్వం ప్రాజెక్టు అంచనాలను మూడింతలు పెంచి, రెండింతలు మింగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే సీబీఐ విచారణకు సిద్ధం కావాలన్నారు. పెట్టుబడులపై చంద్రబాబు తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అపోలో టైర్స్ రూ.1,800 కోట్లు పెట్టుబడి పెడుతోందని ప్రభుత్వం ఊదరగొట్టిందని, కంపెనీ వెబ్‌సైట్లో చూస్తే రూ.525 కోట్ల పెట్టుబడులను మాత్రమే పెడుతున్నట్లు ఉందని చెప్పారు. విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సుపైనా ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాటలన్నీ పచ్చి అబద్ధాలని ఆరోపించారు. ఇప్పటివరకూ రూ.15లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరియాని ప్రభుత్వం చెబుతుంటే కేంద్రం మాత్రం రూ.12 వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయని పేర్కొంటోందన్నారు. జీడీపీ విషయంలోనూ చంద్రబాబు కల్లబుల్లి మాటలు చెబుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అపోలో టైర్స్ పెట్టుబడి, జీడీపీలపై వాస్తవాలు చెప్పాలని డిమాండు చేశారు.

ఈ ఏడాది డీజీపీసహా
8 మంది ఐపీఎస్‌ల పదవీ విరమణ
జూన్‌లో మాలకొండయ్య, సెప్టెంబర్‌లో రమణమూర్తి

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఈ ఏడాది మొత్తం 8 మంది ఐపీఎస్ అధికారులు పదవీ విరమణ చేయనున్నారు. వీరిలో ప్రస్తుత డీజీపీ డాక్టర్ ఎం మాలకొండయ్య (1984 ఐపీఎస్ బ్యాచ్) కూడా ఉన్నారు. ఆయన ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో డీజీపీగా ఆయన ఆరు నెలలు మాత్రమే పదవిలో కొనసాగనున్నారు. ఐపీఎస్‌లకు సంబంధించిన పదవీ విరమణలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేష్‌కుమార్ బుధవారం విడుదల చేశారు. మా డీజీపీ - మా ఇష్టం మేరకు ప్రభుత్వం పోలీసు చట్టాన్ని సవరించి సీనియార్టీ ప్రకారం రాష్ట్ర క్యాడర్‌కు చెందిన ఐపీఎస్‌లకు డీజీపీ పోస్టు ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగానే గత నెలలో డీజీపీ ఎన్ సాంబశివరావు పదవీ విరమణ చేయగా, ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఎం మాలకొండయ్యను ప్రభుత్వం డీజీపీగా నియమించింది. ఈయన తర్వాత రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న 1982 బ్యాచ్‌కు చెందిన ఎన్‌వీ రమణమూర్తి సెప్టెంబర్ 30న పదవీ విరమణ చేయనున్నారు. అలాగే ఐపీఎస్ అధికారులు కె కోటేశ్వర రావు (2005) ఈ నెలాఖరుకు, బీవీ రమణమూర్తి (2000) ఫిబ్రవరి 28న, షేక్ మహ్మద్ ఇక్బాల్ (1999) ఏప్రిల్ 30న, ఎం సుబ్బారావు జూలై 31న పదవీ విరమణ చేయనున్నారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా ఉన్న డాక్టర్ టీ యోగానంద్ (1998) ఆగస్టు 31న, జే బ్రహ్మారెడ్డి నవంబర్ 30న పదవీ విరమణ చేసేవారిలో ఉన్నారు.

నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీలకు
ఎన్‌సీడీసీ రూ.235 కోట్ల రుణం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : సహకార రంగంలో ఆటు పోటులను ఎదుర్కొంటున్న నాలుగు చక్కెర ఫ్యాక్టరీలకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) రూ.235 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. చక్కెర ఫ్యాక్టరీలలో ఈ ఏడాది చెరకు క్రషింగ్ నిర్వహించేందుకు మూలధన పెట్టుబడి కోసం ఈ మొత్తాన్ని ఉపయోగించనున్నట్లు పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ఎం గిరిజా శంకర్ బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సహకార రంగంలో ఉన్న ఈ నాలుగు ఫ్యాక్టరీలు పెట్టుబడి కోసం రాష్ట్ర సహకార బ్యాంక్ (ఆప్కాబ్) నుంచి 12.50 శాతం వడ్డీకి అప్పు తీసుకున్నాయి. అయితే ఎన్‌సీడీసీ కేవలం 8.5 శాతం వడ్డీకే ఈ మొత్తం రుణాన్ని మంజూరు చేసింది. ఈ రుణానికి ప్రభుత్వం హామీగా ఉంది. రూ.235 కోట్ల రుణానికి సంబంధించి రెండు శాతం కమీషన్‌ను తీసుకుని ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి జమ చేయాలని డైరెక్టర్ ఆఫ్ షుగర్స్ అండ్ కేన్ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఆప్కాబ్ నుంచి తీసుకున్న అప్పులో మిగిలిన బకాయి మొత్తాన్ని వడ్డీతో సహా తీర్చగా, మిగిలిన మొత్తాన్ని మూలధన పెట్టుబడిగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది. అధిక వడ్డీకి అప్పులు తీసుకోవటం వల్ల అసలుకంటే వడ్డీయే ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ షుగర్స్ అండ్ కేన్ కమిషనర్ నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీలకు రుణాన్ని మంజూరు చేయాలని ఎన్‌సీడీసీని కోరుతూ ప్రతిపాదనలు పంపించింది. ఎన్‌సీడీసీ మంజూరు చేసిన రుణంలో ఆయా చెరుకు ఫ్యాక్టరీలు క్రషింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాఖపట్నం జిల్లా గోవాడలోని ది చోడవరం కో ఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్‌కు ఎన్‌సీడీసీ రూ.120 కోట్ల రుణం మంజూరైంది. ఇందులో ఆప్కాబ్ నుంచి చోడవరం షుగర్స్ తీసుకున్న రుణ బకాయిని వడ్డీతోసహా రూ.76 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే విశాఖ జిల్లా రాయవరం మండలం ఏటికొప్పాకలోని ఏటికొప్పాక కో ఆపరేటివ్ అగ్రికల్చరల్ అండ్ ఇండస్ట్రియల్ సొసైటీ లిమిటెడ్‌కు రూ.45 కోట్ల రుణం మంజూరవ్వగా అందులో రూ.20.96 కోట్లను ఆప్కాబ్‌కు చెల్లించాల్సి ఉంది. మిగిలిన మొత్తంలో 2017-18 సంవత్సరంలో చెరకు క్రషింగ్ నిర్వహించుకోవాలని ప్రభుత్వం సూచించింది. పాయకారావుపేటలోని తాండవ కో ఆపరేటివ్ షుగర్స్ లిమిటెడ్‌కు రూ.40 కోట్లను, విజయనగరం జిల్లాలోని శ్రీ విజయరామ గజపతి కో ఆపరేటివ్ షుగర్స్ లిమిటెడ్‌కు రూ.30 కోట్ల మూలధన పెట్టుబడిని ఎన్‌సీడీసీ రుణంగా మంజూరు చేసింది.

జన్మభూమికి అరకోటి జనం

విశాలాంధ్ర-అమరావతి : 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమమంలో ఇప్పటి వరకు అరకోటి మంది ప్రజలు పాల్గొన్నారని ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ బుధవారం తెలిపారు.

జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు మొత్తం 9,49,592 వనతులు అందాయన్నారు. అత్యధికంగా గుంటూరు జిల్లాలో 1,21,814 వినతులు, అత్యల్పంగా శ్రీకాకుళం జిల్లాలో 24,165 వినతులు అందినట్లు చెప్పారు.

అప్‌లోడ్ చేసిన వినతులు 7,09,955 (75%), అత్యధికంగా కృష్ణాజిల్లాలో 1,05,964 (99%), అత్యల్పంగా కర్నూలు జిల్లా 46,589 (51%), అప్‌లోడ్ చేసిన వాటిలో ఆర్థిక వినతులు 6,29,816, అత్యధికంగా కృష్ణా జిల్లాలో 98,277 అప్‌లోడ్ చేసిన వాటిలో ఆర్థికేతర వినతులు 20,438, అత్యధికంగా గుంటూరు జిల్లా 4,373, అత్యల్పంగా నెల్లూరు జిల్లా 623, అప్‌లోడ్ చేసిన వాటిలో ఆర్థిక వినతులు 21,724, అత్యధికంగా విశాఖ జిల్లాలో 3,078, అత్యల్పంగా కర్నూలు జిల్లాలో 557, అప్‌లోడ్ చేసిన వాటిలో ఆర్థికేతర వినతులు 37,979, అత్యధికంగా తూర్పుగోదావరిలో 4,656, అత్యల్పంగా శ్రీకాకుళం జిల్లాలో 1,253, అప్‌లోడ్ చేసిన వాటిలో పరిష్కరించిన వినతులు 2,36,104, అత్యధికంగా కృష్ణా జిల్లా 63,540, అత్యల్పంగా పశ్చిమ గోదావరిలో 1,958, వినతులు ఏడో రోజుకన్నా ఎనిమిదో రోజు 11% పెరిగాయని, ప్రజల హాజరు ఏడో రోజు కన్నా ఎనిమిదో రోజు 15% పెరిగిందని పరకాల వివరించారు.

జన్మభూమి ఎనిమిదో రోజు అన్ని జిల్లాలకు 'సి' గ్రేడ్ వచ్చింది. ఎనిమిదో రోజు గ్రేడింగ్‌లో కర్నూలు జిల్లా 28 స్కోర్‌తో ముందుంటే, కడప జిల్లా 21 స్కోర్‌తో అడుగున ఉందన్నారు. 5కె రన్‌లో 1,99,120 పాల్గొన్నారన్నారు. మొదటి ఎనిమిది రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు 72,491 నిర్వహించమన్నారు.

జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు మొత్తం గ్రామసభలు 80,203 నిర్వహించిన్నట్లు తెలిపారు. మొత్తం వచ్చిన వినతులు 9,36,754, పాల్గొన్న ప్రజల సంఖ్య 51,48,739, రేషన్ కార్డుల పంపిణీ 1,58,241, కొత్తగా పింఛన్లు 95,097, హెల్త్ క్యాంపులు 15,088, నమోదు చేసుకున్న రోగుల సంఖ్య 11,33,934, కళ్ల జోళ్ల పంపిణీ 42,174, బహుమతులు, పురస్కారాలు 1,92,967 అందించామన్నారు. 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం తొమ్మిదో రోజు 10వ తేదీ మొత్తం వచ్చిన వినతులు 38,645, ప్రజల సంఖ్య 1,83,912, రేషన్ కార్డుల పంపిణీ 5,592, కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు 3,978 ఇళ్ల స్థలాల పంపిణీ 1,003, పనిముట్ల పంపిణీ 728 బహుమతులు, పురస్కారాలు 7,654 అందించామన్నారు.

మేటి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతా..
ముమ్మిడివరం జన్మభూమి సభలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-ముమ్మిడివరం : నవ్యాంధ్రను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్ది, అమరావతిని దేశం లోనే మేటి నగరంగా రూపొందించడమే తమ లక్ష్యమని, ముఖ్య మంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వెనుకబడిన వివిధ సామాజిక వర్గాలను అభివృద్ధి చేసి సమాజంలో ధనిక - బీద వ్యత్యాసాన్ని తగ్గిం చడం కోసమే టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని, బుధవారం ముమ్మిడివరం మండలం చెయ్యేరు గున్నెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన 5వ విడత జన్మ భూమి-మాఊరు కార్యక్రమంలో తెలిపారు. రాష్ట్రం విభజన జరిగే సమయానికి రూ. 90వేలు ఉన్న తలసరి ఆదాయాన్ని మూడేళ్ల లో రూ.1,20, 000 వరకు పెంచామని, 2022నాటికి మన పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా రూ. 1,50,000 తలసరి ఆదాయం సాధించడమే లక్ష్యంగా సాగుతున్నా మన్నారు. గతంలో మలేషియా, సింగ్‌పూర్ ఉమ్మడి దేశంగా ఉండేవని సింగ్‌పూర్‌ను వెనుకబడిన ప్రాంతంగా భావించి నాటి రోజులలో మలేషియా వేరు చేసిందని అయితే కృషిని నమ్ముకుని టెక్నాలజీతో ముందడుగు వేసిన సింగపూర్ ప్రస్తుతం మలేషియా కంటే ఎన్నో రెట్లు ముందడుగులో ఉందని వివరించారు. అదేవిధంగా మన రాష్ట్రాన్ని విడదీశారని, 2029నాటికి అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించి దేశంలోనే మేటి నగరంగా అమరా వతిని తీర్చిదిద్దడంతో పాటు సర్వతోముఖాభివృద్ధి చేయడం కోసం అంద రూ సహకరించాలన్నారు.వెనుకబడిన అన్ని వర్గాలను ఆదుకోవడమే టీడీపీ లక్ష్యమని అందులో భాగంగా కాపులకు విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం బీసీల్లో చేర్చామన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో మత్స్య కారులు ఎస్టీలుగా ఉన్నారని మనరాష్ట్రంలో కూడా ఎస్టీల హక్కులకు నష్టం కలుగకుండా మత్స్య కారులను ఎస్టీల్లో చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నా మన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలను ఆదుకుంటామని, టెక్నాలజీ అభివృద్ధి తోపాటు వ్యవసాయరంగంలో ఆక్వా, పాడి, పండ్లు, కూరగాయల తోటలు, పప్పు ధాన్యాల పెంపకానికి రైతులకు సహకారం అందిస్తు న్నామన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, పోలవరం సహా పలు ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తామని, సాగునీరు, త్రాగునీరు అందించ డంతో పాటు విద్యుత్ ఉత్పత్తిని వృద్ధిచేసి అతి తక్కువ ధరలకే ప్రజలకు అందిస్తా మన్నారు. స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు కిమిడి కళావెంకటరావు, నిమ్మ కాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఆటలతో నూతనోత్తేజం
రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి అనురాధ

విశాలాంధ్ర అమరావతి : సంక్రాంతి సంబరాల్లో భాగంగా సచివాలయంలో ఉద్యోగులకు నిర్వహిస్తున్న ఆట విడుపు కార్యక్రమాలు ఉత్తేజానిస్తాయని రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి అనురాధ వెల్లడించారు. సచివాలయ ఆవరణలో మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు, పురుషులకు కబడ్డీ పోటీలను బుధవారం నిర్వహించారు.రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎల్వీ.సుబ్రహ్మణ్యం, రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి అనురాధ, రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎల్వీ. సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి కె.సునీత మహిళా ఉద్యోగులు వేసిన ముగ్గులను తిలకించారు.

అనురాధ విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి ప్రతి ఏటా సచివాలయంలో సంక్రాంతి సంబరాలను ప్రభుత్వం నిర్వహించి, ఉద్యోగులకు సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యు.మురలీకృష్ణ మాట్లాడుతూ, సంక్రాంతి సంబరాల నిర్వహణకు ఈ ఏడాది కూడా ప్రతి జిల్లాకు ప్రభుత్వం కోటి రూపాయలు, సచివాలయంలో ఆటల పోటీల నిర్వహణకు మూడు లక్షల రూపాయలు కేటాయించిందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నామన్నారు. పురుషుల కబడ్డీ పోటీల్లో 15 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీల్లో విజేతలకు కూడా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. గురువారం మహిళా ఉద్యోగుల కోలాటం, గంగిరెద్దుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

సోలార్ వినియోగం పెరిగింది : అజయ్ జైన్

విశాలాంధ్ర అమరావతి: రాష్ట్రంలో సోలార్ వినియోగం పెరిగిందని,అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకుంటున్నారని ఎనర్జీ డిపార్టుమెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ వెల్లడించారు. వ్యవసాయదారులకు సోలార్ పంపుసెట్లను నెడ్ క్యాప్ ద్వారా పంపిణీ చేస్తున్నామని, ఈ ఏడాది 30 వేల పంపుసెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయంలోని ఆయన చాంబరులో నెడ్ క్యాప్ కాలమానిని-2018ని ఆవిష్కరించి, నెడ్ క్యాప్ కృషి అభినందనీయమని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ వీసీ,ఎండీ ఎం.కమలాకర్ బాబు, జీఎం యర్రం రెడ్డి, టీవీస్సీ బోసు, కె శ్రీనివాసు, వై ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీసీలకు భరోసాగా ప్రజాసంకల్పయాత్ర
వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజాసంకల్పయాత్ర బీసీల జీవితాలకు భరోసనిచ్చేలా కొనసాగుతోందని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు. విజయవాడలోని వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఇప్పటికే 800 కిలోమీటర్లు పూర్తయిన ప్రజాసంకల్పయాత్రలో వేలాది మంది బీసీ వర్గాలకు చెందిన ప్రజల కష్టాలు, కడగండ్లు తెలుసుకున్నారని, వారికి భరోసా కల్పించేలా యాత్ర సాగుతోందని అన్నారు. టీడీపీ ప్రభుత్వ వాగ్దానాలను నమ్మి బీసీ సోదరులు మోసపోయారని వాపోయారు. టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు పథకానికి తూట్లు పొడిచి బీసీ కుటుంబాలను నడిరోడ్డున పడేసిందని విమర్శించారు. రాజకీయంగా బీసీలకు చట్టసభల్లో సీట్లు కేటాయిస్తామని జగన్ భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. మాజీమంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆయా వర్గాలను మోసగిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో విజయవాడ పార్లమెంటు జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్, బీసీ సెల్ రాష్ట్ర నేతలు కసగోని దుర్గారావు, కె.గురవాచారి, మట్టపర్తి మీరా సాహెబ్, వివిధ జిల్లాలకు చెందిన బీసీ నాయకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

చలివెనుక పులి ఇదీ!

ఈ ఏడాది చలిపులి వణికిస్తోంది. భారత వాతావరణశాఖ ముందస్తు అంచనాలు నిజం చేస్తూ అసాధారణ స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జనం ఎముకలు కొరికే చలికి గజగజ లాడుతున్నారు. దేశవ్యాప్తంగా శీతల పవనాల తీవ్రత అధికంగా కనిపిస్తోంది. నిరుటితో పోలిస్తే ఈసారి తెలుగు రాష్ట్రాలు మంచు దుప్పటిగా మారాయి. ఈశాన్యం నుంచి వీస్తున్న చల్లటి గాలుల కారణంగా మధ్యభారతం నుంచి తెలుగు రాష్ట్రాల వరకు అధిక పీడనం ఏర్పడి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పతనమవుతున్నాయి. హైదరాబాద్‌లో 11 సెంటీగ్రేడ్ డిగ్రీల దిగువన కనిష్ఠ ఉష్ణోగ్రతలుండగా ఆదిలాబాద్, లంబసింగి వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో 3-4 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఇక దేశంలో ఢిల్లీ, జమ్ము కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో హిమపాతం తీవ్రంగా ఉంది. కార్గిల్, లేహ్, శ్రీనగర్ వంటిచోట్ల మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత బెంబేలెత్తిస్తోంది. దేశరాజధాని ఢిల్లీలో పొగమంచు కారణంగా జరిగిన ప్రమాదంలో నలుగురు క్రీడాకారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దట్టమైన పొగమంచు అనేక రైళ్లు, విమానాల రాకపోకల్ని అస్తవ్యస్తం చేస్తోంది. రవాణా వ్యవస్థ కూడా దెబ్బతింటోంది. జలవిద్యుదుత్పాదనకూ ప్రతిబంధకం ఏర్పడుతోంది. విపరీతమైన శీతల పవనాల వల్ల ప్రజా జీవితంలోని అన్ని పార్శ్వాలు ప్రభావితానికి గురవుతున్నాయి. కాలుష్య భూతం ఉగ్రరూపం దాలుస్తోంది. ప్రజారోగ్యాన్ని పట్టి పీడిస్తోంది. దట్టంగా వ్యాపించే పొగమంచులో దుమ్మూ, ధూళి కణాలతోపాటు కార్బన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ వంటి మృత్యు ఉద్గారాలు కలగలిసి జనం ఊపిరితిత్తుల్లోకి చేరి, కొంచెం కొంచెంగా ప్రాణాలు హరిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలూ కన్నీటితుడుపుగా కొన్ని చర్యలు చేపడుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లోని నగరాలు, పట్టణాల్లో విద్యాసంస్థలకు సెలవులివ్వడం, వాహనాల నియంత్రణ, నిత్యావసర సరకుల వాహనాలు తప్ప ఇతర భారీ వాహనాలకు నగరాల్లోకి అనుమతి నిరాకరించడం వంటి చర్యలు చేపడుతున్నాయి. ఇవన్నీ తాత్కాలిక ఉపశమనాలే, అసలు సమస్య యథాతథంగా ఉండిపోతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం మొదలుకొని దేశ రాజధాని నగరం న్యూఢిల్లీ వరకూ ఇదే తంతు. న్యూఢిల్లీని ఫిరోజ్ షా కోట్లా మైదానంలో ఈమధ్య జరిగిన క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌లో శ్రీలంక క్రీడాకారులు మాస్కులు ధరించి పాల్గొన్నారు. ఇద్దరు ఫాస్ట్ బౌలర్లయితే ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందులెదురై మైదానం నుంచి నిష్క్రమించారు. వేకువజామునే పనులకు వెళ్లేవారు, బస్సుల కోసం ఎదురుచూసే విద్యార్థులు, ఉద్యోగులు ఈ పొగమంచులో చిక్కుకుపోతున్నారు. భారత్‌లో 1990-2015 మధ్య వాయు కాలుష్యం వల్ల సంభవించిన మరణాలు 47 శాతం పెరిగాయని ఈ ఏడాది మొదట్లో వెలువడిన అంతర్జాతీయ నివేదిక వెల్లడించింది. కాలుష్యం పెరగడం వల్ల నెలలు నిండకుండానే పుట్టే పిల్లల సంఖ్య పెరుగుతున్నదని కూడా ఆ నివేదిక హెచ్చరించింది. శీతాకాలంలో ఈ సమస్య మరింత పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. 2017లో ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచంలోని అనేక దేశాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత 137ఏళ్లలో రెండో అత్యధిక సగటు ఉష్ణోగ్రత నిరుడు తొలి అర్ధభాగంలో నమోదైనట్లు నాసా తెలిపింది. ఇంత తీవ్రస్థాయిలో శీతల పవనాలు, తీవ్ర వడగాడ్పులు, వరదలు, కరవుకాటకాలు పెచ్చరిల్లడానికి ప్రధాన కారణం మనిషికి ముందు చూపు కొరవడడమే. దీనంతటికీ భూతాపమే ప్రబల హేతువని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయ అధ్యయనం నిగ్గుతేల్చింది. మనదేశంలో గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణం విపరీతంగా పెరిగిపోవడంతో భూతాపం అనూహ్యంగా తీవ్రస్థాయికి చేరుతున్నది. నాలుగు దశాబ్దాల కాలావధిలో హిమాలయాలు 13శాతం మేర కరిగిపోవడంతో వాతావరణంలో అసహజ పరిస్థితి నెలకొంటోంది. వాహనాలు, పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్య ఉద్గారాలు వాతావరణంలో కేన్సర్ కారక కార్సినోజెన్‌లను వ్యాప్తి చేస్తున్నాయని ఓ సర్వేలో వెల్లడైంది. వాయు నాణ్యతను పరీక్షించినప్పుడు పాట్నా, లూధియానా, బెంగళూరు, లక్నో, అలహాబాద్ వంటి నగరాల్లో పౌరులు మృత్యు ఒడిలో జీవిస్తున్నారని స్పష్టమైంది. అన్ని రకాల కాలుష్యాలు భూతాపానికి కారణమవుతున్నాయి. దాన్ని కట్టడి చేయడంలో ప్రభుత్వాలు నేరపూరిత నిర్లక్ష్యం వహించడం వల్ల మానవాళిని చలిగాలులు, హిమపాతాలు, భీకరమంచుదాడులు బహువిధాలుగా ముంచేస్తున్నాయి. మానవాళి ఉనికికే పెనుముప్పు పొంచి ఉంది. 2050 లోగా గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను 40-70 శాతం మేర, ఆపై అర్ధ శతాబ్దిలో సంపూర్ణంగా నియంత్రించాలన్న అంతర్జాతీయ అజెండాకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తూట్లుపొడిచిన తీరు జీవుల ఉనికికే పెనుశాపం లాంటిది. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా గడచిన పదిహేడేళ్లలో కనీసం పన్నెండున్నర కోట్ల మంది ప్రాణాలు కోల్పోయారని ఇటీవల జర్మనీలోని బాన్‌లో జరిగిన ప్రపంచ వాతావరణ సంస్థ సమావేశం పేర్కొంది. సగటు ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీల మేరకు పెరిగినా.. భయానకమైన అతివృష్టి, తుపానుల తీవ్రత, శీతాకాలంలో ప్రాణాలు హరించే చలిగాలుల బీభత్సాలు తప్పవని 'సార్క్' అధ్యయన బృందం గతంలోనే హెచ్చరించింది. అతి శీతలం, మండుటెండలు వంటి వాతావరణంలోని పెనుమార్పుల కారణంగా కొత్త వ్యాధులు ప్రబలడం, పంటల ఉత్పత్తి క్షీణించడం, తాగునీరు కలుషితం కావడం వంటి విపత్తులతో ప్రపంచ జనావళిని మహా వినాశనం వైపు నెడుతాయని నిపుణులు చేస్తున్న హెచ్చరికలు పాలకుల చెవికి సోకడం లేదు. పారిశ్రామిక దేశాలు విడుదల చేస్తున్న వివిధ రకాల కాలుష్యాలను తగ్గించుకొనే సమర్థ కార్యాచరణతో వాటిపై ఒత్తిడి పెంచుతూనే, వర్ధమాన దేశాలు తమ వంతుగా సామాజిక అటవీ పెంపకం, పర్యావరణ పరిరక్షణకు జనచైతన్యాన్ని ప్రోదిచేయడం వంటి చర్యలు చేపట్టాల్సిన తరుణం ఇది. లేదంటే మనిషి తన ఉనికికి తానే పొగపెట్టుకోవడం అవుతుంది. ప్రస్తుతం నెలకొన్న ఈ వాతారణ దుస్థితి ఒక రకమైన జాతీయ ప్రకృతి విపత్తుగా పరిగణించాల్సిందే.

చురక

నగదు రహిత లావాదేవి
నాజూకు వన్నెలాడి
సైబర్ నేరాల్లో పడి
చౌర్యమాయే దోచబడి

దినం కూలినాలి దశ
డిజిటలిండియా దశ
మనదేశం మార్పు ఆశ
మన పాలక వృథా ఘోష

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

అస్థిత్వ ఆరాటమా? - ఆశయ పోరాటమా?

విశ్వనాథ్ వై.

పాలకుల పక్షాన పోరాడితే దేశభక్తి. పాలకుల అణచివేతలను ప్రతిఘటిస్తే అది తిరుగుబాటు లేదా విప్లవం. ఈ సాధారణ భావన ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే పోరాటం లేదా విప్లవం ప్రేరేపణకు మూల సత్యాన్ని గ్రహించడంలో, అంగీకరించడంలో ఎంతోకొంత వివక్ష కొనసాగుతూనే ఉంది. ఫలితంగానే ఏడు పదుల ప్రజాస్వామ్య భారత్‌లోనూ ఆత్మగౌరవ నినాదాలు, ఉద్యమాలు, పోరాటాలు, ఆత్మబలిదానాలు పుట్టుకొస్తున్నాయి. వీటిని ఎన్నికల స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకోవాలని ప్రయత్నించని బూర్జువా పార్టీ లేదంటే అతిశయోక్తి కాదు. అయితే, అస్థిత్వ ఆరాటానికే పరిమితం కాకుండా, ఆశయ పోరాటానికి దారి తీసే ఉద్యమాలు, వాటికి నాయకులుగా నిలిచిన వ్యక్తులూ చరిత్రలో స్థానం సంపాదించుకుంటారు. ప్రస్తుతం గుజరాత్‌లోనూ ఇలాంటి దృశ్యమే ఆవిష్కృతమవుతోంది. అది దళిత ఆత్మగౌరవ నినాదంతో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగి అధికార బీజేపీ,ప్రతిపక్ష కాంగ్రెస్‌లకు గట్టి పోటీనిస్తూ విజయం సాధించిన దళిత సేనాని ... జిగ్నేష్ మేవానీ రూపంలో. గుజరాత్‌లోని వాద్గాం నియోజక వర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మేవానీ ఎన్నికైనారు. 2019 ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని బీజేపీ సర్కారును ఓడించడం తన లక్ష్యంగా మేవానీ ప్రకటించుకున్నాడు. కులవివక్షతకు, అసమానతల వేధింపులకు తావు లేని సమసమాజ స్థాపన కావాలని అభిలషించే వారికి ముఖ్యంగా. దళితులకు సేనానిగా మేవానీ పయనం మొదలైందని చెప్పాలి. ఇది ప్రస్తుతం.

దీనికి సుమారు 200ల సంవత్సరాల కిందటి చరిత్రలోకి తొంగిచూస్తే 1818 జనవరి ఒకటిన విజయవంతమైన భీమా-కొరేగావ్ యుద్ధ స్మృతులు గుర్తుకు రాక మానవు. వలస పాలనలోని పీష్వా బలమైన 20వేల మంది సేనలను బ్రిటిష్ ఇండియా తరపున పోరాడిన 900ల మంది మెహర్ సైనికులు చిత్తుచిత్తుగా ఓడించారు. నాటి పాలకులు బ్రిటిష్ ఇండియా తరపున పోరాడారు కనుక మెహర్లను దేశభక్తులుగా పేర్కొన్నారు. స్వతంత్ర భారత్‌లో సామాజిక న్యాయం కావాలంటూ డిమాండ్‌చేసే మెహర్లు (దళితుల)ను నయా పాలకులు దేశద్రోహులుగా చిత్రించే దుస్సాహసానికి పాల్పడుతున్నారు. ఇందుకు సజీవ సాక్ష్యం 2018 జనవరి ఒకటిన చోటు చేసుకుంది. భీమా - కొరేగావ్ యుద్ధ అమరవీరుల స్మృత్యర్థం నిర్మించిన స్మారక స్థూపం దగ్గర మెహర్లు నివాళి అర్పించడమనేది గత 200ల సంవత్సరాలుగా జరుగుతూనే వస్తోంది. గత 199 సంవత్సరాల్లో హాజరైన వారికి కనీసం 15 నుంచి 20రెట్ల మంది జనం నివాళి సభకు తరలిరావడం గమనార్హం. అవకాశం కోసం కాచుక్కూచున్న బూర్జువా పార్టీల దన్నుతో నివాళి సభలో అవాంఛిత ఘర్షణలు ఒకరి మృతికి దారి తీయడం జరిగింది. దళితులకు, అగ్రవర్ణాలకు మధ్య జరిగిన ఈ ఘర్షణలో అనేక మంది గాయపడ్డారు. దళితేతరుడు ఒకరు మృతి చెందారు.

2019 ఎన్నికల రాజకీయ ప్రయోజనాల కోసం వెంపర్లాడే బూర్జువా పార్టీల ప్రమేయంతోనే వ్యవస్థీకృత ఘర్షణ తదనంతర పరిణామాలు జరిగాయనేది నిరూపణకాని వాస్తవంగా ప్రచారంలో నిలిచింది. అన్నివేళలా కులరహిత సమాజం, అసమానతలు లేని సమాజం అంటూ ప్రవచించే బూర్జువా పార్టీల నిజ స్వరూపాలు ఇలాంటి ఎన్నికల ముందస్తు జరిగే కార్యక్రమాలను అడ్డుగా పెట్టుకుని సాగించే కుల, మత, ప్రాంతీయ, లింగ, మైనారిటీ వివక్ష నిండిన చర్యల్లోనే బహిర్గతం అవుతూండటం జగమెరిగిన సత్యం. నివాళి ఘర్షణల్లో పాల్గొన్న అగ్రవర్ణాలకు హిందుత్వతో సంబంధాలు న్నాయని విచారణలో తేలింది. 2018 జనవరి ఒకటిన దళితులు, అగ్రవర్ణాల మధ్యన జరిగిన ఘర్షణ 1818నాటి బ్రిటిష్ ఇండియా, మెహర్ల మధ్య జరిగిన చారిత్రాత్మక యుద్ధాన్నే తలపించింది. ఇంత కాలమూ అనుభవిస్తున్న అగ్ర వర్ణ అణచివేతల ప్రతిఘటనకు ఇపుడు తప్ప మరెన్నడూ అవకాశం రాదన్న చందంగా మెహర్లు తీవ్ర స్థాయిలో ప్రతిఘటనకు దిగారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి తీరాలనే పట్టుదల వారి ప్రతిఘటనలో కనిపించిందని ప్రత్యక్ష సాక్షులు అభిప్రాయపడుతున్నారు.

> మేవానీ నుంచి ప్రేరణ పొందిన పక్షాలు మహారాష్ట్ర, కర్నాటకల్లో బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు ఉద్యమిస్తున్నాయి. మంగళవారం ఢిల్లీలో జరిగిన యువ హుంకార్ ర్యాలీలో మేవానీ ప్రసంగమూ ఆకట్టుకుంది. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక విలువలను బీజేపీ సర్కారు కాలరాస్తోందని మేవానీ ఆగ్రహించారు. తన మీద మోపే కుట్ర కేసులు తమ ప్రతిఘటనోద్యమాన్ని నిలువరించజాలవని స్పష్టం చేశాడు. తద్వారా బీజేపీ ప్రభుత్వ అణచివేత చర్యలకు తలొగ్గేది లేదని చెప్పినట్లయింది. ఉద్యమ భాగస్వాములయిన ఉమర్ ఖలీద్, కన్హయ కుమార్, షీలా రషీద్, తదితర యువనాయ కత్వం వ్యక్తీకరించిన భావ జాలాన్నీ స్వాగతిస్తున్నారు.

దళిత సేనానిగా ఎమ్మెల్యే మేవానీ

ఎందుకంటే, 2014 సార్వత్రిక ఎన్నికల తరువాత నరేంద్రమోడీని గద్దె దింపడానికి దక్కుతున్న తొలి అవకాశం 2019ఎన్నికలని వారు గుర్తించారు. అమెరికా అధ్యక్షుడిని పదవీచ్యుతుడ్ని చేయడానికి ఆదేశ రాజ్యాంగ అధికరణం 25 అవకాశం కల్పిస్తోంది. ఇలాంటి వెసులు బాటు భారత్ రాజ్యాంగంలో లేదు. ఎన్నికల్లో ఓడించడమే ఏకైక మార్గం. మోడీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి తప్పించాలన్న బలీయమైన ఆకాంక్షను భీమా-కొరేగావ్ ఘర్షణలో చూడవచ్చు. భీమా-కొరేగావ్ సంస్మరణ సభా కార్యక్రమానికి హాజరైన జిగ్నేష్ మేవానీ, ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్‌లు ఇచ్చిన సందేశం అణచివేతకు గురవుతున్న లక్షలాది మంది మనసుల్లో నిక్షిప్తమైపోయింది. ఇలా నిక్షిప్తమైన 'మేవానీ' సందేశం అణచి వేతలను అధిగమించాలన్న కృతనిశ్చయంతో ముందుకు సాగే అసంఖ్యాకులకు ప్రేరణగా నిలిచింది. ఈప్రేరణ కలిగించిన సేనానిగా మేవానీ గుర్తింపు పొందాడు. అటు కాంగ్రెస్‌లో చేరకుండా, ఇటు బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి ఎత్తులకు చిక్కకుండా స్వతంత్రత నిలబెట్టుకోగలిగాడు. అధికార బీజేపీకి కలవరపాటు రేపుతున్నాడు. తద్వారా అధికార బూర్జువా రాజకీయాలకు తను దూరమనే సంకేతాన్ని పంపగలిగాడు.

ఆత్మగౌరవ నినాదంతో పరితపించే దళితుల సేనానిగా గుజరాత్ అసెంబ్లీలో కాలుమోపాడు. మోడీ సర్కారును అధికారచ్యుతి చేయడమొక్కటే తన జీవిత లక్ష్యమంటున్న మేవానీని ఇపుడు దేశంలోని భిన్న వర్గాలు పరికించి చూస్తున్నాయి. ఏం చెబుతున్నాడా? అని ఆలకిస్తున్నాయి. మేవానీ నుంచి ప్రేరణ పొందిన పక్షాలు మహారాష్ట్ర, కర్నాటకల్లో బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు ఉద్యమిస్తున్నాయి. మంగళవారం ఢిల్లీలో జరిగిన యువ హుంకార్ ర్యాలీలో మేవానీ ప్రసంగమూ ఆకట్టుకుంది. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక విలువలను బీజేపీ సర్కారు కాలరాస్తోందని మేవానీ ఆగ్రహించారు. తన మీద మోపే కుట్ర కేసులు తమ ప్రతిఘటనోద్యమాన్ని నిలువరించజాలవని స్పష్టం చేశాడు. తద్వారా బీజేపీ ప్రభుత్వ అణచివేత చర్యలకు తలొగ్గేది లేదని చెప్పినట్లయింది. ఉద్యమ భాగస్వాములయిన ఉమర్ ఖలీద్, కన్హయ కుమార్, షీలా రషీద్, తదితర యువనాయకత్వం వ్యక్తీకరించిన భావ జాలాన్నీ స్వాగతిస్తున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఢిల్లీ, లక్నో, అలహాబాద్ విశ్వవిద్యాలయాల నుంచి యువతరంగం తరలిరావడం ద్వారా మున్ముందు ఐక్యయువ సంఘటన జరగనుందనే సంకేతాన్నిచ్చినట్లయింది. కులవివక్షకు తావీయలేని విధంగా రాజ్యాంగాన్ని తిరగరాస్తానంటున్న మేవానీ మాటలు వారిలో కొత్త ఆశలు చిగురింపచేస్తున్నాయి. ఈ ఆలకింపు నుంచే రానున్న 2019 ఎన్నికల్లో అధికార వ్యవస్థను ప్రభావితం చేయగల మరో కొత్త యువతరంగం పుట్టుకొచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈప్రయత్నంలో ప్రస్తుతం మేవానీ బాలారిష్టాలు దాటినట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

అశాస్త్రీయమైన కార్పొరేట్ విద్యావిధానం

చందు సుబ్బారావు



కార్పొరేట్ సంస్థల విద్యావిధానం తీవ్రమైన ప్రశ్నలనెదుర్కొంటోంది. కిరాణా వర్తకుడు భారీ పరిశ్రమ నడిపినట్లుగా, ధనార్జనకై అనాథాశ్రమం పెట్టినట్లుగా, జనాభా నియంత్రణకు ఆసుపత్రి కట్టించినట్లుగా వుంది. 'తెలియ చేయునది' విద్య అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో విద్యకు ప్రపంచ జ్ఞానమే ప్రధానాంశంగా వుండాలని కొఠారి కమిషన్, మరో పాతికేళ్లకు సాంకేతిక సబ్జెక్టులతోపాటు విశ్వమానవ శ్రేయస్సు కలిపి బోధించాలని రాధాకృష్ణ పండితుల కమిషన్ పేర్కొన్నాయి. టు ఎడ్యుకేట్ అంటే టు డ్రా అవుట్ - బయటకు లాగుట అని అర్థం. అభివృద్ధి చెందిన దేశాల్లో సబ్జెక్టు సాంకేతికలతోపాటు భాష, తాత్వికత, పర్యావరణ వైశిష్ట్యం, ప్రపంచ ప్రజల వైవిధ్యం, భౌగోళిక రూపురేఖలు కలిపి పిల్లలకు బోధించాలని సూచిస్తున్నాయి. ఉద్యోగాల వేళ కూడా అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా దేశాలు "నీ మార్కులు, సంస్థల గొప్పతనాలు, సబ్జెక్టుల విజయాలు ఏమిటని అడగటం లేదు. ఈనాడు ప్రపంచం ఎలా వుంది - నీ వివేకంతో మాకు ఏం చేయగలవు" అని ఇంటర్వ్యూలలో ప్రశ్నిస్తున్నారు. సబ్జెక్టులపైనా, సాంకేతిక విషయాలపైనా 'పదింట ఒక శాతం' మాత్రమే అడుగుతున్నారు. మన దేశంలో కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు జాబ్‌మేళాలు నిర్వహించటానికి వచ్చే ఐటీ సంస్థలు ఎ) విద్యార్థుల్లోని హేతుబద్ధ ఆలోచనాశక్తి (రీజనింగ్), బి) ప్రపంచ జ్ఞానం (జీకే), సి) అభిరుచి (యాప్టిట్యూడ్), డి) మానసిక శక్తి (మెంటల్ ఎబిలిటీ), ఇ) సబ్జెక్టు జ్ఞానం మీద పరీక్షిస్తున్నారు. అంటే "కార్పొరేట్ విద్య మెదళ్లలోకి కుప్పించే సబ్జెక్టు జ్ఞానం ఐదింట ఒక వంతు మాత్రమే ఉద్యోగార్హత" అని కార్పొరేట్ సంస్థ తీరు అంటున్నట్లు కదా. గట్టిగా అడిగితే "మీ బుద్ధి కుశలత తప్ప, మీ మార్కులు, శాతాలు, చదివిన సంస్థలు మాకు అనవసరం. మీ డిగ్రీలు సైతం మాకక్కర్లేదు. మీరు తప్పినా (!!) మాకు అనవసరం. సబ్జెక్టును ప్రపంచ వినిమయ శక్తిగా చేయగల బుద్ధి కుశలత వుంటే చాలును. మిగతా విషయాలు మేం నేర్చుకుంటాం. మీరు కళాశాలల్లో చదువుకునేదెంత.. మీ ఉపాధ్యాయులు బోధించగలదెంత?" అంటున్నారంటే అర్థం విద్యార్థులను కుశాగ్రబుద్ధులుగా మేధావులుగా, ప్రాపంచిక జ్ఞానసంపన్నులుగా మానవాళిని రక్షించే శాస్త్రసాంకేతిక శక్తిమంతులుగా తీర్చిదిద్దాలని భావం కదా!

మరి మన కార్పొరేట్ కళాశాలలు రోజుకు పదిహేను గంటలు క్లాస్‌రూమ్‌లు "బందీలకు" సబ్జెక్టు రక్తం ఎక్కిస్తే ఏమవుతుంది? ఒక ఆటా, పాటా, విశ్రాంతి ఉత్సవం, ఉల్లాసం సామూహిక వినోదం లాంటి వాటిని బహిష్కరించి సబ్జెక్టు ఇంజక్షన్లు ఇస్తే ఎలా పరిణమిస్తుంది. ఐదేసి అంతస్థుల భవనాలు, ఏకలైంగిక సమూహాల సైనిక సంచలనాలు, చీమ కూడా దూరలేని కారడవుల వంటి వసతి గృహ నివాసాలు, నిరవధిక శిక్షణ పరీక్షల ద్వంద్వ సమాసాలు, అదే చదువుకు పరమార్థం, రేంకులే భవిష్యత్తు బ్యాంకు అకౌంట్లు, మార్కులే విజయ విక్రమార్కులకు జెండా సంకేతాలు అంటూ సాగిస్తున్న "కార్పొరేట్ సంస్థల బోధన" అశాస్త్రీయ విద్యావిధానంలో 'టాప్ ర్యాంకర్'గా తయారైంది. ఐఐటీలు, వైద్య విద్యా సంస్థల్లో సీటొస్తే ప్రపంచాన్ని జయించినట్లుగా భావించే నినాదాల హోరు. పరిశోధనలకు, ఉన్నత పదవులకు 'పోటీలు మార్కు' విద్యావిధానం హాని చేస్తుంది. సృజనాత్మకత, నిశిత పరిశీలన, జ్ఞాన వినిమయ సామర్థ్యం, నాయకత్వ పటిమ "ర్యాంకు పోటీళ్లకు" లభించవని తెలుస్తూనే వుంటుంది. అయినా ఒక కృత్రిమ వాతావరణాన్ని సృష్టించి, తమ బిడ్డలకు మంచి భవిష్యత్తు వుంటుందనే తల్లిదండ్రుల ఆశలపై ఆకాశ హర్మ్యాలు కట్టించి, లక్షలు కురిపించేలా ఐదంతస్తుల కార్పొరేట్ విద్యాభవనాలు మురిపిస్తున్నాయి. యువతీ యువకుల ప్రాణాలతో చెలగాటాలాడుతున్నాయి. జాతీయ విద్యావిధానాలు అపశృతికి కారణాలవుతున్నాయి.

వ్యాస రచయిత : విశ్రాంత ఏయూ ప్రొఫెసర్

చరిత్రను వక్రీకరిస్తున్నది ఎవరు?

తోకల రాజేశం

"కనక మృగము భువినికద్దు, లేదనకుండ
తరుణి విడిచిపోయె దాశరథియు
తెలివి లేనివాడు దేవుడెట్లాయెరా?" - అని మధ్యయుగాల్లోనే ప్రజాకవి వేమన ప్రజల వైపు నుంచి సూటిగా ప్రశ్నించాడు. ఎంత దేవుడైతే మాత్రం ఆయనక్కూడా తెలివి వుండాలని కోరుకోవటంలో తప్పులేదు కదా! అలాగే ప్రొఫెసర్లుగా పనిచేసిన వాళ్లకు కూడా ఇంగిత జ్ఞానం - తెలివి వుండాలని ఆశపడటంలో తప్పులేదనుకుంటాను? జనవరి 4, 2018 నాటి ఆంధ్రభూమి దినపత్రికలో ప్రొ॥ ముదిగొండ శివప్రసాద్ రాసిన "చరిత్రను వక్రీకరించింది ఎవరు?" అన్న వ్యాసం చదివిన పాఠకులకు ఈ కోరిక కలిగితే అది వాళ్ల తప్పు కాదు. బీజేపీలోనో, ఆరెస్సెస్‌లోనో సభ్యత్వం కలిగిన అతి మామూలు కార్యకర్త మాట్లాడినంత పేలవంగా ఒకింత దుందుడుకుగా, వీరావేశంగా రాసిన శివప్రసాద్‌కు చరిత్రకూ - పుక్కిటి పురాణాలకూ మధ్యగల తేడా తెలిసినట్టు లేదు. ఆ తేడా తెలుసుకోకపోవటం వల్ల వచ్చిన గందరగోళం వల్ల నష్టపోయేది ఆయనొక్కరే కాదు - పాఠకులు కూడా. "త్రేతాయుగం నుంచి నేటి వరకు గల ప్రపంచ చరిత్ర అష్టాదశ పురాణాల్లో వుంది" అనటాన్ని పదవ తరగతి వరకు చరిత్ర చదువుకున్న పిల్లవాడు కూడా ఒప్పుకోడు. విజ్ఞాన శాస్త్రాలు ఇంతగా అభివృద్ధి చెందిన ఈ కాలంలోనే కొన్ని చారిత్రక సంఘటనలను ధృవీకరించడానికి చరిత్రకారులు అష్టకష్టాలు పడుతుంటే చాలా పరిమిత జ్ఞానంతో అంతూపొంతూలేని అభూత కల్పనలతో - జుగుప్సాకరమైన శారీరక సంబంధాలతో నిండివున్న ప్రాచీనకాలపు అష్టాదశ పురాణాల్లో ప్రపంచ చరిత్ర ఎలా ప్రతిఫలించిందో ముదిగొండకే తెలియాలి. పోనీ పురాణాలు ఇక్కడే పుట్టాయి కాబట్టి వాటిలో భారతదేశ చరిత్ర వుందని రాసినా అర్థం చేసుకోవచ్చు. ఏకంగా వాటిలో ప్రపంచ చరిత్రనే వుందని దబాయించటమంటే ప్రపంచం ముందు నిలబడి మన పరువును స్వయంగా మనమే తీసుకోవటమే అవుతుంది. అప్పటి పురాణకర్తలు కళ్లు మూసుకొని ప్రపంచంలో జరుగుతున్నదంతా గ్రహించి పురాణాల్లో చరిత్రగా నిక్షిప్తం చేశారా? పుష్పక విమానాలెక్కిపోయి విదేశాల చరిత్రనంతా తెలుసుకొని పురాణీకరించినట్లున్నారు పాపం. అంతకు మించిన మార్గమైతే వాళ్లకు ఆ కాలంలో లేదు. నడిచి ప్రపంచాన్ని మొత్తం చుట్టొచ్చినారనుకున్నా అది సాధ్యమయ్యేపని కాదు. సముద్రయానమేమో నిషిద్ధం. కానీ పురాణాల్లో మాత్రం వారు ప్రపంచ చరిత్రను మొత్తం నింపి పారేశారు. ఆ చరిత్ర యేమిటో బయటపెట్టి ప్రపంచానికి మహోపకారం చేయాలని ముదిగొండ శివప్రసాద్‌ని సవినయంగా వేడుకొంటున్నాను.

జనవరి 1, 2018 నాడు కలకత్తాలో జరిగిన 'ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్' సభ ప్రారంభోపన్యాసంలో దాని అధ్యక్షుడు కె.యం. పరిమళీ మాట్లాడిన మాటలను - అసత్యాలు అనే ఆరోపణ చేసి ఖండించటం - పనిలో పనిగా తాననుకుంటున్న చరిత్రను వ్యాఖ్యానించటం - ముదిగొండ తన వ్యాసం ద్వారా పెట్టుకున్న లక్ష్యం. అయితే కె.యం. పరిమళీ మాట్లాడిన మాటలేవీ అసత్యం కాదు. ఆయన గురించి, చరిత్ర గురించి ముదిగొండ మాట్లాడిన మాటలే పచ్చి అబద్ధాలు. సొంత నిర్ధారణలు. మోడీ మీద బీజేపీ, ఆరెస్సెస్‌ల మీద ఈగ వాలినా కత్తితో యుద్ధానికి దిగే బృందంలోని సభ్యుడైన ముదిగొండ - ఢిల్లీ విశ్వవిద్యాలయంలో హిస్టరీ ప్రొఫెసర్‌గా పనిచేసిన పరిమళీకి చరిత్ర పాఠాలు బోధించే పనిని తలకెత్తుకున్నారు. పాపం తాను నమ్మేదంతా చరిత్ర కాదని - పుక్కిటి పురాణాలను చరిత్రగా అర్థం చేసుకోవటం తన అవగాహనాలోపం అని - మళ్లీ పరిమళీ దగ్గర చదువుకున్న శిష్యునికి శిష్యునిలాంటి వాడొచ్చి చెప్పాల్సిన పరిస్థితి ఎదురైంది.

"క్రీ.శ. 1521 సెప్టెంబర్‌లో మెక్సికోను క్రూసేడరు ఆక్రమించక ముందు అక్కడ హిందూ దేవాలయాలు ఉండేవి. వాటిని స్పానిష్ క్రిస్టియన్లు ధ్వంసం చేశారు. మహమ్మద్ ప్రవక్త పుట్టక ముందు కాబా (మక్కా)లో విగ్రహారాధన వుండేది. దానిని ప్రవక్త నిరోధించాడు. ప్రవక్త పినతండ్రి శివభక్తుడు. ఆయన అమాత్ అనే పేరుతో శివస్తోత్రాలు రచించాడు. గ్రీసులో హిందూ సంస్కృతి వుండేది. "ఏథీనా అంటే దుర్గాదేవి. ఫాసిడాన్ అంటే పరమ శివుడు" ఇదిగో ఇలా నడుస్తుంది ముదిగొండ ముద్దుల చరిత్ర. వాడెవడో ఉగ్రవాది ప్రపంచం మొత్తాని ఒకే మతం కిందికి తీసుకువస్తానని శపథం చేసినట్టు ఈయన విశ్వం మొత్తాన్ని హైందవీకరించే పనిలో వున్నట్టున్నాడు. ఈయన ఊహలకు చరిత్రతో సంబంధం లేదు. చరిత్రకు కావలసింది అందమైన ఊహలు, అంతకు మించిన ఉద్వేగాలు కాదు. ఆధారాలు కావాలి. ముదిగొండ చరిత్రకు పురావస్తు శాఖల నుంచి గానీ, శిలాజాల సంస్థల నుంచి గానీ - భారత, ప్రపంచ చరిత్ర పరిశోధనా మండలి నుంచి కానీ ఏ విధమైన ఆధారాలు లేవు. తన ఇంటి మీదికెక్కి ఈ ప్రపంచం మొత్తానికి నేనే రాజును అని అరిచేవాణ్ని చూసి ప్రజలు నవ్వుకుంటారు. కానీ నువ్వే మా రాజువని నెత్తిమీద పెట్టుకోరు. ఇతర మతాల అస్తిత్వాలకు సొంత గుర్తింపునకు భంగం కలిగించే రీతిలో అవి కూడా హిందూమతంలో లేదా సంస్కృతిలో భాగాలే. అదే విధంగా చేసిన చారిత్రక వక్రీకరణలు హిందూ మతానికి ప్రజల్లో అదనంగా గౌరవం తెచ్చిపెట్టకపోగా వున్న గౌరవాన్ని తగ్గిస్తాయన్న కనీస అవగాహన కూడా మేధావులనుకునే వాళ్లకు లేకపోతే ఎలా?

"బ్రిటీషువారు - కమ్యూనిస్టులు కలిసి రూపొందించిన దొంగచరిత్రలు చదివి వాటిని కె.యం. పరిమళీలు పాఠాలు చెప్పి విద్యార్థుల మనస్సుల్లో విషం నింపుతున్నారు" అని ఆరోపించారు శివప్రసాద్. తమ విశ్వాసాలకు అనుగుణంగా లేని చరిత్రలన్నీ ఈయన గారి దృష్టిలో దొంగ చరిత్రలు. కనీస చారిత్రకావగాహన వుండి వున్నా ఆయనిలా మాట్లాడేవారు కాదు. చరిత్రలను ఎవరో ఒకరిద్దరు కలిసి రూపొందిస్తారని చరిత్రలో చాలా పరిమిత జ్ఞానం వున్నవాడు కూడా ఒప్పుకోడు. ఎందుకంటే చరిత్రకు ఆధారాలు కావాలి. ఆధారాలను ఎవడూ సృష్టించలేడు - కనిపెట్టటం తప్ప. ఈ క్రమాన్నంతా వదిలేసి ఉనికిలో ఉన్న చరిత్రకు వ్యక్తిగత స్వార్థాలను ఆపాదించి నానాయాగి చేయటం చారిత్రక దృక్పథమనిపించుకోదు.

"నెహ్రూ రాజవంశంలో ఆరుగురు పాలకులు వచ్చారు. వారంతా తమ రాజకీయ అస్తిత్వం కోసం కమ్యూనిస్టులపై ఆధారపడ్డారు. అందుకు సామ్యవాదులు ఒక షరతు పెట్టారు. ఈ విధంగా రాజ్యపాలన మీరు చేసుకోండి - కళా, సాంస్కృతిక, విద్యా రంగాలు మాకు స్వాధీనం చేయండి అని" అంటూ ఇంకో ఆరోపణ. ఇలాంటి షరతులు - ఒప్పందాలు ఎప్పుడు ఎక్కడ జరిగాయో ఆధారాలతో సహా బయటపెడితే శివప్రసాద్ చరిత్రకు ఎంతో మేలు చేసిన వారవుతారు. మొత్తానికి కాంగ్రెసు, వాళ్లు, కమ్యూనిస్టులు కుమ్మక్కై భారతదేశ చరిత్ర రచనారంగానికి తీరని అన్యాయం చేశారని శివప్రసాద్ చిలక జోస్యం. సరే కమ్యూనిస్టు రాసిన అంటే మార్క్సిస్టు దృక్పథం గల రచయితలు రాసిన చరిత్రలను పక్కన పెడదాం. ఎవరి సిద్ధాంతాల ప్రభావానికి లొంగకుండా పూర్తి సొంత జ్ఞానంతో వేదాలతో సహా పురాణేతిహాసాలన్నింటినీ చదివి వాటి అసలు స్వరూప స్వభావాలను వివరిస్తూ స్పష్టమైన చారిత్రక దృక్పథంలో డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ ఎన్నో రచనలు చేశాడు. ఆయన అటు కమ్యూనిస్టు కాదు - ఇటు కాంగ్రెస్ వాది కాదు. మరి ఆయన రాసిన చరిత్రలు కూడా హిందూమతంలోని పరస్పర విరుద్ధమైన విషయాలను గురించి వర్ణ, కుల వ్యవస్థలను అవి పోషించిన దుర్మార్గాలను - దానికి మతామోదం లభించటం గురించి బ్రాహ్మణీయ విష సంస్కృతి దేశాన్ని పట్టి పీడించటం గురించి - వేదాల డొల్లతనం గురించి, సప్రామాణిక చరిత్రలను రాశాడు. "ఈ పనికిమాలిన వేదాల్లో ఉన్నదేమిటి? పవిత్రతాలేదు; ప్రశ్నాతత్వమూ లేదు. తమ శత్రువుల నాశనం కొరకూ - వారి ఆస్తులను దోచుకొని వాటిని తమ అనుయాయులకు పంచుకోవటం కోసం కొండ దేవతలను ప్రార్థించటం తప్ప మరేమీ లేని ఆ వేదాలను ప్రశ్నించే ధైర్యం ఎవ్వరికీ లేకపోయింది. బ్రాహ్మణులు ప్రచారం చేసి అందరి మెదళ్లలోకి చొప్పించిన ఈ అర్థరహిత భావాల పట్టు నుంచి ప్రతి హిందువు విముక్తి పొందవలసిన సమయం ఆసన్నమైంది." అని అంబేద్కర్ తన "హిందూమతంలో చిక్కుముడులు" (పుట:9) అన్న గ్రంథం ఉపోద్ఘాతంలో పేర్కొన్నాడు. దీనికి ముదిగొండలాంటి వాళ్ల సమాధానమేమిటో?

వ్యక్తిగత ఇష్టాఇష్టాలకు అనుగుణంగా చరిత్ర నడవదు. అలాంటి చరిత్రలు రాసినా నిలబడవు. ఎందుకంటే వాటికి ఆధారాలుండవు కాబట్టి. లేదు లేదు మా దగ్గర ఆధారాల్లేవు కానీ అది మా నమ్మకం. మత విశ్వాసం. చరిత్ర మొత్తం మా తాటాకుల్లోనే వుంది అని అరిచే వాళ్లంతా సాధించగలిగిందేమీ లేదు.

వ్యాస రచయిత : సెల్ 9676761415

విశాలాంధ్ర
బతుకు
The Life
గురువారం
11 జనవరి 2018

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

నలభీముల మెనార్!

అక్కడ అంతా చెయ్యి తిరిగిన వంటగాళ్ళే. ఆ గ్రామంలోని వాళ్ళంతా నలభీములే. అలాగని వారెవ్వరూ ప్రత్యేకించి వంట నేర్చుకున్నవాళ్ళు కాదు, వంటకు సంబంధించిన కోర్సులు చదివినవాళ్ళూ కాదు. అయినా వాళ్ళు వండితే మాత్రం లొట్టలు వేసుకుంటూ తినాల్సిందే. ఏవో చిన్నచిన్న వేడుకలు, శుభకార్యాల్లో వంటలు చేసుకునే వాళ్ళు అనుకుంటే పొరపాటే. హిందూజా బ్రదర్స్, ధీరుభాయ్ అంబానీ నుంచి లతా మంగేష్కర్, జుహీ చావ్లా వరకూ ప్రముఖులు అందరికీ వంట చేసే చెఫ్‌లు ఈ గ్రామానికి చెందినవాళ్ళే. ఇంతకీ ఏమా గ్రామం? అంటారా! ఆ గ్రామం పేరు మెనార్. ఉన్నది రాజస్థాన్ రాష్ట్రంలో. భారత్‌లోని మిలియనీర్లు అందరికీ ఆ మాటకొస్తే ప్రపంచంలోని ప్రముఖ భారతీయ సెలబ్రిటీలందరికీ కూడా చెఫ్‌లుగా పనిచేస్తున్నది ఈ గ్రామస్తులే.

మెనార్ గురించి మాట్లాడాలంటే అంతగా ఏమీ ఉండదు. ఏ విషయంలోనూ పేరున్న గ్రామం కూడా కాదు. ఉదయ్‌పూర్‌కి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మెనార్ అన్ని రకాలుగా చాలా సాదాసీదా గ్రామం. ఇప్పుడు మాత్రం ఈ గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. అదే నైపుణ్యం గల వంటగాళ్ళను అందించడం. కాకలు తీరిన నలభీములు తయారుకావడం. ఇప్పుడు మెనార్ అంటే చెఫ్‌లే గుర్తుకొస్తారు. ఈ సెలబ్రిటీ ఇంట్లో చూసినా, ఏ మిలియనీర్ ఇంట్లో చూసినా మెనార్ చెఫ్‌లే కనిపిస్తారు. ప్రపంచ దేశాల్లో స్థిరపడిన సంపన్నుల ఇళ్ళల్లోనూ మెనార్ చెఫ్‌లే పనిచేస్తున్నారు. ఒక్క ఇంగ్లండ్‌లోనే మెనార్ కుక్‌లు అరడజను మందికి పైగా ఉన్నారు.

లండన్‌లో ఉంటున్న హిందూజా సోదరులు ఎస్.పి.హిందూజా, జి.పి.హిందూజాలకు వంట చేసే 28 ఏళ్ళ యశ్వంత్ మెనారియా మెనార్ గ్రామస్తుడే. అతను తన 14 ఏళ్ళ వయస్సులో తన గ్రామానికి సమీపంలోనే మల్టీ నేషనల్ కంపెనీ క్యాంటీన్‌ని నిర్వహించేందుకు కాంట్రాక్ట్ తీసుకున్నాడు. ఆ తర్వాత ఇక వెనుదిరిగి చూడలేదు. పదేళ్ళపాటు ముంబయిలో పనిచేసిన యశ్వంత్ ఆ సమయంలోనే అక్కడ ఉన్న హిందూజాల సోదరుడు అశోక్ పి. హిందూజా కిచెన్స్‌లోనూ పనిచేశాడు. ఆ తర్వాత లండన్‌కు వెళ్ళిపోయాడు. ఒక్క యశ్వంత్ మాత్రమే కాదు మెనార్ చెఫ్‌ల్లో చాలామంది విజయగాథ ఇలానే ఉంది. లండన్‌లో మాత్రమే కాదు హాంకాంగ్, నైరోబీ, దుబాయి, మస్కట్, అబుదాబి, ఖతార్ లాంటి అనేక నగరాల్లో మెనార్ చెఫ్‌లు పనిచేస్తున్నారు.



లతా మంగేష్కర్, అంబానీల ఇంట్లో పనిచేసిన పూనమ్‌చంద్

మెనార్‌కి చెందిన మరో నలభీముడు పూనమ్‌చంద్ అక్లిందాశాట్ కథా ఆసక్తికరమైనదే. పూనమ్‌చంద్ తొలుత లతామంగేష్కర్ కుటుంబానికి కుక్‌గా పనిచేశారు. ఆ తర్వాత 1997లో ముంబయిలోని ధీరూభాయ్ అంబానీ ఇంట్లో చెఫ్‌గా చేరారు. దశాబ్దకాలం అంబానీ ఇంట్లో పనిచేసిన పూనమ్‌చంద్ గోధుమ రొట్టెలు, ధోక్లాలు, పోహా సమోసా, కచోరీలు చేయడంలో పేరుగాంచాడు. 2007లో రిటైర్ అయిన పూనమ్‌చంద్ ప్రస్తుతం తనకున్న పశువులతోనే కాలక్షేపం చేస్తున్నాడు.

పూనమ్‌చంద్ గురించి చెప్పుకోవలసిన విశేషం ఏమంటే....ఇతని గురించే కాదు మెనార్ చెఫ్‌లందరి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అంశం ఒకటి ఉంది. అదే....వాళ్ళెవరకూ వంటకు సంబంధించిన ప్రొఫెషనల్ కోర్సులు ఏమీ చేయలేదు. ఇంకా చెప్పాలంటే పెద్దగా ఏమీ చదువుకోనూ లేదు. సొంత తెలివితేటలు, అనుభవం, నైపుణ్యాలే పెట్టుబడిగా చెఫ్‌లుగా ఎదిగారు. బడాబాబులు, సెలబ్రిటీలు, మిలియనీర్లు, ప్రముఖుల ఇళ్ళల్లో కుక్‌లుగా పేరు తెచ్చుకున్నారు.

స్కూల్ చదువును మధ్యలోనే ఆపేసిన పూనమ్‌చంద్ వంటకు సంబంధించిన మెళకువలన్నీ తన సీనియర్లు, సహచరుల నుంచే నేర్చుకున్నాడు. ప్రముఖ ఇండియన్ చెఫ్, వంటల పుస్తకాల రచయిత, వంటకు సంబంధించిన అనేక షోలు నిర్వహించిన వ్యక్తి తార్లా దలాల్ పుస్తకాలు చదివి వంటలు నేర్చుకున్నాడు పూనమ్. దలాల్ ప్రత్యేకించి గుజరాత్ వంటకాలకు ప్రసిద్ధి.

పూనమ్‌చందే కాదు ఈ గ్రామానికి చెందినవాళ్ళు ఎవరూ కూడా కుకింగ్ కోర్సులకు వెళ్ళలేదు. అయినప్పటికీ వాళ్ళు మెక్సికో, ఇటలీ, చైనా మొదలుకుని ఇతర దేశాల వంటలనూ దశాబ్దాలుగా చేస్తూనే ఉన్నారు. అది కూడా నోరూరేలా, లొట్టలు వేసుకుని మరీ తినేలా. అదే మెనార్ గ్రామస్తుల, మెనార్ చెఫ్‌ల ప్రత్యేకత.

మెనార్ చెఫ్‌ల జీతాలు ఆరు అంకెల్లోనే ఉంటాయి. దీనికి తోడు ప్రయాణం, ఆశ్రయం అన్నీ ఉచితమే. అంత డిమాండ్ ఉంది మెనార్ చెఫ్‌లకి. వీళ్ళల్లో పెన్షన్లు తీసుకుంటున్నవాళ్ళూ ఉన్నారు. పూనమ్‌చంద్‌కి ముందు అంబానీ ఇంట్లో పనిచేసిన ఇదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి భైరులాల్ రూప్‌జోత్ (ఇప్పుడు జీవించి లేడు) భార్య ఇప్పటికీ ప్రతి నెలా పెన్షన్ అందుకుంటున్నారు. ఇంత జీతం వస్తోంది కదా వచ్చిన డబ్బులతో వాళ్ళు విలాసవంతమైన జీవితం గడుపుతున్నారనుకుంటే పొరపాటే అవుతుంది. వాళ్ళకొచ్చే జీతంలో కొంత గ్రామాభివృద్ధి కోసం ఖర్చు పెడుతున్నారు.

దుబాయికి ఎప్పుడో వలస వెళ్ళిపోయిన ప్రవాస భారతీయుల్లో ఒకరైన మాఘన్‌మాల్ జెతానంద్ పంచోలియా వద్ద 15 ఏళ్ళు పనిచేశాడు మెనార్‌కి చెందిన విజయ్‌లాల్ దహోత్. అంతకాలం తన దగ్గర పనిచేసిన దహోత్‌కి పెన్షన్‌కి మించిన గుర్తుండిపోయే కానుక ఏదైనా ఇవ్వాలనుకున్నాడు పంచోలియా. అందుకు అతను ఏం చేశాడో తెలుసా! మెనార్‌లో 100 పడకల ఆసుపత్రి, సెకండరీ స్కూల్, కమ్యూనిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. వీటన్నింటి కోసం రూ. 1.42 కోట్లు ఖర్చు చేశాడు. ఈ స్కూల్, ఈ ఆసుపత్రిని నిర్వహిస్తున్న ఓవర్సీస్ ఇండియన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో ప్రస్తుతం దహోత్ కూడా సభ్యుడిగా ఉన్నాడు.



దుబాయ్‌లో పనిచేసిన విజయ్‌లాల్ దహోత్

ఈ గ్రామంలో పక్షి మిత్ర పేరుతో ఒక గ్రూపు కూడా ఏర్పడింది. గాయపడిన పక్షులను రక్షించడంతో పాటు వేటగాళ్ళను అడ్డుకునేందుకు తరచుగా గస్తీ నిర్వహించడం వంటి పనులను ఈ గ్రూపు చేస్తోంది. దీనివల్ల ఈ గ్రామానికి వలస వస్తున్న పక్షుల సంఖ్యే కాదు బయట ప్రపంచానికి అంతగా తెలియని ఈ గ్రామానికి పర్యాటకుల సంఖ్యా గణనీయంగా పెరుగుతోంది.

కమ్యూనిటీ సెంటర్‌ని గ్రామ కమిటీయే నిర్వహిస్తోంది. దహోత్ పనిచేసిన పంచోలియా గురించి ఇక్కడ ఇంకో విషయమూ ప్రస్తావించాలి. అది... 1957లో దుబాయికి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించిన ఘనతా అతనిదే.

మెనార్‌లో ఇంతమంది చెయ్యి తిరిగిన వంటగాళ్ళను చూసిన ఇదే గ్రామానికి చెందిన ప్రభులాల్ ఆర్ జోషి ఇక్కడివాళ్ళకు కుక్‌లుగా మంచి ఉద్యోగాలు కల్పించేందుకు ఇటీవల కాలంలో గుజరాత్‌కి చెందిన వ్యాపారి జితేంద్ర షా, అతని ఆతిథ్య కంపెనీతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ వందలాదిమంది కుక్‌లకు శిక్షణనివ్వడంతో పాటు వారికి మంచి ఉద్యోగాలనూ కల్పిస్తున్నారు.

ఇంతవరకూ చెఫ్‌ల గ్రామంగా ఉన్న మెనార్ ఇటీవలే మరోవిషయంలోనూ వార్తలకెక్కింది. అదే పర్యావరణ పరిరక్షణ. ప్రకృతిని పరిరక్షిస్తున్న గ్రామంగానూ పేరొందింది. ఈ గ్రామంలోని కొలనుల దగ్గరకు వచ్చే పక్షులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడడంతో పాటు ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థను నెలకొల్పేందుకూ వారు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా వారు ఈ గ్రామస్తులు సాగు కోసం ఈ కొలనుల్లోని నీటిని వాడడం ఆపేశారు. అలాగే చేపలు పట్టడాన్ని నిషేధించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా తరచుగా పూడిక తీస్తున్నారు.



హిందూజాల ఇంట్లో పనిచేసిన యశ్వంత్ (నలుపు డ్రస్ వేసుకున్న వ్యక్తి)

పండగకు ప్రత్యేకాలంకరణ!

సంక్రాంతి పండగకు ఇంటి ముంగిట ముత్యాల ముగ్గులు వేసి మురిసిపోవడం మామూలే. మరి ఇంటి లోపల అలంకరణ సంగతేంటి! ఈ విషయంలో ఎవరికి వారు ప్రత్యేకంగా కనిపించాలని కోరుకుంటారు. మరి అందుకు అనుగుణమైన ఐడియాలు ఉన్నాయా! ఇంకా ఆలోచిస్తూనే ఉన్నారా! దీపావళి అయితే సాధారణంగా మామూలు దీపాలు, విద్యుత్ దీపాలు, క్యాండిల్స్‌తో అలంకరిస్తారు. మరి సంక్రాంతికి ఏం చేస్తారు? ఏముంది ఈ పండగని ప్రతిబింబిస్తూ ఈ సీజన్‌లో వచ్చే పువ్వులతో అలంకరణ చేయవచ్చు. లేదంటే చెరుకుగడలు, కుండలూ ఉపయోగించుకోవచ్చు. ఇంకా లేదంటే ధాన్యపు రాశులు వచ్చే కాలాన్ని గుర్తు చేస్తూ ధ్యానపు కొట్టం, హరిదాసు, ఎడ్లబండితో కూడిన చిత్రాలతో కొత్త అలంకరణ చేయవచ్చు. ఇలా అట్టముక్కలు, గడ్డి, గమ్‌తో ఈ ధాన్యపు కొట్టం లేదా ధాన్యం ఉంచే పూరిల్లుని రూపొందించి దానికి కొద్దిగా రంగులు వేస్తే సంక్రాంతి అంతా మీ ఇంట్లోనే కనిపిస్తుంది. మీ ఇంటికి వచ్చిన అతిథులనూ అమితంగా ఆకట్టుకోవచ్చు. ఇలాచేయడం ద్వారా ఈ తరానికి తెలియని విషయాలనూ తెలియజేసినట్టూ ఉంటుంది. ఇవన్నీ కాదంటే ఈరోజుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఎలాగూ అందుబాటులో ఉంది. ఇంటర్నెట్ సాయంతో సంప్రదాయం, ఆధునికత కలబోసిన ఎన్నో అత్యాధునిక అలంకరణ డిజైన్‌లూ వస్తున్నాయి. వాటివంటా ఒక లుక్కేయండి. ఈ రోజుల్లో ఎక్కువమంది అపార్టుమెంట్లు, గ్రూప్ హౌస్‌ల్లోనే ఉంటున్నారు. ఇలాంటివాళ్ళు అంతా కలిసి ఒకే క్యాంపస్‌లో పండగ సందడి చేసుకోవడమూ సాధారణ విషయంగా మారింది. ఇలాంటప్పుడు ఆవరణలో ఈ సీజన్‌లో వచ్చే బంతి, చామంతి పువ్వులతో పాటు బంతి ఆకులు, మందార రేకులు, తమపాకులు, ఇతరత్రా పువ్వులతో కలిపి అందమైన డిజన్ వేసుకోవచ్చు. ఇది అపార్టుమెంట్ క్యాంపస్‌ల్లోనే కాదు ఇంటి లోపల హాల్ మధ్యలోనూ ఈ అలంకరణ నిండుదనాన్ని ఇస్తుంది. పండగ సందడిని తెస్తుంది. ఈ అలంకరణ సంప్రదాయత ఉట్టిపడేలా చేస్తుంది. ఇంట్లో ఉండే పెద్దవాళ్ళనీ, వృద్ధ తరాన్నీ మెప్పిస్తుంది. అందరి ప్రశంసలనూ అందుకునేలా చేస్తుంది. దీంతోపాటు అందరినీ ఆకట్టుకునే సంప్రదాయ అలంకరణ మరొకటీ ఉంది. అదే కుండల డిజైన్. చిన్న, మధ్య, పెద్ద సైజుల్లో అందమైన రంగులేసిన కుండలు తీసుకోండి. ఇంటిలోపల మధ్యలో మంచి రంగవల్లిక వేసి అందులో సైజుల వారీగా పెద్ద కుండ నుంచి చిన్న కుండ వరకూ ఒకదాని మీద ఒకటి పేర్చండి. వాటి చుట్టూ చెరకు గడలు నిలబెట్టండి. ముగ్గు చుట్టూ ఇంట్లో ఉండే మంచి చెక్క బొమ్మలనూ తీర్చిదిద్దండి. గది నాలుగు మూలలా బెలూన్లు వేలాడదీయండి. వీటి మధ్యలో అక్కడక్కడా గాలిపటాలు, తాటాకులతో చేసిన చిన్నచిన్న బొమ్మలు పెట్టదండి. కొంచెం విద్యుత్ దీపాలంకరణ చేయండి. ఇంకేముంది పండగ లుక్ వచ్చేసినట్టే. ఈ పని చెయ్యడానికి అంతగా కష్టపడనక్కర్లేదు కూడా. ఇవన్నీ కాదు ఇంకా సింపుల్‌గా ఉండాలంటే మామిడాకులతో ఇల్లాంతా పచ్చదనాన్ని నింపండి. మామిడాకులను వివిధ రకాల డిజైన్‌లలో గుచ్చి వెరైటీ తోరణాలు తయారుచేసి అన్ని గదుల్లోనూ గడపలకే కాదు చుట్టూ నాలుగు మూలలా అలంకరించండి. ఇలా చేస్తే పర్యావరణాన్ని పరిరక్షించినవారూ అవుతారు. చూశారుగా ఎన్ని రకాలుగా అలంకరణ చేసుకోవచ్చో. మీదైన శైలిలో ప్రత్యేకాలంకరణ చేయండి. ఇల్లంతా పండగ శోభను నింపండి.





ఈజీ రంగోలీ డిజైన్స్!













డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

తోటి వకీళ్ళందరూ నన్నాకాశం మీదికెత్తి ప్రపంచ మంతా నాకు బ్రహ్మరథం పడుతూంటే నువ్విలా అకార ణంగా నామీద విరుచుకు పడటమేమిటి?" అన్నా. "మొగాడు ఎన్ని ఘోరాలు, ఎన్ని పాపాలు చేసినా తప్పలేదు. ఆడది ఒక్క పొరపాటు చేసినట్టు అనుమానం వుంటే చాలు - దాన్ని హత మార్చేసి అధఃపాతాళానికి అణచి వేయడమే. ఆ రాజాగారివైఖరి, చేష్టలు, అతగాడి పోకిరితనం, జూదం వాటి గురించి నువ్వు కోర్టులో ప్రసంగించవేం?" అంది. "ఇదేమిటి? నేనతని తరపున వకీలునని మర్చిపోయావా యేమిటి?" అన్నా. "అసలీ అన్యాయం అంతా ధర్మశాస్త్రంలోనే ఉంది. మొగాడికో న్యాయం; ఆడదానికో న్యాయం; ప్రభువుకో న్యాయం; భృత్యు డికో న్యాయం; ధనికుడికో న్యాయం; బీదవాడికో న్యాయం. యీ బూటకపు ధర్మశాస్త్రం కల్పించి నీలాటివాళ్ళు పొట్టనింపుకుంటున్నారు.

(నిన్నటి సంచిక తరువాయి)

నీ న్యాయశాస్త్రం - నీ పద్ధతులూ - నీ సాక్షిపరీక్ష పాప పంకిలం కాకపోతే మరేమిటి? నువ్వు న్యాయంకోసమే తాపత్రయపడితే నీ 'క్లయింటు' ధర్మరాజే అన్నట్టెందుకు వాదిస్తావు! అతడు నీతో రహస్యంగా చెప్పిన సంగతులని కోర్టు వారి యెదుట పెడితేనేగాని సత్యం న్యాయం ఎలా తేల్తాయి? నిజం మభ్యపరుస్తే న్యాయానికే గెలిపించాలి - అదే నీ పరమా వధి. నీవాడు దోషి అని నీకు తెలిసినకూడా - నిజం మరుగు పరచడం - నీనోటికెలావస్తే అలా మాట్లాడం - అబద్ధపు వ్యాజ్యాలు పట్టడం - దొంగసాక్ష్యం బనాయించడం - ముద నష్టపు ఆస్తులకోసం వ్యాజ్యాలు వేయించడం - అందుకు పెట్టుబడి పెట్టడం - గెలుస్తే భాగం పంచుకోడం - ఇదీ నువ్వు చేస్తున్నపని! ఛీ - నీకు సిగ్గులేకపోతే - నాకు సిగ్గువేస్తుంది! ఇలా అధర్మంగా సంపాదిస్తున్న మాలకూడు తిని నేను మయిలపడి పోతున్నాను" అని అంటూ అక్కడనుంచి లేచి ఇంట్లోకెళ్ళిపోయింది...శాంతం చెప్పినదంతా నిజమే. పెట్టిన చీవాట్లూ - తిట్టిన తిట్లూ సబబే - కాని - నన్నంటే యేం ప్రయోజనం! నేనేం మనువునా - శాస్త్రకారుణ్ణా? యీ ప్రపంచ మహా ప్రవాహంలోనే నొక నీటిబొట్టును. నా కుటుంబం కోసం - నా పొట్టకోసం - నేను యమ యాతన పడుతుంటే నన్ను నానా మాటలంటే నేనేం చేయగలను? 'నువ్వు చేసేదంతా అధర్మం - నువ్వు తలచేదంతా నీచం. నువ్వు చెప్పేదంతా అశ్లీలం - నువ్వు పలికేదంతా పచ్చి అబద్ధం - నీ బ్రతుకే అనర్థం' అని శాంతమే నన్నంటే - నేనింకేలా సహించడం? నన్నింకా ఎల్లా పొగడుతుందో - ఎల్లా మన్నన చేస్తుందో - ఎల్లా స్తుతిస్తుందో అని గంపె డాశతో రెక్కలు కట్టుకుని ఇంటికి వాల్తే - వేడినీళ్ళు, చెప్పుదెబ్బలూనా? నేను చేసేది ప్రతీదీ మహా పాతకం అని ఆవిడకు తోస్తూంటే - ఇక ఈ సంసారం ఎందుకూ - యీ బతుకెందుకు?

మెరీనాకెళ్ళి ఇంటికి కొచ్చేటప్పటికి ఆలస్యం అయింది. మేము ఇంట్లోకి వెళ్ళబోతున్నాం. ఇంతట్లో లేడీ అయ్యంగారొచ్చింది. కారు దిగుతూనే ఆవిడ తిన్నగా శాంతం దగ్గరకొచ్చి ఆమెని కౌగలించుకుని, "శాంతంగారూ! ఈవేళ శాస్త్రిగారు ప్రదర్శించిన సాక్షి విచారణకౌశలం అమోఘం! ఆ ప్రచండ వాక్పటిమ అజేయం! ఆ సమయస్ఫూర్తి అద్వితీయం! ఆ న్యాయశాస్త్ర పాండిత్యం అనన్య సామాన్యం!" అంటూ వెంటనే కారెక్కి వెళ్ళిపోయింది. ఉత్సాహపూరితములైన ఆ పొగడ్తలు, మనోరంజకములైన ఆ మాటలు విని - ఒక గడియపాటు ప్రపంచాన్ని మర్చిపోయాను. తెలివి తెచ్చుకుని శాంతంవైపు చూశాను. ఆమె ముఖం ఎర్రబారి వుంది. కళ్ళు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి. ముఖాన చెమట. చెమటచుక్కల్లో కుంకుమబొట్టు కరిగిపోయింది. ఏమీ మాట్లాడకుండా - గిర్రున తిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయింది.... రాత్రంతా శాంతం నాతో మాట్లాడలేదు. నేనూ మాట్లాడలేదు...

...నిద్రలో కల. ఉద్యానవనం. ఉద్యానవనంలో పచ్చని పచ్చిక బయలు, పచ్చిక బయలుపైన నేను పడుకొనివున్నా. చల్లని పిల్లగాలులు. పండువెన్నెల, పుష్పవర్షం. ఆకాశంమీద పరుగెడుతూంది చంద్రబింబం. పరిగెడుతున్న చంద్రబింబం



నన్ను చూచి నా దగ్గిరాగింది. ఆగిన చంద్రబింబంలో నుంచి లేడీ అయ్యంగారు ప్రత్యక్షమయింది. ఆమె చేతిలో పువ్వులదండ నా మెళ్ళో వేసింది. మెళ్ళో వేస్తూ,"...అమోఘం!... అజేయం!.. అద్వితీయ...అనన్యసామాన్యం!" అని పలికింది....కల కరిగి పోయినా తీయని ఆమె పలుకులు ఇప్పటికీ నా చెవుల్లో వినిపిస్తూనే వున్నాయి.

53 ఆమె

ఉత్తపుణ్యానికే పెద్ద గంద్రగోళం అయిపోయింది! నిన్న పత్రికల్లో చదివేను - ఈవేళ నుంచి వారంరోజుల వరకూ దామెర్ల రామారావుగారి చిత్రాలు ఆంధ్ర సమ్మేళన ఆధ్వర్యాన విక్టోరియా హాలులో ప్రదర్శిస్తారని. మధ్యాహ్నం రెండుగంటలకే వెళితే సమ్మర్థం ఉండదు - చిత్రాలు సావకాశంగా చూడ వచ్చు-ఐదుగంటలముందే వెళిపోరావచ్చుననుకుని వెళ్ళేను.

చిత్రాలు ఏర్పాటు బాగావుంది. చూడటానికి కళ్ళకి ఇబ్బంది లేకుండా చిత్రాల్ని కంటి యెత్తునే వేలగట్టేరు. వెల్తురు చిత్రాలు మీదపడి ప్రతిబింబించకుండా జాగ్రత్తపడ్డారు. అన్నిటికంటే ప్రశంసనీయం ఏమంటే - ముఖ్యమైన చిత్రాలముందు కుర్చీలు సోఫాలు వేశారు - సావకాశంగా కూచుని చూచేందుకు - చిత్రకారులు చూచి వ్రాసుకునేందుకు.

రామారావుగారు మరో నాలుగుకాలాలు బ్రతికుంటే ఎంత బాగుండు ననిపించింది. ఆయన వేసుకున్న "స్కెచ్చిలు" వందలు, వేలు వున్నాయి. ఆంధ్రత్వం ఆయన చిత్రాలలో ఉట్టి పడుతూంది: "దశరథ మహారాజు అవసానదశ" ఎంతో బావుంది.

'సిద్ధార్థరాగోదయం"అద్భుతంగా వుంది...

"అతిలోక లావణ్యవతియౌ యశోధరా
దృక్కులాక్షరింప స్థిరచిత్తు సిద్ధార్థు
జన్మాంతరాయాత సంస్కారవశముచే
రాజపుత్రుని కపుడు రాగోదయంబయ్యె."

సిద్ధార్థుని ముఖవర్చస్సు చిత్రించినపుడు చిత్రకారుని చిత్తంలో హృదయవాణి పలి కుంటుంది. అందుచేతే యశోధరని అంత లావణ్యవతిగా చిత్రించగలిగేడు! ఎంతసేపు చూసినా తనివితీరలేదు. ఆ చిత్రం తరువాత "పల్లెటూరిబావి" అనే చిత్రం వుంది. దృశ్యం సామాన్యమైందే అయినా, తెలుగు పడుచుల వొయ్యారం సోయగం ప్రత్యక్షంగా తాండవిస్తు న్నాయి. జీవం, అభినయం నిండి వున్నాయి. బొమ్మ చూస్తూ ముచ్చటపడ్డాను. ఆ నీళ్ళ బిందెలు చూచినపుడు జ్ఞాపకం వొచ్చింది. ఈవేళ శుక్రవారం. శాస్త్రి తలంటుకునే రోజు. ఐదు గంటలకి అతను ఇంటి కొచ్చేసేవుంటాడు - అని. గడియారం చూసేసరికి ఐదుంపావైపోయింది. శాస్త్రి కచేరీనుంచి ఇంటి కొచ్చేసి ధూంధాం చేసేస్తూంటాడు - ఆ ఓడ్రమంగలాడు చిందులు తొక్కుతుంటాడు - ఏంచెయ్యను? అనుకుంటూ టాక్సీ చేయించుకుని ఇంటి కెళ్ళాను. శుక్రవారం సాయంత్రం తప్ప మరివొకరోజు తలంటించుకోడు. అదేం పట్టింపో నాకు తెలీదు.

బంగళా చేరేసరికి వుంది. ఇక. టాక్సీ డ్రైవరుని నేను కొన్న బొమ్మ ఇంట్లో పెట్టమని అద్దె ఇచ్చేశా. అప్పుడు మొదలు పెట్టాడు: "నేను ఇంటి కొచ్చేటప్పటికి నువ్వుండొద్దా? ఈవేళ తలంటు రోజు కదా? వారానికోసారి తలంటుకోకపోతే నాకు కాకచేస్తుందని నీకు తెలీదా? మొగాడెలాగా విధిలేక వీధిలోపడి సంపాదించాలి. ఆడదికూడా వీధిలో పెత్తనాలకి వెళితే సంసారం ఎలా చస్తుంది?" అని గుక్క తిప్పకుండా వడగళ్ళవానలా అదే కేకలేశాడు. నాకు కొంచెం రోషమే వచ్చింది. "నీకు వేళ పట్టున తలంటి జలకం ఆడించడానికి నేనేం 'నర్సు'ని కాను - అందుకు నన్ను జీతం ఇచ్చి వుంచలేదు" అనబోయాను. కాని మళ్ళీ ఎందుకు అనవసరంగా వాగ్వాదం - ఇప్పుడు అతనితో వాదిస్తేనే కాని, స్త్రీ స్వతంత్రం స్థిరపడదా ఏమిటి? అని చెప్పి, నోరు నొక్కుకుని, తలంపోసి, కాఫీ ఇచ్చా.

కాఫీ పడేసరికి అంతరంగమున ఆత్మారాముడు కాస్త చల్లబడ్డాడు! ఇంకా కొంచెం హుషారు ఇద్దాం అని, "నిన్నటి ఓల్డు మొబైల్ కారు కొనేసినట్టే?" అన్నా. ఏడెనిమిది తమలపాకుల చిలకలు నమిలి, పీటీ ఆరంగాల సువాసన వక్క పొడివేసుకుని బొడ్డుగిల్లి లవంగం నమిలి, హంస పాదుగొట్టం తీసి అందుమీద జాజికాయ గీసి, గుండ నోట్లో వేసుకుని, జాపత్రి దాల్చినచెక్క నమిలి యాలగ్గింజలని ముందు పళ్ళతో కొరికి, కాచుముక్క వేసుకుని, నాలుగుసార్లు తాంబూలం నమిలి, నాలికి చాపి పండిందా లేదా అని చూచుకుని - అప్పుడు నవ్వుతూ "మొన్న సోమవారం జరిగిన విశేషానికి నీకు బహుమతీ ఆ కారు!" అన్నాడు. "మొన్న సోమవారం జరిగిన విశేషం నాకు తెలిసినంతవరకూ నరసయ్యమ్మగారి మనోవృత్తి కేసు నెగ్గకుండా చెయ్యడమేకదూ!" అన్నా. "ఏం? అదొక గొప్ప విశేషం కాదా ఏమిటి? ఆవిడ "పాపరైనా" సంఘసంస్క ర్తలందరూ చందా వేసుకుని కలకత్తా ఎడ్వకేట్ జనరల్ కళ్యాణ సుందర వాసూని పెట్టారు. మా ప్రొప్రయిటరుగారు నన్ను నమ్ముకుని నా ఒక్కడిమీదే వదలి. పెట్టేశారు. పాపం, బతికి చెడ్డది. ఆవిడమీద నాకెంతో సానుభూతి.. అయితే నేనేం చేసేది? హిందూశాస్త్రం అందుకు వ్యతిరేకం. ఆ మాటే నేను కోర్టులో చెప్పేను. నా వాదనలో తలవెంట్రుక వాసి తప్పుందేమో చెప్పు?" అమ్మయ్యో! ఆవిడకి ఐదో యేటే వైధవ్యం ప్రాప్తం అయింది. ఇప్పుడావిడకి ఏభై రెండు, మా క్లెయింటు సలభై ఏడు వేలిచ్చుకోవాలన్న మాట - రాజీ చేసుకున్నా! నయం, మా ప్రొప్రయిటరుగారు ఆమాట వింటే గుండె పేలి చస్తాడు" అన్నాడు. "పీడాపోయె" అన్నా కోపం వచ్చి. "నయం యింకా! అతడు చస్తే మా ప్లీడర్ల మాటేమిటి? ఈ కేసుకి నాకు పదివేలు ఫీజున్నూ, ఐదువేలు బహుమతీన్నీ, వార్షికం వెయ్యిచ్చాడు. చూసుకోమరి శాస్త్రి మజా!" "ఒక స్త్రీ మనోవృత్తిలేక చస్తూంటే, మరో స్త్రీ మోటారు కారుతో అన్ని సౌఖ్యాలూ అనుభవిస్తూం డడమా? ఆ కారు ఎక్కడం అంటే నాకు ఒక అఘాయిత్యం లాగుందోయి!" అన్నా. "మొన్న సోమవారం అంతటికంటే గొప్ప విశేషం జరిగింది. ఆ వేళ నీ పుట్టింరోజు కాదూ? నువ్వు మర్చి పోయినా నేను మాత్రం మర్చిపోగలనా? ఆరోజు కీ కానుక!" అన్నాడు శాస్త్రి నాచెయ్యి నిమరుతూను.

- ఇంకా వుంది.

'రూపాయి' నోటు పుట్టి ఎన్నేళ్లు పూర్తయ్యాయి ?



కరెంట్ ఎఫైర్స్ బిట్ బ్యాంక్

★ ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే సూపర్‌సోనిక్ క్షిపణి 'ఆకాశ్‌'ను భారత్ 2017 డిసెంబర్ 5న విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి పరిధి ఎంత ? - **25 కిలోమీటర్లు**

★ సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం తరపున కేసులు దాఖలు చేసేందుకు, వాటిని పర్యవేక్షించేందుకు ఎవరిని నియమిస్తూ తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి వి.నిరంజన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు ? - **'సుప్రీం' న్యాయవాది పి.వెంకటరెడ్డి**

★ దక్షిణ కొరియాలోని జెజూలో జరిగిన సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ 12వ సమావేశాల్లో 'మానవాళి సాంస్కృతిక వారసత్వ సంపద'గా గుర్తిస్తూ భారత్‌లోని దేనికి యునెస్కో గుర్తింపునిచ్చింది ? - **హిందువుల పవిత్ర వేడుక కుంభమేళా**

★ ప్రయాణ మార్గంలో పొంచిఉన్న ముప్పులను ముందుగానే పసిగట్టి సిబ్బందిని అప్రమత్తం చేసే అద్భుత సామర్థ్యమున్న స్మార్ట్ నౌకను అందుబాటులోకి తెచ్చిన దేశం ఏది ? - **చైనా**

★ వియన్నాలో జరిగిన డబ్ల్యూఏ ప్లీనరీ సమావేశంలో ఏ దేశానికి సభ్యత్వం కల్పిస్తూ అత్యంత కీలకమైన ఎగుమతి నియంత్రణ వ్యవస్థ 'వాసెనార్ ఏర్పాటు' (వాసెనార్ అరేంజ్‌మెంట్ - డబ్ల్యూఏ) నిర్ణయం తీసుకుంది ? - **భారత్**

★ ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ చంద్రశేఖర శర్మకు ఎన్‌ఏఎస్‌ఐ 87వ వార్షిక సమావేశాల్లో ఏ పురస్కారం దక్కింది ? - **యువ శాస్త్రవేత్త**

★ మెక్సికోలో జరిగిన ప్రపంచ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి ప్రపంచ పారా స్విమ్మింగ్‌లో స్వర్ణం అందుకున్న తొలి భారత మహిళగా ఘనతను సాధించింది ఎవరు ? - **కాంచనమాల పాండే**

★ మనదేశ కరెన్సీకి ప్రాథమిక యూనిట్ అయిన 'రూపాయి' నోటు పుట్టి 2017 నవంబర్ 30వ తేదీకి సరిగ్గా ఎన్నేళ్లు పూర్తయ్యాయి ? - **వందేళ్లు**

★ భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా ఎవరు ఎంపికయ్యారు ? - నరిందర్ బత్రా

★ భారత్ స్టాండర్డ్ (బీఎస్-4) ప్రమాణాలతో దేశంలో తయారయ్యే వాహనాల రిజిస్ట్రేషన్‌ను ఎప్పటినుండి నిలిపివేస్తామని కేంద్రప్రభుత్వం తెలిపింది ? - **2020 జూన్ 30 నాటికి**

★ ది ఎకనామిక్ టైమ్స్ పత్రిక 2017 సంవత్సరానికి ఏషియన్ బిజినెస్ లీడర్ అవార్డుకు ఎవరిని ఎంపిక చేసింది ? - **మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహ్మద్**

★ దక్షిణాఫ్రికాలో జరిగిన జోబర్గ్ ఓపెన్ - 2017లో ఛాంపియన్‌గా నిలిచి ఈ టైటిల్ సాధించిన తొలి భారత ఆటగాడిగా నిలిచింది ఎవరు ? - **శుభాంకర్ శర్మ**

★ ఇండోనేషియాలో 54 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్‌లో భారత ప్రభుత్వరంగ సంస్థ ఉత్పత్తి ప్రారంభించింది. ఆ సంస్థ ఏది ? - **భెల్**

★ టెస్టు క్రికెట్ చరిత్రలో వరుసగా అత్యధిక (9) సిరీస్ విజయాలు సాధించిన ఆస్ట్రేలియాను సమం చేసిన జట్టు ఏది ? - **భారత్**

★ హైదరాబాద్ తార్నాకలోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) సంచాలకురాలిగా ఎవరు నియమితులయ్యారు ? - **డాక్టర్ హేమలత**

★ దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా ఎవరు నియమితులయ్యారు ? - **సలీల్ ఎస్ పరేఖ్**

★ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) చట్టం సమీక్ష కమిటీ శాశ్వత కో-ఆప్షన్ సభ్యునిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి నియమితుయ్యారు. ఆయన పేరు ఏమిటి ? - **ఎస్.కె.రెహమాన్**

★ 2023 ప్రపంచ క్రికెట్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న దేశం ఏది ? - **భారత్**

★ ఎస్ఎంసీఏ అఖిల భారత ఫిడె రేటింగ్ (1500 లోపు) చెస్ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది ఎవరు ? - **మోహన్ (తెలంగాణ)**

★ మధ్యప్రదేశ్‌లో రూ.7,546 కోట్లతో తలపెట్టిన ఏడు నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సారథ్యంలో 2017 డిసెంబర్ 12న జరిగిన సమావేశంలో 'నర్మద కంట్రోల్ బోర్డు' (ఎన్‌సీబీ) ఆమోదం తెలిపింది ? - **నర్మదా - పార్వతి**

★ 2018లో దక్షిణ కొరియాలో జరిగే వింటర్ ఒలింపిక్స్‌లో పోటీపడకుండా ఏ దేశ సమాఖ్యపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నిషేధం విధించింది ? - **రష్యా**

★ ఈశ్వరీబాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా 2017 డిసెంబర్ 1న ఈశ్వరీబాయి స్మారక పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఎవరికి అందజేశారు ? - **ఎంపీ ప్రకాష్ అంబేద్కర్**

★ అక్కినేని జీవనసాఫల్య పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ? - **కళాతపస్వి విశ్వనాథ్**

★ స్థిరాస్తి (అభివృద్ధి, నియంత్రణ) చట్టం - 'రెరా' రాజ్యాంగబద్ధమేనని 2017 డిసెంబర్ 6న ఏ రాష్ట్ర హైకోర్టు తీర్పు చెప్పింది ? - **బాంబే హైకోర్టు**

★ టాటా ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు ? - **గద్దె రుత్విక శివాని**

★ తూర్పు నౌకాదళానికి నూతన చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఎవరు నియమితులయ్యారు ? - **ఎం.ఎస్.పవార్**

★ బ్రెజిల్ ప్రభుత్వం అందించే ఉత్తమ కవితా పురస్కారాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ కవికి ప్రకటించారు. ఆయన పేరు ఏమిటి ? - **పెరుగు రామకృష్ణ**

★ 12 ఏళ్లలోపు బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన కేసుల్లో దోషులుగా తేలినవారికి మరణదండన విధించేందుకు ఉద్దేశించిన బిల్లును 2017 డిసెంబర్ 4న ఏ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది ? - **మధ్యప్రదేశ్**

★ భారత సాగర పోరాట సామర్థ్యాన్ని మరింత ఇనుమడింపజేస్తూ.. స్కార్పీన్ శ్రేణిలోని తొలి జలాంతర్గామిని ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2017 డిసెంబర్ 14న ముంబాయిలో నౌకాదళంలో ప్రవేశపెట్టారు. దాని పేరు ఏమిటి ? - **ఐఎన్ఎస్ కల్వరి**

★ బాలీవుడ్ ప్రముఖ నటుడు శశికపూర్ 2017 డిసెంబర్ 4న ముంబాయిలో మరణించారు. శశికపూర్ ప్రఖ్యాత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును ఏ సంవత్సరంలో అందుకున్నారు ? - **2015**

★ స్పోర్ట్స్ బిజినెస్ డాట్‌కామ్ నిర్వహించిన ఒక సర్వేలో 2017 అత్యుత్తమ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ 'టాప్-10' జాబితాలో బీసీసీఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాహుల్ జోహ్రికి ఎన్నవ స్థానం లభించింది.? - **నాలుగో స్థానం**

★ అంతర్జాతీయ వన్డే క్రికెట్ చరిత్రలో మూడు డబుల్ సెంచరీలు చేసిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించింది ఎవరు ? - **రోహిత్ శర్మ**

★ ప్రసారభారతి బోర్డు చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ? - **ఎ.సూర్యప్రకాశ్**

★ ప్రఖ్యాత 'ఫారిన్ పాలసీ' మేగజైన్ 2017కుగాను 50 మందితో రూపొందించిన 'ప్రపంచ అత్యుత్తమ ఆలోచనపరుల జాబితా'లో అగ్రస్థానం సాధించింది ఎవరు ? - **భారతీయ అమెరికన్ కమలా హ్యారిస్**

★ ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎవరు నియమితులయ్యారు ? - **ప్రదీప్‌సింగ్ ఖరోలా**

★ ప్రపంచ అత్యుత్తమ ఫుట్‌బాలర్‌కు ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'బాలన్ డి ఓర్' అవార్డుకు 2017 సంవత్సరానికిగాను ఎవరు ఎంపికయ్యారు ? - **క్రిస్టియానో రోనాల్డో (పోర్చుగల్) (రోనాల్డో ఈ అవార్డును గెలుచుకోవడం ఇది ఐదోసారి. దీంతో అత్యధికంగా ఐదుసార్లు ఈ అవార్డును అందుకున్న ఆటగానిగా లియోనిన్ మెస్సీ (అర్జెంటీనా) రికార్డును రోనాల్డో సమం చేశాడు)**

★ ప్రపంచ హాకీలీగ్ (హెచ్‌డబ్ల్యుఎల్) టోర్నీలో కాంస్యం కోసం జరిగిన పోరులో 2-1తో జర్మనీపై నెగ్గిన దేశం ఏది ? - **ఆతిథ్య భారత్**

★ ఎస్ఎంఎస్‌కు 2017 డిసెంబర్ 2తో ఎన్నేళ్లు నిండాయి ? - **25 ఏళ్లు**

★ జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా అధికారికంగా గుర్తిస్తున్నట్లు 2017 డిసెంబర్ 6న ఎవరు ప్రకటించారు ? - **అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్**

★ దూరదర్శన్ యాదగిరి ఛానెల్ హెడ్‌గా ఎవరు నియమితులయ్యారు ? - **ఎం.విజయభగవాన్**

★ ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోకు ప్రథమ మహిళా మేయర్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించింది ఎవరు ? - **సంయుక్త భాటియా**



★ స్వలింగ వివాహాలను చట్టబద్ధంగా అనుమతించే కీలక బిల్లును 2017 డిసెంబర్ 7న ఏ దేశ పార్లమెంట్ ఆమోదించింది ? - **ఆస్ట్రేలియా**

★ సంబల్‌పూర్ యూనివర్సిటీ ఏటా ఇచ్చే గంగాధర్ జాతీయ అవార్డు 2016కు ఎవరు ఎంపికయ్యారు ? - **తెలుగు కవి కె.శివారెడ్డి**

★ 2017 కుగాను ప్రతిష్ఠాత్మక టైమ్ 'ఈఏటి మేటి వ్యకి'గా నిలిచింది ఎవరు ? - **నిశ్శబ్ద ఛేదకులు**

★అండర్ -19 ఛాలెంజర్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టు ఏది ? - **భారత్ బ్లూ**

★ 2017 సంవత్సరానికిగాను పెద్దిభొట్ల సుబ్బరామయ్య సాహిత్య స్ఫూర్తి పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ? - **కథా రచయిత మహ్మద్ ఖదీర్‌బాబు, రచయిత్రి డి.సుజాతాదేవి**

★ ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) నూతన సెక్రటరీ జనరల్‌గా 2017 డిసెంబర్ 1న బాధ్యతలు స్వీకరించింది ఎవరు ? - **లవ్ సక్సేనా**

★ పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటర్ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) కొత్త చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ? - **దినేశ్ కె సరాఫ్**

★ విజయవాడలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా ఎవరు నియమితులయ్యారు ? - **ఏపీ రవీంద్రబాబు**

★ రామోజీ ఫిలిం సిటీలో 2017 డిసెంబర్ 1 నుంచి 4 వరకు జరిగిన ఇండీవుడ్ కార్నివాల్- 2017లో ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్‌కు ఏ పురస్కారాన్ని ప్రదానం చేశారు ? - **లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ పురస్కారం**

★ వ్యూహాత్మక హంబంటోట రేవును 99 ఏళ్ల లీజు కోసం శ్రీలంక ప్రభుత్వం లాంఛనంగా ఏ దేశానికి అప్పగించింది ? - **చైనాకు**

★ అక్కినేని అంతర్జాతీయ పురస్కారం 'వైద్యరత్న'కు ఎవరు ఎంపికయ్యారు ? - **డాక్టర్ గుదారు జగదీష్**

★ దక్షిణాఫ్రికా ప్రాంతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన దేశం ఏది ? - **భారత్**

★ రామోజీ ఫిలిం సిటీలో 2017 డిసెంబర్ 1 నుంచి 4 వరకు జరిగిన ఇండీవుడ్ కార్నివాల్ - 2017లో ప్రముఖ నటి జయప్రదకు ఏ పురస్కారాన్ని ప్రదానం చేశారు ? - **ఐకాన్ ఆఫ్ ఇండియన్ సినిమా**

భారత రాజ్యాంగం విశిష్ట లక్షణాలు

★ ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగం ఏది ? - **భారత రాజ్యాంగం**

★ భారత రాజ్యాంగాన్ని అత్యంత సుదీర్ఘమైనదిగా ఎవరు అభివర్ణించారు ? - **ఐవర్‌జెన్నింగ్స్**

★ మన దేశ రాజ్యాంగం ప్రారంభంలో ఏవిధంగా విభజింపబడి ఉండేది ? - **ప్రవేశిక, 395 నిబంధనలు, 22 భాగాలు, 8 షెడ్యూళ్లు**

★ ప్రస్తుతం మన దేశ రాజ్యాంగం ? - **465 నిబంధనలు, 12 షెడ్యూళ్ళు, 25 భాగాలను కలిగి ఉంది.**

★ 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం రాజ్యాంగానికి దేనిని చేర్చింది ? - **9వ షెడ్యూల్**

★ 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజీవ్‌గాంధీ ప్రభుత్వం రాజ్యాంగానికి దేనిని చేర్చింది ? - **10వ షెడ్యూల్**

★ 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పి.వి.నరసింహారావు ప్రభుత్వం రాజ్యాంగానికి దేనిని చేర్చింది ? - **11వ షెడ్యూల్**

★ 1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పి.వి.నరసింహారావు ప్రభుత్వం రాజ్యాంగానికి దేనిని చేర్చింది ? - **12వ షెడ్యూల్**

★ మన దేశానికి రాజ్యాంగం నుండి ఏమి సంక్రమించాయి ? - **సర్వోన్నత శాసనం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు**

★ మనదేశంలో అధికారానికి మూలం ఎవరు ? - **ప్రజలు**

★ భారత రాజ్యాంగం కేంద్రంలోను, రాష్ట్రాల్లోనూ ఏ ప్రభుత్వ విధానాన్ని ప్రసాదించింది ? - **పార్లమెంటరీ ప్రభుత్వ విధానం**

★ కేంద్రంలో ఎవరి నాయకత్వంలో మంత్రిమండలి, వ్యక్తిగతంగా రాష్ట్రపతికి సమిష్టిగా లోక్‌సభకు బాధ్యత వహిస్తారు ? - **ప్రధాని**

★ - ఏ నిబంధన ప్రకారం భారత పౌరులందరికీ కుల, మత, జాతి, లింగ, భాష, ప్రాంత, ఆస్తి సంబంధ వివక్షత లేకుండా వయోజన ఓటుహక్కు ప్రసాదించింది ? - **ఆర్టికల్ 326**

★ ప్రపంచంలో మహిళలకు ఓటుహక్కు కల్పించిన దేశం ఏది ? - **న్యూజీలాండ్**

★ భారతదేశ సమగ్రత, సుస్థిరతల దృష్ట్యా భారత ప్రజలకు రాజ్యాంగం దేనిని ప్రసాదించింది ? - **ఏక పౌరసత్వం**

★ ఏ నిబంధన ప్రకారం జమ్మూకాశ్మీర్‌నకు ప్రత్యేక స్వయం ప్రతిపత్తి ఉన్నది ? - **నిబంధన 370**

★ జమ్మూకాశ్మీర్ రాష్ట్ర ప్రజలకు ఎటువంటి పౌరసత్వం కల్పించబడింది ? - **ద్వంద్వ పౌరసత్వం**

★ ప్రపంచంలో తమదేశ పౌరులకు ద్వంద్వ పౌరసత్వాన్ని అందిస్తున్న ప్రముఖ దేశాలకు ఉదాహరణ ? - **అమెరికా & స్విట్జర్లాండ్**

★ మత ప్రమేయం లేని రాజ్యాన్ని ఏమని పిలుస్తారు ? - **లౌకిక రాజ్యం**

★ భారత రాజ్యాంగంలో ప్రవేశికనందు ఏ పదాన్ని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం చేర్చారు ? - **లౌకిక**

★ లౌకికతత్వ పరిధిని మరింత విస్తృత పరుస్తూ ప్రాథమిక హక్కుల్లో భాగంగా మత స్వాతంత్ర్యపు హక్కును ఏ ఆర్టికల్‌లో వివరించారు ? - **నిబంధన25 నుండి 28 వరకు**

★ సవరించుటకు కఠినమైనది ? - **ధృఢ రాజ్యాంగం**

★ సవరించుటకు సరళమైనది / సులభమైనది ? - **అధృఢ రాజ్యాంగం**

★ భారత రాజ్యాంగం ? - **ధృఢ/ అధృఢ రాజ్యాంగాల కలయిక**

★ రాజ్యాంగరీత్యా కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలు పంపిణీ చేయబడినది ? - **సమాఖ్య ప్రభుత్వం**

★ రాజ్యాంగ పరిషత్ ద్వారా రాయబడి మరియు స్వీకరించుట వలన భారత రాజ్యాంగాన్ని ఏమని పిలుస్తారు ? - **రిపబ్లిక్ రాజ్యాంగం**

★ భారత రాజ్యాంగ మౌలిక లక్షణాలు ఏవి ? - **లౌకికవాదం, న్యాయ సమీక్షాధికారం, సమాఖ్య మొదలగునవి.**

★ భారత న్యాయవ్యవస్థ నిర్మాణాన్ని దేనినుండి గ్రహించారు ? - **బ్రిటన్**

★ భారతదేశం అనుసరించే న్యాయవ్యవస్థను......గా పేర్కొంటారు ? - **ఏకీకృత న్యాయవ్యవస్థ**

★ న్యాయసమీక్ష అనే భావనను ఎక్కడనుండి గ్రహించారు ? - **అమెరికా**

★ భారత రాజ్యాంగం దేశాన్ని ..... గా ప్రకటించింది ? - **రాష్ట్రాల యూనియన్**

★ 1978లో 44వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం ప్రాథమిక హక్కుల జాబితాను తొలగించి దేనిలో ఒక సాధారణ చట్టబద్ధమైన హక్కుగా మార్చింది ? - **నిబంధన 300 (ఎ)**

★ రాజ్యంగంలోని ఆదేశిక సూత్రాలను వివరించింది ? - **4వ భాగం (నిబంధన 12 నుండి 35 వరకు)**

★ భారత రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో వేటిని పొందుపరిచారు ? - **కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికారాల విభజన**

★ రాజ్యాంగంలో పొందుపరిచిన స్వతంత్ర ప్రతిపత్తిగా సంస్థలు ఏవి ? - **కాగ్ (148), ఆర్థిక సంఘం (280); పబ్లిక్ సర్వీస్ కమిషన్ (315) మొదలగునవి.**

★ 1919 మాంటేగ్ - ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణల ద్వారా వేటిని ప్రవేశపెట్టారు ? - **ద్విసభా విధానం**

★ భారత రాజ్యాంగంలో 4(ఎ) భాగంలో, 51(ఎ) నిబంధనలో వేటిని ప్రస్తావించారు ? - **ప్రాథమిక విధులు**

★ భారత రాజ్యాంగం విశిష్ట లక్షణం ? - **పంచాయతీరాజ్- నగరపాలక చట్టాలు**

★ అణచివవేతకు గురైన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక నిబంధనలను రాజ్యాంగంలో ఎక్కడ పొందుపరిచారు ? - **16వ భాగం**

★ రాజ్యాంగాలన్నిటికన్నా భారత రాజ్యాంగం సుదీర్ఘమైనది. కారణం ? - **రాజ్యాంగ రచనకు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది.**

★ భారత రాజ్యాంగంలో అత్యవసర పరిస్థితి గురించి నిబంధన 352 నుండి 360 వరకు ఏ భాగంలో పొందుపరిచారు? - **18వ భాగం**

భారత రాజ్యాంగంలో క్రింది లక్షణాలను స్వతహాగా ఏర్పాటు చేసుకున్నారు. అవి :

★ ఏక పౌరసత్వం ★ అఖిల భారత సర్వీసులు ★ ఏకీకృత సమగ్ర న్యాయవ్యవస్థ ★ రక్షిత విప్లవం ★ పంచాయతీరాజ్ వ్యవస్థ ★ రాష్ట్రపతిని ఎన్నుకునే నియోజకగణం ★ అల్పసంఖ్యాక వర్గాల వారికి ప్రత్యేక హక్కులు ★ ఆర్థిక సహాయం ★ కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ★ భాషా సంఘాలకు సంబంధించిన ప్రత్యేకాంశాలు

విశాలాంధ్ర బిజినెస్

-10.12 ▼	-4.80 ▼	300 ▲	900 ▼	డాలరు	ముడి ▲
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	Vs రూపాయి	చమురు
34,433.07	10,632.20	28,550	40,000	63.59	68.82
		22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)		బ్రెంట్ ధర (డాలర్లలో..)

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టీసీఎస్	2,807.10	3.64
విప్రో	326.05	2.66
బీహెచ్ఇఎల్	103.65	2.47
కోల్ ఇండియా	309.85	1.33
అదానీ పోర్ట్స్	428.50	1.05

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
రెడ్డీ ల్యాబ్స్	2,422.80	-1.45
ఎన్టీపీసీ	173.95	-1.25
ఏషియన్ పెయింట్స్	1,177.40	-1.22
బజాజ్ ఆటో	3,240.55	-1.10
ఎస్బీఐ	305.80	-1.05

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.68	63.59
యూరో	75.96	76.24
పౌండ్	86.20	85.99
ఆస్ట్రేలియా డాలర్	49.80	49.88
సింగపూర్ డాలర్	47.67	47.72

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,210	30,171
చెన్నై	28,140	30,096
బెంగళూరు	27,760	29,689
ముంబై	29,060	31,080
విజయవాడ	28,550	30,700



'బినామీ'లకు ఏడేళ్ల జైలు

- ఆస్తి విలువలో 25శాతం జరిమానా
- ఆదాయపన్నుశాఖ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన బినామీ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి ఏడు సంవత్సరాల కఠిన కారాగారవాస శిక్ష పడే ప్రమాదముందని ఆదాయ పన్ను శాఖ తెలిపింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏ తరహా బినామీ లావాదేవీకైనా దూరంగా ఉండాలని ప్రజలకు ఆదాయ పన్ను శాఖ సూచించింది. ఈమేరకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జాతీయ దినపత్రికల్లో ప్రకటనలు ముద్రించింది. ఈప్రకటనల్లో బినామీ లావాదేవీలకు పాల్పడటమంటే మానవత్వానికి వ్యతిరేకంగా నేరం చేసినట్లేనని తెలిపింది. బినామీ లావాదేవీలను అరికట్టేందుకు ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. 2016 నవంబరు1 నుంచి ప్రభుత్వం రూపొందించిన కొత్త బినామీ లావాదేవీల (నిషేధ)సవరణ చట్టం అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఏదేని ఆస్తికి బినామీ దారుగా గుర్తించిన వారికి, ఆస్తి అసలు యజమాని ఇరువురూ విచారణను ఎదుర్కొనాల్సి వస్తుందని ఐటీ శాఖ తెలిపింది. విచారణలో గుర్తించిన బినామీకి గరిష్టంగా ఏడు సంవత్సరాల జైలు లేదా మార్కెట్ విలువ ప్రకారం ఆస్థి విలువలో 25వ వంతు మొత్తాన్ని జరిమానాగా చెల్లించాల్సి వస్తుందని తెలిపింది. ఈ వ్యవహారాల్లో ప్రభుత్వానికి తప్పుడు సమాచారమిచ్చినట్లు తేలితే సదరు నిందితులకు ఐదు సంవత్సరాల జైలు లేదా ఆస్తి విలువలో 10శాతం మేర జరిమానా చెల్లించాల్సి వస్తుందని ఐటీశాఖ ప్రకటన సారాంశంగా ఉంది. సదరు బినామీ ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఐటీ శాఖ వివరించింది. దేశంలో బినామీ చట్టాన్ని అమలు జరిపే విషయంలో నోడల్ ఏజన్సీగా ఐటీ శాఖ వ్యవహరిస్తోంది.

ఎయిర్ ఇండియా కనుమరుగే!

- జూన్ నాటికే పూర్తికానున్న ప్రైవేటీకరణ
- కసరత్తు వేగవంతం చేసిన ప్రభుత్వం



న్యూఢిల్లీ: దేశానికే గర్వకారణంగా నిలిచిన ఎయిర్ ఇండియా ఇక కనుమరుగవడం ఖాయంగా కనిపిస్తున్నది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఈ సంస్థను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం వేగవంతంగా కసరత్తు చేస్తున్నది. ఈ ఏడాది జూన్ నాటికే ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలున్నాయని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఎయిర్ ఇండియా నుంచి ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించేందుకు కేంద్ర మంత్రి వర్గం గత ఏడాది జూన్‌లో సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన విషయం విదితమే. దీంతో ఎయిర్ ఇండియాలోని ప్రభుత్వ వాటాను అమ్మేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని మంత్రుల కమిటీ ప్రస్తుతం వ్యూహాన్ని రూపొందిస్తున్నది. దేశంలో రెండు విమానయాన సంస్థ (ఇండిగో, జెట్ ఎయిర్‌వేస్)లను జాయింట్ వెంచర్‌లో నడుపుతున్న టాటా గ్రూపుతో పాటు మరికొన్ని విదేశీ విమానయాన సంస్థలు ఎయిర్ ఇండియాను కైవసం చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఎయిరిండియాలో ప్రభుత్వ వాటాను అమ్మేందుకు ఇప్పటికే ట్రాన్సాక్షన్ అడ్వైజర్లను నియమించడం జరిగిందని, ఈ ఏడాది జూన్ నాటికి ఎయిరిండియా ప్రైవేటీకరణ ప్రక్రియ పూర్తవుతుందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక అధికారి తెలిపారు. ఎయిరిండియా ప్రైవేటీకరణకు ఇది సరైన సమయం కాదని, ఆ సంస్థ రుణాలను మాఫీ చేయడంతో పాటు పునరుద్ధరణకు కనీసం మరో ఐదేండ్ల గడువు ఇవ్వాలని పార్లమెంటరీ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయదల్చుకున్న నేపథ్యంలో ఆ అధికారి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశానికే ఎంతో గర్వకారణమైన ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించాలన్న నిర్ణయంపై ప్రభుత్వం పునస్సమీక్ష జరిపి, మరో ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలని రవాణా, పర్యాటక, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం తమ ముసాయిదా నివేదికలో పేర్కొన్నట్లు కొద్ది రోజుల క్రితం వార్తలు వెలువడిన విషయం తెలిసిందే. అయితే రుణాలను మాఫీ చేయడంతో పాటు ఎయిర్ ఇండియాలో ప్రభుత్వానికి గల మొత్తం వాటాను అమ్మేయాలని నీతి ఆయోగ్ సిఫారసు చేయడం, నష్టాల్లో నడుస్తున్న ఎయిర్ ఇండియా నుంచి ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఆసక్తి చూపుతుండటంతో ఆ సంస్థను ప్రైవేటీకరించే ప్రక్రియ వేగవంతమైంది.

ఈ ఏడాది 7.3శాతం వృద్ధి రేటు

ప్రపంచబ్యాంకు వెల్లడి



వాషింగ్టన్: అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారత్ ఈ ఏడాది మంచి వృద్ధి రేటు సాధించే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకు అభిప్రాయపడింది. ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర సంస్కరణల నేపథ్యంలో భారత్‌కు అపూర్వమైన వృద్ధి సాధించే సామర్థ్యం ఉందని, 2018లో సుమారు 7.3శాతం వృద్ధిరేటు సాధిస్తుందని, తర్వాత రెండేళ్లలో 7.5శాతం వృద్ధి రేటు సాధించే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకు ఈరోజు విడుదల చేసిన 2018 గ్లోబల్ ఎకనమిక్స్‌లో వెల్లడించింది. గత ఏడాది నోట్ల రద్దు, జీఎస్టీ అమలు జరిగినప్పటికీ భారత్‌లో వృద్ధిరేటు 6.7శాతంగా ఉందని పేర్కొంది. రానున్న పదేళ్లలో ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారత్ అధిక వృద్ధి రేటు నమోదు చేస్తుందని, కాబట్టి స్వల్ప వ్యవధిపై కాకుండా దీర్ఘకాల ఫలితాల గురించి చూస్తున్నామని, గొప్ప వృద్ధిని సాధించే సామర్థ్యం భారత్‌కు ఉందని ప్రపంచ బ్యాంకు అభివృద్ధి అవకాశాల విభాగం డైరెక్టర్ అయేహాన్ కోస్ తెలిపారు. చైనాతో పోలిస్తే భారత్ వృద్ధి రేటు వేగంగా ఉంటుందని అన్నారు. గత మూడేళ్లలో భారత్ వృద్ధి చాలా ఆరోగ్యకరంగా ఉందని పేర్కొన్నారు. 2017లో చైనా 6.8శాతం వృద్ధి సాధించింది. ఇది భారత్ కంటే 0.1శాతం ఎక్కువ. 2018లో చైనాలో 6.4శాతం రేటు నమోదు కాగా, తర్వాత రెండేళ్లలో వృద్ధిరేటు గణనీయంగా తగ్గి 6.3, 6.2 శాతాలకు పరిమితం కానుందని అభిప్రాయపడ్డారు. ఉత్పాదక విషయంలో భారత్‌కు మంచి సామర్థ్యం ఉందని తెలిపారు. కార్మిక, విద్య, ఆరోగ్యం విషయాల్లో సంస్కరణలు, పెట్టుబడులకు అవకాశాలు తదితర అంశాలు భారత్ సామర్థ్యాన్ని పెంచుతున్నాయని అన్నారు. పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో సామర్థ్యంతో పాటు సవాళ్లు కూడా ఉన్నాయని, అయితే ప్రభుత్వానికి ఈ సవాళ్లపై అవగాహన ఉందని, వాటిని పరిష్కరించడానికి సాధ్యమైనంత ఎక్కువగా కృషి చేస్తోందని ప్రపంచబ్యాంకు అధికారి తెలిపారు.

డిసెంబరులో వెల్లువెత్తిన డిజిటల్ లావాదేవీలు



బెంగళూరు: డిసెంబరులో డిజిటల్ లావాదేవీలు వెల్లువెత్తాయని, తొలిసారిగా ఒక నెలలో జరిగిన డిజిటల్ లావాదేవీలు బిలియన్ మార్కును దాటాయని భారత రిజర్వు బ్యాంకు వెల్లడించింది. ఆర్బీఐ వెల్లడించిన వివరాల ప్రకారం డిసెంబరు నెలలో 1.06 బిలియన్ల ఆన్‌లైన్ లావాదేవీలు జరిగాయి. నవంబరు నెలతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 6.5శాతం పెరిగింది. నవంబర్‌లో 998మిలియన్ల లావాదేవీలు జరిగాయి. యునిఫైడ్ పేమెంట్స్, ఐఎంపీఎస్, కార్డ్స్, వాలెట్స్ నుంచి లావాదేవీల సంఖ్య బాగా పెరిగినట్లు ఆర్బీఐ తెలిపింది. ముఖ్యంగా యూపీఐ పేమెంట్స్‌లో 40శాతం వృద్ధి ఉన్నట్లు పేర్కొంది. అలాగే ఐఎంపీఎస్ ద్వారా జరిగిన చెల్లింపుల్లో కూడా 10శాతం వృద్ధి ఉందని, దీని ద్వారా నవంబరులో 89.5మిలియన్ల చెల్లింపులు జరగ్గా.. డిసెంబరు 98మిలియన్లు జరిగినట్లు పేర్కొంది. స్మార్ట్‌ఫోన్ ఆధారిత లావాదేవీల్లో బాగా వృద్ధి నమోదు అవుతోందని, అలాగే కార్డు ద్వారా చెల్లింపులు కూడా 8శాతం పెరిగాయని ఆర్బీఐ వెల్లడించింది.

పెరిగిన బియ్యం ఎగుమతులు

ముంబై: 2017లో భారతదేశ బియ్యం ఎగుమతులు 22 శాతం పెరిగి రికార్డుస్థాయిలో 12.3 మిలియన్లకు చేరాయి. పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో తలెత్తిన భయంకరమైన వరదల కారణంగా బియ్యం ఎగుమతులు భారీగా పెరిగినట్లు రాయ్ టర్స్ నివేదిక వెల్లడించింది. ప్రపంచ టాప్ ఎగుమతిదారుల నుండి ధాన్యం 2018లో పెరగడానికి బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలు కొనుగోళ్ల ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. తరువాతి స్థానాల్లో థాయ్ లాండ్ ఈ స్థానాన్ని ఆక్రమించింది. 2017 సంవత్సరం అంతా బంగ్లాదేశ్ తన కొనుగోళ్లను పెంచింది. మన దేశానికి చెందిన నాన్ బాసుమతి బియ్యాన్ని బంగ్లాదేశ్ 38శాతంతో 8.4 మిలియన్ టన్నులు దిగుమతి చేసింది. మొత్తం ఎగుమతలు 12.3 మిలియన్ టన్నులుగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. 2014లో నమోదైన 11.5 మిలియన టన్నులను 2017 అధిగమించింది.

బ్రిటన్ మంత్రివర్గంలోకి నారాయణ మూర్తి అల్లుడు



లండన్: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి అల్లుడు రిషి సునక్‌కు బ్రిటన్‌లో ఉన్నత పదవి లభించింది. ఆయన్ని బ్రిటన్ ప్రధాని థెరిసా మే తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 36 ఏళ్ల రిషి గత బ్రిటన్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించారు. రుషికి హౌసింగ్, కమ్యూనిటీస్, లోకల్ గవర్నమెంట్ మంత్రిత్వ శాఖ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బ్రిటన్ ప్రధాని కార్యాలయం మంగళవారం రాత్రి ట్వీట్ చేసింది. ఈసారి మంత్రివర్గ విస్తరణలో ఎక్కువగా మహిళలకు, మైనార్టీ చట్టసభ సభ్యులకు అవకాశం కల్పించారు. 2015లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నార్త్ యార్క్‌షైర్‌లోని రిచ్‌మండ్ నియోజకవర్గం నుంచి రిషి సునక్ విజయం సాధించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తిచేసిన సునక్ లండన్‌లో ఓ పెట్టుబడి సంస్థను స్థాపించారు. అనంతరం 2014లో రాజకీయాల్లోకి వచ్చారు. స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్‌లో సహవిద్యార్థి అయిన నారాయణ మూర్తి కుమార్తె అక్షతా మూర్తిని సునక్ పెళ్లి చేసుకున్నారు.

వరుస రికార్డులకు బ్రేక్

ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు



న్యూఢిల్లీ: రికార్డుల మోతతో ప్రారంభమై ఈ వారం సూచీలు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. కేంద్రం వచ్చే నెల ప్రవేశపెట్టనున్న బడ్జెట్, ఈ వారంలో వెల్లడించనున్న కీలక కార్పొరేట్ ఫలితాల నేపథ్యంలో మదుపరులు అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తున్నట్లు వెల్లడైంది. అంతర్జాతీయ షేర్లు ఎటువంటి కీలక విధానాలు లేకపోవడంతో దీని ప్రభావం ఆసియా మార్కెట్లపై ప్రభావం చూపింది. జపాన్ వెలుపల ఆసియా పసిఫిక్ షేర్లు వరుసగా ఆరు రోజుల లాభాల అనంతరం 0.47శాతం తగ్గుదల నమోదు చేశాయి. 30షేర్ల బిఎస్ఇ ఇండెక్స్ సెన్సెక్స్ 10.12 పాయింట్లతో 0.03 శాతంతో 34,433.07 పాయింట్లు నమోదు చేయగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ 4.8 పాయింట్లతో 0.05శాతంతో 10,632.20 పాయింట్లు నమోదు చేసింది. బిఎస్ఇ సెక్టరల్ సూచీల్లో, ఐటి ఇండెక్స్-1.84 శాతం, టెక్ 1.46శాతం, రియాల్టీ 1.16 శాతం, మెటల్0.1శాతం లాభాలను నమోదు చేసింది. మరోవైపు ఆటో ఇండెక్స్ 0.68శాతం, కన్స్యూమర్ డ్యూర బుల్స్ 0.65శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.37 శాతం, పిఎస్‌యు 0.33శాతం నష్టాల్లోనమోదయ్యాయి. హౌసి ంగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొ లిమిటెడ్ నష్టాల్లో నమోదుకాగా ఐటి స్టాక్స్ అయిన టిసిఎస్ లాభాలు నిలక డగా ఉండగా, ఇన్ఫోసిస్ 0.5శాతం తక్కువగా నమోదు చేసింది. నిఫ్టీ ఐటి సూచీ 2.2శాతం అధికృతతో నమోదు కాగా, టిసిఎస్ 3.6శాతం నమోదుచేసింది. మార్కెట్ ప్రారంభంలో 122పాయింట్లు పెరిగిన బిఎస్ఇ సెన్సెక్స్ మధ్యాహ్నా సమయానికి 34,488 పాయింట్లు నమోదు చేసింది.

విజ్ఞానం

నల్ల మిరియాలతో ఒబెసిటీ కంట్రోల్...!



నల్ల మిరియాల వినియోగంతో ఒబెసిటీతోపాటు కండరాల పటిష్టతకు తోడ్పడుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. నల్ల మిరియాల్లో ఉండే 'పిపరోనల్' సమ్మేళనం ఒబెసటీని నియంత్రిస్తుందని మన దేశంలోని వెంకటేశ్వర యూనివర్సిటీ చేపట్టిన22 వారాల అధ్యయనంలో వెల్లడైంది. ఎలుకలపైచేపట్టిన ప్రయోగంలో ఫ్యాట్ అధికంగా తీసుకున్న ఎలుకలకు 16వ వారం నుండి మిరియాలను ఆహారంలో ఇచ్చి చూడగా బరువులో మార్పు వచ్చినట్లు వెల్లడైంది. వీటిలో కండరాల పటిష్టత పెరిగినట్లు గుర్తించడమైంది. 42రోజుల గడువులో 40మిల్లీ గ్రాములకు కేజీ బరువు తగ్గినట్లు తెలుస్తోంది. ఇంపీరియల్ కాలేజి లండన్‌చేపట్టిన అధ్యయనంలో 30శాతం ఒబెసిటీకి జనెటిక్ లింక్‌ఉన్నట్లు పాకిస్థాన్ పిల్లలపై చేసిన అధ్యయనంలో వెల్లడైంది. అడినైలేట్ సైక్లాస్ 3(ఏడిసివై3) లో జీన్ రిలేటెడ్ మ్యుటేషన్ కారణంగా ఒబెసిటీ వస్తున్నట్లు గుర్తించారు. తల్లిదండ్రుల్లో ఈ మ్యుటేషన్ కారణంగా పిల్లల్లో ఇరువైపులనుండి సంక్రమించడంతో మ్యుటేషన్ మరింత తీవ్రమైనట్లు గుర్తించారు. ఏడిసివై3 జీన్‌ను జంతువుల్లో చేసినపరీక్షలో వాసనను సంగ్రహించేశక్తి(అనాస్మియా) లోపించినట్లు తెలుస్తోంది.

పారాసిట్మాల్ వినియోగంతో

కొరవడిన భాషా నైపుణ్యం



గర్భధారణ సమయంలో పారాసిటమాల్ వినియోగంతో భాషా నైపుణ్యం కొరవడుతుందని తెలుస్తోంది. ఎసిటామినోఫిన్ తీసుకోవడంతో ఐక్యు శాతం తగ్గడంతోపాటు భాషా పటిమ తగ్గుతుందని వెల్లడైంది. జ్వరంతో ఉన్న సమయంలో అధికంగా వినియోగించే పారాసిటమాల్ తగ్గుముఖం పట్టడంతోపాటు గర్భధారణ మొదటి నెలల్లో ఈ మందును వినియోగించడంతో పిల్లలో ఆరు రెట్లు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఇది ముఖ్యంగా బాలురతో పోల్చి చూసుకుంటే, బాలికలపై పెను ప్రభావం చూపినట్లు వెల్లడైంది.

పేలిన ఐఫోన్ బ్యాటరీ



జ్యూరిచ్: ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ యాపిల్‌కు చెందిన ఐఫోన్ బ్యాటరీ పేలింది. ఈ ఘటన స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో ఓ యాపిల్ స్టోర్‌లో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో స్టోర్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి గాయాలపాలయ్యారు. బ్యాటరీ పేలడంతో తాత్కాలికంగా స్టోర్‌ను ఖాళీ చేయాల్సివచ్చింది. మంగళవారం స్టోర్‌లో ఐఫోన్ రిపేర్ చేస్తున్నప్పుడు బ్యాటరీ బాగా వేడెక్కి పేలుడు సంభవించిందని, అయితే పేలుడు ఎందుకు జరిగిందో తెలియరాలేదని జ్యూరిచ్ పోలీసులు ఓ నివేదికలో తెలిపారు. పేలుడు కారణంగా రిపేర్ వర్కర్ చెయ్యి కాలినట్లు పోలీసులు తెలిపారు. మరో ఏడుగురు వ్యక్తులకు ప్రాథమిక వైద్యసహాయం అందించామని, అయితే ఎవ్వరూ ఆస్పత్రిలో చేరలేదని వెల్లడించారు. పేలుడు సంభవించిన సమయంలో స్టోర్‌లో కస్టమర్లు, సిబ్బంది కలపి దాదాపు 50 మంది ఉండగా, వెంటనే స్టోర్‌ను ఖాళీ చేశారు. స్టోర్ సిబ్బంది తక్షణమే స్పందించి అప్రమత్తంగా వ్యవహరించారని పోలీసులు ఓ నివేదికలో తెలిపారు.


నగల దుకాణాలపై ఐటీ సోదాలు

జోయాలూకాస్‌పై కేసు నమోదు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 నగల దుకాణాలపై ఆదాయపు శాఖ సోదాలు జరిపి, వాటిలో రెండు ప్రముఖ దక్షిణ భారత నగల దుకాణాలపై పన్ను ఎగవేత కేసులు నమోదు చేశామని అధికార వర్గాలు తెలిపాయి. కేరళాకు చెందిన జోయాలూకాస్, మరొకదానిపై చర్యలు చేపడతామన్నారు. చెన్నై, హైదరాబాద్, త్రిస్సూర్, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర , ఢిల్లీ, వెస్ట్ బెంగాల్‌ల్లో 130 మంది ఆదాయపు పన్నుశాఖ అధికారులు దాడులు నిర్వహించారన్నారు. రెండు జ్యూవెలరీ సంస్థల్లో బంగారం, వజ్రాలు ఎక్కువ మొత్తంలో అమ్ముడు పోయిందని, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. చెన్నై శాఖ దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించడానికి సారధ్యం వహించిందని, 100 మంది ఆదాయపు శాఖ అధికారులు, పోలీసులు ఈ దాడులు కొనసాగించారని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

టెలికం సేవల చార్జీలు పెంపు?

10 శాతం మోత తప్పందంటున్న టైపా



న్యూఢిల్లీ: టెలికం సేవల చార్జీలు పెరగనున్నాయా.. అవుననే సంకేతాలని స్తున్నది టవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (టైపా). వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు 50, 000 మొబైల్ టవర్లను ఏర్పాటుచేసే వీలుందన్న టైపా.. ప్రభుత్వం నుంచి రాయితీలు లేకపోవడం, వివిధ పన్నుల అమలుతో ఒక్కో టవర్‌పై సుమారు రూ.1-1.5 లక్షల మేర పన్ను లను చెల్లించాల్సి వస్తుందని తెలిపింది. దీని ఫలితంగా టెలికం సేవల ధరలు కనీసం 10 శాతం పెరుగవచ్చని కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ బోర్డు చైర్ పర్సన్ వనజా ఎన్ సర్నాకు రాసిన లేఖలో టైపా డైరెక్టర్ జనరల్ తిలక్ రాజ్ దువా ముందస్తు సూచనలిచ్చారు. పెరిగే పన్నుల భారాన్ని కస్టమర్లపై మోప డం తప్ప టెలికం ఆపరేటర్లకు గత్యంతరం లేదన్నారు. దేశవ్యాప్తంగా 4.5 లక్షలకుపైగా టవర్ల ఏర్పాటుకు టెలికం సంస్థలు రూ.2.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని, ఏటా కార్పొరేట్ ఆదాయ పన్ను, సేవా పన్ను రూపంలో రూ.5,000 కోట్లకుపైగా ప్రభుత్వానికి చెల్లిస్తున్నామని ఈ సంద ర్భంగా చెప్పారు. కాగా, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో సవరణలతోపాటు కొన్ని టెలికామేతర మౌలిక సంస్థలకు కల్పిస్తున్న వివిధ పన్ను ప్రయోజ నాలను తమకూ అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని టైపా కోరుతున్నది. అలాగే ఆలస్యంగా చెల్లించే పన్నులపై తమ నుంచి వసూలు చేస్తున్న వడ్డీరేటునే.. ట్యాక్స్ రిఫండ్ ఆలస్యమైతే తమకు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నది. టైపాలో భారతీ ఇన్‌ఫ్రాటెల్‌తోపాటు ఇండస్ టవర్స్, ఏటీసీ తదితర సంస్థలు సభ్యులుగా ఉన్నాయి.

ఇంటర్నెట్ వేగం తక్కువే

కన్స్యూమర్ వాయిస్



న్యూఢిల్లీ: ఇంటర్నెట్ వేగం నాణ్యత ప్రమాణాలు తక్కువగానే ఉంటున్నాయని కన్స్యూమర్ వాయిస్ అనే ఒక స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. సర్వీసు ప్రొవైడర్లు ప్రకటించిన స్థాయిలో వినియోగదారులకు ఇంటర్నెట్ వేగం, సేవలు అందడం లేదని తెలిపింది. అంతర్జాతీయ ప్రమాణాల కన్నా చాల తక్కువ ప్రమాణాల్లోనే ప్రొవైడర్లు ఇంటర్నెట్ సేవలనందిస్తున్నారని తెలిపింది. 3జీ లేదా 4జీ వేగానికి మధ్య వ్యత్యాసాన్ని వినియోగదారు గుర్తించలేని విధంగా సేవలనందిస్తున్నారని సర్వీసు ప్రొవైడర్ల తీరును తప్పుపట్టింది. వినియోగదారులకు ఇంటర్నెట్ వేగం, సేవలను ప్రకటించిన విధంగా బట్వాడా చేసేందుకు వీలుగా సర్వీసు ప్రొవైడర్లను అజమాయిషీ చేసే ఒక వ్యవస్థను నెలకొల్పాలని సూచించింది. సర్వీసు ప్రొవైడర్లు, వినియోగదారులు సహా ఈమొత్తం వ్యవహారంలో భాగస్వాములైన అన్ని పక్షాల ప్రయోజనాలూ నెరవేరే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపింది. దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో విస్తరించిన నాలుగు టెలికాం సర్కిళ్ల పరిధిలో జరిపిన అధ్యయనం ఆధారంగా రూపొందించిన నివేదికలో కన్స్యూమర్ వాయిస్ ఈ వివరాలను పేర్కొంది. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం పని చేసే ఈసంస్థలో విద్యావంతులు, వివిధ వృత్తి నిపుణులు, స్వచ్ఛంద కార్యకర్తలు సభ్యులుగా ఉన్నారు.

కొత్త కొలువులు వచ్చేనా?

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈసారి బడ్జెట్‌లో ఉపాధి, ఉద్యోగావకాశాలు పెంపొందే దిశగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరకపోవడమే ఇందుకు కారణం. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఏటా కోటి ఉద్యోగాలను సృష్టిస్తామని ప్రజలకు మోదీ వాగ్దానం చేశారు. అయితే వివిధ రంగాల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆటోమేషన్ లాంటి ఆధునిక టెక్నాలజీల వినియోగం పెరుగుతుండటం తో మోదీకి ఈ హామీ అతిపెద్ద సవాల్‌గా తయారైనది.

ఏఐ, ఆటోమేషన్‌లు ఉన్న కొలువులకు ఎసరు పెడుతుండటంతో కొత్తగా ఉపాధి కల్పన దేవుడెరుగు ఉన్న ఉద్యోగాల్ని కాపాడుకోవడంలోనే సమయం గడిచిపోయింది. ఈ ఏడాది ఆఖర్లోనే ముందస్తు ఎన్నికలు జరుగవచ్చన్న సంకేతాల నడుమ ఈ ఫిబ్రవరి 1న ప్రకటించేదే పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో ఇందులోనే ఎన్నికల హామీ నెరవేరే నిర్ణయాలుండాలని మోదీ భావిస్తున్నారు. త్వరలో ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలూ ఉండటంతో ఈసారి బడ్జెట్.. ఉద్యోగార్థులను ఆకర్షించేలా ఉండాలన్నదే మోదీ ఆలోచన. లేదంటే ప్రతిపక్షాలకిది ఆయుధంగా మారవచ్చన్న ఆందోళన బీజేపీలో ఉన్నది. కార్మిక శాఖలోని లేబర్ బ్యూరో గణాంకాలూ అధికార పార్టీని భయపెడుతున్నాయి. దీంతో రాబోయే బడ్జెట్‌ను నిరుద్యోగుల ఆశాకిరణంగా తీర్చిదిద్దాలని మోదీ చూస్తున్నట్లు సమాచారం.

డిపాజిట్ చేస్తారా.. జైలుకెళ్తారా..?

జేపీ గ్రూప్‌కు సుప్రీంకోర్టు హెచ్చరికలు



ఢిల్లీ: నోయిడాకు చెందిన ప్రముఖ కన్‌స్ట్రక్షన్ సంస్థ జేపీ గ్రూప్‌ను సుప్రీంకోర్టు ఈ రోజు మరోసారి హెచ్చరించింది. డబ్బులు తీసుకుని ఇళ్లు అప్పగించలేదని ఈ సంస్థపై ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులకు రీఫండ్ చేసేందుకు రూ.2000కోట్లను రిజిస్ట్రీలో జమ చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందులో ఇప్పటి వరకు ఆ సంస్థ రూ.425కోట్లు మాత్రమే డిపాజిట్ చేసింది. మరో రూ.125కోట్లు జనవరి 25లోగా జమ చేయాలని డిసెంబరులో న్యాయస్థానం ఆదేశించింది. దీనిపై నేడు విచారణ జరగగా.. డిపాజిట్ విషయాన్ని కోర్టు గుర్తు చేసింది. నగదు జమ చేస్తారా లేదా తిహార్ జైలుకు వెళ్తారా? అంటూ హెచ్చరించింది. అంతేగాక.. ప్రస్తుతం ఆ సంస్థ చేపడుతున్న హౌసింగ్ ప్రాజెక్టుల వివరాలను న్యాయస్థానానికి సమర్పించాలని సూచించింది. దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారో వివరాలు అందజేయాలని స్పష్టం చేసింది. ఇప్పటికే జేపీ గ్రూప్ డైరెక్టర్లు తమ వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఆస్తులను విక్రయించకూడదంటూ గతంలో ఆదేశించిన విషయం తెలిసిందే. ఒకవేళ అలా చేస్తే వారి ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించింది.



గ్రూఫెర్స్ ... ఓ పెద్ద కిరాణా ఈ-టెయిలింగ్ కంపెనీ. గత ఏడాది పలు నగరాల్లో కార్యకలాపాలు నిలిపివేసింది.లోకల్ బన్యా ... కిరాణా ఈ-టెయింలింగ్ లో ఓ సంచలనం లాంటిది. కానీ ఇప్పటికే మూతపడింది. పెప్పర్ ట్యాప్.... నిత్యావసర వస్తువుల ఆన్ లైన్ మార్కెట్‌లో ట్రెండ్ సెట్టర్. కానీ ఈ గత సంవత్సరం వ్యాపారాన్ని మూసివేసింది. ఇది ప్రస్తుతం కిరణా ఈ-టెయిలింగ్ మార్కెట్ ప్రస్తుత పరిస్థితి. ఆన్ లైన్ వ్యాపారం క్రేజ్ తారస్థాయికి చేరినప్పుడు.. అన్నింటిలోలాగే నిత్యావస రసరుకుల కోసం కూడా పెద్ద ఎత్తున ఆన్‌లైన్ బజార్లు పుట్టుకొచ్చాయి. వినూత్నమైన పోకడలు, వింత మార్కెట్ పద్ధతులతో ఖర్చులు, ఆదాయంపై అవగాహన లేకుండా చాలా కంపెనీలు పరుగులు ప్రారంభించడంతో మొదటికే మోసం రావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఓ రకంగా ఇప్పుడు కిరణా ఈ-టెయిలింగ్ మార్కెట్లో కరెక్షన్ లాంటిది వస్తోంది. ముందస్తు వ్యూహం, ఆదాయమార్గాలు, ఖర్చుల నియంత్రణ లాంటివాటిపై స్పష్టమైన అవగాహనతో ప్రారంభిస్తే తప్ప నిలదొక్కుకోవడం కష్టంగా మారింది. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో కొత్తగా మార్కెట్లోకి అడుగు పెట్టాడు 22 ఏళ్ల షెరుంజ్ జలాన్. ఢిల్లీకి చెందిన ఈ కుర్రాడు పెద్ద పెద్ద సంస్థలు చేతులెత్తేసిన స్పేస్‌లో తనదైన ముద్ర వేసేందుకు ప్రయాణం ప్రారంభించాడు. ఇప్పటికే షెరుంజ్ ఆలోచనలు అతని ప్రయాణం సరైన దిశలోనే సాగుతోందని అనిపించేలా చేస్తున్నాయి.

ఆన్ లైన్ గ్రోసరీ మార్కెట్లో

పట్టుబిగిస్తున్న ఢిల్లీ స్టార్టప్



19 ఏళ్లకే ఎంట్రపెన్యూర్ ఆలోచనలు

ఢిల్లీకి చెందిన షెరుంజ్ మూడేళ్ల కిందటే సీఏ విద్యార్థిగా ఉన్నప్పుడే ఆన్ లైన్ గ్రోసరీ ఫ్లాట్ ఫామ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. తన ఆలోచనను తల్లిదండ్రులతో కూడా పంచుకున్నాడు. వాళ్లూ ప్రోత్సాహించారు. తన పాకెట్ మనీ రూ.30 వేలతో కొంత పని కూడా పూర్తి చేశాడు. తల్లిదండ్రుల వద్ద నుంచి మరికొంత సాయం పొందాడు. అయితే వ్యాపారం ప్రారంభించినా.. చదువు కూడా కొనసాగించాలని షెరుంజ్‌కు తల్లిదండ్రులు షరతు పెట్టారు.

పేరెంట్స్ ఆర్థిక సాయంతో అక్టోబర్ 2014లో బజార్ క్రాఫ్ట్ ఈ-టెయిలింగ్ ఫ్లాట్ ఫామ్‌ను ప్రారంభించాడు జలాన్. ఢిల్లీ, నోయిడా, ఫరీదాబాద్‌లలో మొదటగా కార్యకలాపాలు ప్రారంభించారు. అప్పట్లో ఈ-టెయిలింగ్ మార్కెట్లో ఉన్న పరిస్థితులతో జస్ట్ ఇన్ టైమ్ మోడల్‌ను వినియోగదారులను ఆఫర్ చేశాడు. ఆర్డర్ చేసిన తర్వాత గంటలోపే డెలివరీ ఇవ్వడం బజార్ క్రాఫ్ట్ ప్రత్యేకత. ఇందుకోసం కొన్ని కీలకమైన ప్రాంతాల్లో చిన్న చిన్న కిరాణా షాపు యజమానులతో ఒప్పందాలు చేసుకున్నాడు.

అయితే కొన్ని రోజులకే జలాన్‌కి అసలు కష్టం అంటే ఏమిటో తెలిసొచ్చింది. వ్యాపారాన్ని చురుగ్గా చేయాలంటే మరింత సిబ్బంది అవసరమని గుర్తించారు. కానీ అది చాలా ఖరీదైన వ్యవహారం. ఆర్డర్స్ డెలివరీ చేయడం కూడా తలనొప్పిగా మారిపోయింది. పైగా లాభాలను ఏ పద్ధతిలో సాధించాలో జలాన్ కు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

సమస్యలపై సమరం...

చిన్న వయసులోనే ఎంట్రప్రెన్యూర్ షిప్ ప్రారంభించినా ఒక్కసారిగా కష్టాలు చుట్టుముట్టినా జలాన్ వెనక్కి తగ్గలేదు. అసలు తన వ్యాపారం ఏమిటి..? తను ఎదుర్కొంటున్న సవాళ్లేమిటి..? వాటిని పరిష్కరించుకునే మార్గాలేమిటి..? అని ఒక్కొక్కటిగా లెక్క వేసుకుని.. పరిష్కరించుకోవడం ప్రారంభించాడు.

అందులో జలాన్‌కు కనిపించిన మొదటి సమస్య వర్క్ ఫోర్స్. ఉద్యోగులు లేనిదే ఏ పనీ చేయలేమని గుర్తించాడు. అందుకే వీలైనంత తక్కువ ఖర్చు అయ్యేలా అప్పుడే చదువు పూర్తి చేసుకున్నవారిని నియమించుకోవడం ప్రారంభించాడు. అది సత్ఫలితాలను ఇచ్చింది. తక్కువ వేతనాలకు ప్రతిభావంతమైన ఉద్యోగులు లభించారు. రెండో సమస్య డెలివరీ... దీన్ని అధిగమించేందుకు మొదటిగా ఆఫర్ చేసిన జస్ట్ ఇన్ టైమ్ మోడల్‌ను తీసేశాడు. ఇరవై నాలుగ్గంటల్లో డెలివరీ చేస్తామనే ప్రచారం ప్రారంభించారు.

ఇక తర్వాత తన బజార్ క్రాఫ్ట్‌లో కొత్త కొత్త అంశాలను చేర్చారు. పర్సనల్ కేర్, స్టేషనరీ కూడా అందుబాటులో ఉంచారు.

చివరిగా లాభాలను పెంచుకోవడానికి రీటైలర్లతో ఒప్పందాలను రద్దు చేసుకున్నాడు. నేరుగా ఉత్పత్తిదారుల నుంచి కొనుగోలు చేసి వినియోగదారులకు డెలివరీ చేయడం ప్రారంభించాడు.



దాంతో ఒక్కసారిగా చుట్టుముట్టిన సమస్యలు వరుసగా పరిష్కారం కావడం ప్రారంభమయ్యాయి. దాంతో జలాన్‌కు ఆత్మవిశ్వాసం రెట్టింపయింది.

"బజార్ క్రాఫ్ట్ లో 43 మంది టీం ఉంది. వీరి సగటు వయసు 23 మాత్రమే. డెలివరీ విధానాన్ని మార్చడంతో మరింత సేవింగ్స్ పెంచుకున్నాం. నేరుగా ఉత్పత్తిదారుల నుంచి కొనుగోలు చేయడం వల్ల కమిషన్ శాతం పెరిగింది. దీనివల్ల వినియోగదారులకు మేము డిస్కౌంట్స్ కూడా ఆఫర్ చేసి ఆకర్షించగలుగుతున్నాం" అని షెనుజ్ జలాన్ వివరించాడు.

విజయం దారిలో మొదటి అడుగులు

ఇప్పటికి బజార్ క్రాఫ్ట్ కు 45,000 మందికి పైగా యూనిక్ కస్టమర్లున్నారు. ఇందులో నలభై శాతం మంది తమ ఇంటికి అవసరాలకు పూర్తిగా బజార్ క్రాఫ్ట్ వేదికనే వాడుకుంటున్నారు. రోజుకు రెండు వందలకు పైగా ఆర్డర్లు ఏడాదికి ఒకటిన్నర కోట్ల రూపాయలకు పైగా టర్నోవర్ ప్రస్తుతం బజార్ క్రాఫ్ట్ నమోదు చేస్తోంది.

"మా సొంత డెలివరీ టీమ్.. తక్కువ వేతనాలు తీసుకునే ఉద్యోగులు, కొత్త డెలివరీ మోడల్‌తో వ్యయం బాగా తగ్గిపోయింది. మా ఆదాయంతో పోలిస్తే ఇప్పుడు నెలకు రెండు లక్షలు మాత్రమే ఎక్కువ ఖర్చు అవుతున్నాయి. అతి త్వరలోనే బ్రేక్ ఈవెన్ సాధించగలం" అని షెనుజ్ జలాన్ ధీమా వ్యక్తం చేశాడు.

వెబ్‌సైట్, యాప్ లను పూర్తిస్థాయిలో ఆధునీకరించడంతో పాటు ఈ-వాలెట్, పర్సనలైజ్డ్ ఆఫర్లు ఇచ్చే సౌకర్యాలను కూడా వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు పనులు ప్రారంభించారు. మెడిసిన్స్‌ను బజార్ క్రాఫ్ట్‌లో చేర్చనున్నారు. బజార్ క్రాఫ్ట్ పేరుతో ఆఫ్‌లైన్ స్టోర్లనూ ప్రారంభించే యోచనలో ఉన్నారు. అలా.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రంగాల్లో తనదైన ముద్రవేయాలని షెనుజ్ గట్టి పట్టుదలతో ఉన్నారు. వచ్చే రెండేళ్ల కాలంలో కనీసం పది మెట్రో, టైర్ టూ నగరాల్లో లో కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టున్నాడు షెనుజ్.

మార్కెట్ పెద్దదే.. కానీ ఒడిసి పట్టుకోవాలి

భారత ఆన్‌లైన్ గ్రోసరీ మార్కెట్ 2019 కల్లా 2.7 బిలియన్ల స్థాయిని అందుకుంటుందని అంచనా. గణాంకాలు ఎంతో ప్రొత్సాహకరంగా ఉన్నప్పటికీ ఈ రంగంలో ఉన్న కంపెనీలు ఆ స్థాయిలో పనితీరు చూపించడంలో మాత్రం విఫలమవుతున్నాయి. 2011 నుంచి గ్రూఫెర్స్, బిగ్ బాస్కెట్, జాప్ నౌ, పెప్పర్ ట్యాప్, లోకల్ బన్యా లాంటి సంస్థలు 400 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాయి. పెప్పర్ ట్యాప్, లోకల్ బన్యా భారీగా పెట్టుబడులను సాధించినప్పటికీ నిలబడలేకపోయాయి. కార్యకలాపాలు నిలిపివేశాయి.

అయితే ఈ రంగంలో బజార్ క్రాఫ్ట్ లాంటి చిన్న సంస్థలు తమదైన ప్రత్యేకత చూపిస్తున్నాయి. ఇవి 2.7 బిలియన్ల ఆన్ లైన్ గ్రోసరీ మార్కెట్ లో బిగ్ ప్లేయర్స్ గా మారినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. షెనుజ్ లాంటి యువ వ్యాపారవేత్తల ఆలోచనలు ఈ దిశగానే సాగుతున్నాయి.



'లక్కీఫెలో' సినిమా

'లవ్‌లీ' కంటే పెద్ద హిట్ అవుతుంది



డైరెక్టర్ జయ బి.

జర్నలిస్ట్‌గా కెరీర్‌ను ప్రారంభించి రచయిత్రిగా, 'సూపర్‌హిట్' పత్రిక జనరల్ మేనేజర్‌గా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న జయ బి, సినిమాల మీద మక్కువతో 'చంటిగాడు' చిత్రంతో దర్శకురాలిగా మారి 'గుండమ్మగారి మనవడు', 'లవ్‌లీ' 'వైశాఖం' లాంటి ఫీల్‌గుడ్ మూవీస్‌ని ప్రేక్షకులకందించి దర్శకురాలిగా తనకంటూ ఓ స్పెషల్ ఇమేజ్‌ని తెచ్చుకున్నారు డైనమిక్ లేడీ డైరెక్టర్ జయ బి. 'వైశాఖం' చిత్రంతో ప్రేక్షకుల ప్రశంసలతో పాటు సిల్వర్ క్రౌన్ అవార్డ్ పొందిన జయ బి. పుట్టినరోజు జనవరి 11. ఈ సందర్భంగా జనవరి 10న హైదరాబాద్ దసపల్లా హెటల్‌లో ప్రెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు.

'లక్కీఫెలో' జూన్‌లో ప్రారంభం!!

డైరెక్టర్ జయ బి. మాట్లాడుతూ - "వైశాఖం' చిత్రం పూర్తిగా నాకు సంతృప్తిని కలిగించింది. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద హిట్ చేశారు. చాలామంది 'సినిమా చాలా బాగుంది.. మంచి సినిమా తీశారు' అని అప్రిషియేట్ చేశారు. నెక్స్ట్ మా ఆర్.జె. సినిమాస్ బేనర్‌లో 'లక్కీఫెలో' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. జూన్‌లో సినిమా స్టార్ట్ చేసి మూడు నాలుగు నెలల్లో షూటింగ్ కంప్లీట్ చేస్తాం. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఓ యంగ్ హీరో ఈ చిత్రంలో నటిస్తున్నారు. ఆ హీరో ఎవరనేది త్వరలోనే ఎనౌన్స్ చేస్తాం. జనరల్‌గా కొంతమందికి అన్‌ఎక్స్‌పెక్టెడ్‌గా, విచిత్రంగా ఒక ఛాన్స్ వస్తుంది. అది రాగానే అందరూ వాడు 'లక్కీఫెలో'రా అని చెప్తారు. అతను ఆ ఛాన్స్ కోసం ట్రై చేయకపోయినా గొప్ప ఛాన్స్ వస్తుంది. అది చాలా రేర్‌గా జరుగుతుంది. అది హీరో క్యారెక్టరైజేషన్. ఆ ఛాన్స్‌ని హీరో ఎలా తీసుకుంటాడు? మిస్ యూజ్ చేసుకుంటాడా? ఇంకా హైట్స్‌కి వెళ్తాడా? అనేది కాన్సెప్ట్. హ్యూమన్ సైకాలజీని బేస్ చేసుకుని సబ్జెక్ట్ రెడీ చేస్తున్నాం.

హీరోయిన్ క్యారెక్టర్ చాలా స్ట్రాంగ్!!

అలాగే హీరోతో పాటు హీరోయిన్‌ది చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్ వుంటుంది. మన సమాజంలో ఆడవాళ్లకి చిన్న చిన్న ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అవి మానసికంగా చాలా అల్లకల్లోలం చేస్తుంటాయి. ఆ పాయింట్ ఇంతవరకూ ఎవరూ టచ్ చేయలేదు. జనరల్‌గా టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివే అమ్మాయిలు బస్సుల్లో ప్రయాణించేటప్పుడు మగవాళ్ళు కావాలని కొంతమంది, అనుకోకుండా కొంతమంది అమ్మాయిల్ని టచ్ చేస్తారు. ఆ టైమ్‌లో అమ్మాయిలు చాలా ఎలర్జీకి గురవుతారు. ఆ టచ్ వాళ్లని చాలాకాలం వెంటాడుతుంది. ఇలాంటి కొన్ని సెన్సిటివ్ అంశాలని హీరోయిన్ డీల్ చేస్తుంది. పాటలకి, రొమాన్స్‌కే కాకుండా హీరోయిన్ క్యారెక్టర్‌కి ఓ పర్పస్ వుండాలని ట్రై చేస్తున్నాం. ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ వుంటూనే అండర్ కరెంట్‌లో కొంత మెస్సేజ్ వుంటుంది. నా ఫస్ట్ సినిమా 'చంటిగాడు' నుండి 'వైశాఖం' వరకు ఎంటర్‌టైన్‌మెంట్‌ని మిస్ కాలేదు. బేసిగ్గా నేను ఎంటర్‌టైన్‌మెంట్ అంటే బాగా ఇష్టపడ్తాను. అలాగే ఎంటర్‌టైన్‌మెంట్‌తోనే సినిమాలు తీస్తాను.

ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చెయ్యాలి!!

'వైశాఖం' మేము ఎంత ఎక్స్‌పెక్ట్ చేశామో అంత కమర్షియల్‌గా సక్సెస్ అయ్యింది. మా పరిధి మేరకు ఆ చిత్రం మాకు చాలా హ్యాపీ. ఎక్కడికెళ్ళినా అప్రిషియేట్ చేస్తున్నారు. సిల్వర్ క్రౌన్ అవార్డు వచ్చింది. 'లవ్‌లీ' సినిమాకి కమర్షియల్‌గా సక్సెస్‌తో పాటు మంచి అప్రిషియేషన్స్ లభించాయి. 'లక్కీఫెలో' సినిమా 'లవ్‌లీ' కంటే చాలా పెద్ద హిట్ అవుతుంది. కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఈ చిత్రంలో వున్నాయి. టైటిల్ చాలా బాగుందని చాలామంది అంటున్నారు. వైవిధ్యభరితమైన మంచి సినిమాలు ఇంకా ఎన్నో తీసి ప్రేక్షకులను మెస్మరైజ్ చెయ్యాలని వుంది. అలాగే జయ మార్క్ ఫిలిం చెయ్యాలని వుంది. దాని తర్వాత జనంలోకి వెళ్ళి జనంతో మమేకమై సేవ చెయ్యాలని వుంది.

మహిళా దర్శకుల సంఖ్య పెరగాలి!!

విజయవాడ లబ్బీపేట 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఆఫీస్ వున్నప్పుడు లేడీ జర్నలిస్ట్ నేను ఒక్కదాన్నే వుండేదాన్ని. ఈనాడు రామోజీ జర్నలిజం స్కూల్‌కి ప్రొఫెసర్‌గా విజిటింగ్‌కి వెళ్లినప్పుడు అక్కడ చాలామంది అమ్మాయిలు నన్ను చూసి ఇన్‌స్పైర్ అయ్యారు. ఇవాళ ఎంతోమంది మహిళా జర్నలిస్ట్‌లు వున్నారు. అలాగే ఇండస్ట్రీలో కూడా మహిళా దర్శకులు ఇద్దరు, ముగ్గురే వున్నారు. ఇంకా ఎంతోమంది ఇన్‌స్పైర్ అయి మంచి సినిమాలు తీయాలి. మహిళా దర్శకుల సంఖ్య మరింత పెరగాలి. వారందరికీ నా స్వాగతం. వెబ్‌సిరీస్ చేసే ఆలోచన లేదు. నా ఫోకస్ అంతా సినిమాలమీదే. సినిమాకి వున్నంత క్రేజ్ వెబ్ సిరీస్‌కి వుండదు. ఇప్పటికీ మా 'చంటిగాడు', 'లవ్‌లీ', 'వైశాఖం' చిత్రాల గురించి మాట్లాడుకుంటారు అంటే సినిమాకి వున్న పవర్ అది" అన్నారు.

'జై సింహా' నుండి మరో పవర్ ఫుల్ పంచ్ డైలాగ్

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా, కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జై సింహా'. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకి సంబంధించి ఇప్పటి వరకు టీజర్, ట్రైలర్, ప్రీ రిలీజ్ ట్రైలర్ వంటి వాటిని విడుదల చేశారు. వీటిలో బాలయ్య చెప్పిన ఒక్కొక్క డైలాగ్‌కి ఈలలు పడుతుంటే.. తాజాగా బయటకు వచ్చిన ఈ సినిమాలోని ఓ పవర్ ఫుల్ డైలాగ్ మాత్రం నందమూరి అభిమానుల హుషారును మరింత పెంచేసింది. ఈ సంక్రాంతికి కూడా మాదే విజయం అంటూ చెప్పకనే చెబుతున్న ఈ డైలాగ్ పై ఓ లుక్కేద్దామా..

"నువ్వెంత బెదిరిస్తే..
నేనంత ఎదురొస్తా!!
బొమ్మ తిరగేస్తా!!"

అంటూ బాలయ్య చెప్పబోయే ఈ డైలాగ్ తో ఇక థియేటర్లు మారుమోగుతుంటే.. అభిమానులు ఊగిపోవడం ఖాయం.







రూ.300 కోట్లతో విక్రమ్ భారీ సినిమా!

ఇప్పటికే ఎన్నో భారీ సినిమాల్లో నటించిన చియాన్ విక్రమ్ మరో భారీ సినిమాకు శ్రీకారం చుట్టారు. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న విక్రమ్ ఆ తర్వాత భారీ ప్రయత్నానికి సిద్ధపడుతున్నారు. మహాభారతం సినిమాలోని కర్ణుడి పాత్ర నేపథ్యంలో ఓ సినిమాలో విక్రమ్ నటిస్తున్నారు. మహావీర్ కర్ణ పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమాకు విమల్ దర్శకత్వం వహిస్తున్నారు. దాదాపు 300 కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతోంది. అక్టోబర్‌లో ప్రారంభం కానున్న ఈ సినిమా వచ్చే ఏడాది డిసెంబర్‌లో విడుదల కానుంది. హిందీతోపాటు తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదలకాబోతోంది. ఈ సినిమా దాదాపు రెండు వేల కోట్ల రూపాయల బిజినెస్ చేయబోతోందని దర్శకుడు ఆశాభా వం వ్యక్తం చేశాడు.

ఇది నా లవ్‌స్టోరీ ట్రైలర్ విడుదల



రామ్ ఎంటర్‌టైనర్స్ పతాకంపై తరుణ్, ఓవియా హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం 'ఇది నా లవ్‌స్టోరీ'. రమేష్ గోపీ దర్శకులు. ఎస్.వి.ప్రకాష్ నిర్మాత. హీరో తరుణ్ పుట్టినరోజు సందర్భంగా హీరో తరుణ్ ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా

చిత్ర నిర్మాత ఎస్.వి.ప్రకాష్ మాట్లాడుతూ - "హీరో తరుణ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు. సినిమా కోసం వర్క్ చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణుల కారణంగా సినిమా చాలా బాగా వచ్చింది. ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేస్తున్నాం" అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ శ్రీనాథ్ విజయ్ మాట్లాడుతూ - "తెలుగులో నా తొలి చిత్రమిది. సినిమాకు మంచి సంగీతం, రీరికార్డింగ్ కుదిరింది. మంచి సినిమాకు పనిచేసే అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు థాంక్స్" అన్నారు.

డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ - "తరుణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన చేతుల మీదుగా ట్రైలర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఫిబ్రవరి 14న విడుదలయ్యే ఈ సినిమా మనసున్న మనుషులందరికీ తప్పకుండా నచ్చుతుంది. తరుణ్ గత హిట్ చిత్రాలు 'నువ్వే కావాలి', 'నువ్వే నువ్వే' కంటే ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది. తెలుగు సినిమాల్లో ఇదొక డిఫరెంట్ లవ్‌స్టోరీ. సినిమాపై పూర్తి నమ్మకంతో ఉన్నాం. లవర్స్‌కు మంచి ట్రీట్ అవుతుందని గర్వంగా చెప్పగలను" అన్నారు.

దర్శకుడు గోపి మాట్లాడుతూ - "నాగార్జునగారు విడుదల చేసిన టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు టీజర్‌కి కూడా అలాంటి రెస్పాన్సే వస్తుందని భావిస్తున్నాను. అంజలి, నువ్వేకావాలి కంటే ఈ సినిమా తరుణ్‌కి పెద్ద హిట్‌గా నిలుస్తుంది. సినిమాను చూసే ప్రేక్షకుడు ఇది నా లవ్‌స్టోరీ అని తప్పకుండా ఫీల్ అవుతాడు" అన్నారు.

హీరో తరుణ్ మాట్లాడుతూ - "నాపుట్టినరోజు సందర్భంగా ట్రైలర్ విడుదల కావడం చాలా సంతోషంగా ఉంది. నాగార్జునగారు టీజర్‌ను విడుదల చేసి మమ్మల్ని ఆశీర్వదించారు. టీజర్ పెద్ద హిట్ అయ్యింది. ఇప్పుడు ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తుంది. రెగ్యులర్ ప్రేమకథ కాదు. ఇందులో మూడు గెటప్స్‌లో నేను కనపడతాను. మరి ఇందులో ట్రిపుల్ రోల్ చేశానా? లేదా మూడు షేడ్స్ ఉన్న పాత్ర చేశానా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. డైలాగ్స్, స్క్రీన్‌ప్లే, సినిమాటోగ్రఫీ, మంచి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇలా అన్ని చక్కగా అమరాయి. హీరోయిన్ ఓవియా చాలా చక్కగా నటించింది. ఈ సినిమాలో ఎక్కువ పాత్రలు కూడా కనపడవు. గోగినేని బాలకృష్ణగారు ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. అలాగే ట్రెండీ మూవీస్ సంస్థ సినిమాను యు.ఎస్‌లో విడుదల చేస్తుంది" అన్నారు.

అనంతరం తరుణ్ పుట్టినరోజును కేక్ కటింగ్‌తో చిత్రయూనిట్ సెలబ్రేట్ చేసింది.

తరుణ్, ఓవియా, ఖయ్యూమ్, చిట్టిబాబు, జగదీష్, అనిల్ తదితరులు నటించిన ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, రమేష్ గోపి, రామాంజనేయులు, రవికిరణ్, ఆర్ట్: జె.కె.మూర్తి, ఎడిటర్: శంకర్, సినిమాటోగ్రఫీ: క్రిస్టోఫర్ జోసెఫ్, మ్యూజిక్: శ్రీనాథ్ విజయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: జగదీశ్.ఎస్, అరుణ్ అజాద్, కో ప్రొడ్యూసర్: ఎ.గణేశ్, నిర్మాత: ఎస్.వి.ప్రకాష్, దర్శకత్వం: రమేష్ - గోపి.



చట్టాలు చేసే హక్కు 'సుప్రీం'కు లేదు : లాబోర్డు

ఔరంగాబాద్ : ట్రిపుల్ తలాక్ అంశాన్ని సుప్రీంకోర్టులో వేయడాన్ని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) ప్రశ్నించింది. ఇందుకు సంబంధించి 'చట్టం' చేయడానికి అత్యున్నత న్యాయస్థానానికి ఎటువంటి హక్కులేదని పేర్కొన్నది. చట్టపరిధిలో నిర్ణయాలు తీసుకోవడమే సుప్రీంకోర్టు పని, అంతేకాని చట్టాలు చేయడం కాదు అని బోర్డు సభ్యులు మౌలానా అతఉర్ రెహమాన్ రష్దీ అన్నారు. "ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే కోర్టు పాత్ర ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు. షరియత్ చట్టాలలో అత్యున్నత న్యాయస్థానం, ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరైంది కాదు" అని చెప్పారు. ఇదిలావుండగా, ఇన్‌స్టంట్ డైవోర్స్, ట్రిపుల్ తలాక్‌ను నేరంగా చూడాలని ముస్లిం ఉమెన్ (పెళ్లిపై హక్కుల రక్షణ) బిల్లు, 2017 కోరుతోంది. అనేక ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించినప్పటికీ లోక్‌సభ బిల్లును ఆమోదించింది.

ఎమ్మెల్యేల జీతాలు రెట్టింపు బిల్లు

రైతురుణాలు,మద్దతుధర ఊసెత్తని ప్రభుత్వం

చెన్నై : తమిళనాడు ప్రభుత్వం ఎమ్మెల్యేల జీత,భత్యాలను రెట్టింపు చేస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టింది. జీతాలు పెంచాలని ఆరాష్ట్ర రోడ్డు రవాణా ఉద్యోగులు ఒకపక్కన సమ్మెచేపట్టగా, రుణాలు మాఫీ చేయాలని, ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలని రైతులు ఢిల్లీలో ఆందోళనలు జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పళనీస్వామి జీతాలను రెట్టింపు చేసే బిల్లును సభలో ప్రవేశపెట్టడం వివాదాస్పదంగా మారుతోంది. ప్రస్తుతం ఎమ్మెల్యేలకు రూ. 55 వేల జీతం అందుతుండగా, దానిని రూ. 1.05 లక్షలకు పెంచబోతున్నారు. దీంతో వారి జీతాల్లో 100 శాతం పెంపుదల నమోదు చేసుకుంది. ముఖ్యమంత్రి, మంత్రులు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రతిపక్ష నాయకుడుడు, ప్రభుత్వ చీఫ్ విప్ అలవెన్స్‌లను జులై 1 నుంచి పెంచగా, గతేడాది ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేల జీతాలను పెంచాలనుకుంటోంది. శాసన సభ్యుడి అభివృద్ధి నిధులను రూ. 2 కోట్ల నుంచి 2.5 కోట్ల వరకు పెంచారు. లెజిస్లేటివ్ కౌన్సిల్, మాజీ ఎమ్మెల్యేల పింఛన్‌ను రూ. 12 వేల నుంచి 20 వేలకు పెంచారు. కాంపెన్సేటరీ అలవెన్స్‌ను రూ 7,000 నుంచి రూ. 10 వేలకు, ఫోన్ అలవెన్స్‌లను రూ. 5000 నుంచి 10 వేలకు పెంచారు.



జూన్ 28నుంచి అమర్‌నాథ్ యాత్ర

జమ్ము: ప్రఖ్యాత అమర్‌నాథ్ యాత్ర ఈ ఏడాది 60 రోజులపాటు కొనసాగనుంది. జ్యేష్ఠ పూర్ణిమనాడు (జూన్ 28న) దీన్ని ప్రారంభించనున్నట్లు దేవస్థాన బోర్డు అధికార ప్రతినిధి మంగళవారం తెలిపారు. బోర్డు సభ్యులతో సమావేశమైన అనంతరం బోర్డు ఛైర్మన్, రాష్ట్ర గవర్నర్ ఎన్ఎన్ వోరా తేదీలను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు దక్షిణ కశ్మీర్ హిమాలయాల్లోని ఈ దేవాలయ పరిసరాల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై ఇటీవల జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన ఆదేశాలపైనా చర్చించామని, వీటిపై సమీక్షా పిటిషన్ దాఖలు చేస్తామని వివరించారు. దేవాలయ పరిసరాల్లో అందరూ నిశ్శబ్దం పాటించాలని ట్రిబ్యునల్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై నిరసనలు వ్యక్తం కావడంతో.. గుహలో మంత్ర ఉచ్చారణలు, భజనలపై తాము ఎలాంటి నిబంధనలూ విధించడంలేదని ఎన్‌జీటీ స్పష్టతనిచ్చింది. మంచు లింగం ముందుకు వెళ్లినప్పుడు మాత్రం అందరూ నిశ్శబ్దంగానే ఉండాలని స్పష్టీకరించింది.

రూ.13 వేల కోట్లు?

పంటల బీమా కోసం బడ్జెట్ కేటాయింపు

న్యూఢిల్లీ : పంటల బీమా పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచే ఆలోచన చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.10,701 కోట్లు కేటాయించిన కేంద్రం...2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.13 వేల కోట్లకు పెంచనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ పథకానికి నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై) అని పేరు పెట్టిన విషయం విదితమే. 2018-19 కేంద్ర బడ్జెట్‌ను ప్రభుత్వం ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నది. 2016లో ప్రారంభించిన పంటల బీమా పథకం పీఎంఎఫ్‌బీవై కింద రైతులు నామమాత్రపు ప్రీమియం చెల్లిస్తారు. పంట నష్టపోతే భారీగా పరిహారం పొందుతారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పీఎంఎఫ్‌బీవై కోసం బడ్జెట్ కేటాయింపులు పదిశాతం అంటే రూ.13 వేల కోట్లకు పెంచుతారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ పథకానికి రూ.11 వేల కోట్లు కేటాయించాలని వ్యవసాయ మంత్రిత్వశాఖ డిమాండు చేసిందని, అయితే, ఈ పథకం ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని ఆర్థికమంత్రిత్వశాఖ అధిక కేటాయిం పులు చేయవచ్చని భావిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎంఎఫ్‌బీవై కోసం ప్రభుత్వం ప్రాథమికంగా రూ.9,000.75 కోట్లు కేటాయించింది. అయితే, ఆ తర్వాత అదనపు పద్దుల కింద రూ.1701 కోట్లను కేటాయించింది. దీంతో మొత్తం



కేటాయింపులు రూ.10,701 కోట్లకు పెరిగింది. 2016-17 పంటకాలం (జూలై-జూన్)లో మొత్తం పంటల బీమా క్లెయిమ్ అంచనా రూ.15,500 కోట్లు. ఇప్పటికే రూ.13, 661 కోట్లు క్లెయిమ్‌లు వచ్చినట్లు తెలిసింది. ఇందులో రూ.12,313 కోట్ల క్లెయిమ్‌లు పరిష్కారమయ్యాయని అధికారిక డేటా తెలిపింది. పీఎంఎఫ్‌బీవై కింద ఆహారధాన్యాలు, చమురు గింజల పంటల కోసం రైతులు అతి తక్కువగా 1.5 నుంచి 2 శాతం మధ్య ప్రీమియం చెల్లిస్తారు. ఉద్యానవనాలు, పత్తి పంటలకు సంబంధించి అత్యధికంగా ఐదు శాతం ప్రీమియం చెల్లిస్తారు.

హేతువాది కల్బుర్గి హత్యపై సిట్ దర్యాప్తు

- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు
- మహారాష్ట్ర, కర్ణాటకలకు నోటీసులు జారీ



న్యూఢిల్లీ : 2015లో తన భర్త హత్య ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా దర్యాప్తు జరిపించాలని కోరుతూ రచయిత, హేతువాది ఎం.ఎం.కల్బుర్గి సతీమణి ఉమాదేవి బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ హత్య కేసులో గణనీయమైన దర్యాప్తు జరగలేదన్న కల్బుర్గి సతీమణి ఆరోపణలపై ఆరు వారాల్లోపు మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు, ఎన్ఐఏ, సీబీఐ దర్యాప్తు సంస్థలు స్పందించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం కోరింది. హత్యకు గురైన రచయిత భార్య ఉమాదేవి కల్బుర్గి దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎ.ఎం.ఖన్‌విల్కర్, డి.వై.చంద్రచూడ్ లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణకు స్వీకరించింది. రెండు రాష్ట్ర ప్రభుత్వా లకు, ఎన్ఐఏ, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. 2013 ఆగస్టు, 2015 ఫిబ్రవరిలలో హత్యకు గురైన మేథో కార్యకర్తలు నరేంద్ర అచ్యుత్ దబోల్కర్, గోవింద్‌రావ్ పన్సరేలు, తన భర్త హత్యకు మధ్య ఒక ఉమ్మడి సంబంధం ఉందని కల్బుర్గి సతీమణి ఉమా న్యాయవాది కృష్ణకుమార్ ద్వారా దాఖలు చేసిన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దబోల్కర్ 2013, ఆగస్టు 20న పూనేలో దుండగులు జరిపిన కాల్పుల్లో హత్యకు గురికాగా, పన్సరే 2015. ఫిబ్రవరి 16న మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో హత్యకు గురయ్యారు. దబోల్కర్, పన్సరే హత్య కేసుల్లో విచారణలాగే, ఈ కేసులోనూ నిందితులను పట్టుకోవడంలో ఎటు వంటి పురోగతి లేదని కల్బుర్గి సతీమణి తన పిల్‌లో పేర్కొన్నారు. మూడు వేర్వేరు నేర స్థలాల నుంచి స్వాధీనం చేసుకున్న తూటాల ఫోరెన్సిక్ విశ్లేషణ ప్రకారం ఈ మూడు హత్యలకు సంబంధం ఉందని 2016లో అప్పటి కర్ణాటక హోం మంత్రి ఒక ప్రకటనలో చెప్పారని పిటిషన్‌లో ఆమె వివరించారు. పన్సరే హత్యలో వినియోగించిన ఆయుధాల్లో ఒక దానినే కల్బుర్గి హత్యకు వినియో గించారని పిటిషన్ ఆరో పించింది. అందువల్ల సీబీఐ, ఎన్ఐఏతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక పోలీ సుల మధ్య సమన్వయం అవసరమని పేర్కొంది. 'ముగ్గురి హత్యకు గల సంబంధాలపై సాక్ష్యాలను గుర్తించినట్లు కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది. అలాగే 'కల్బుర్గి హత్యకు గురైన నాలుగు రోజుల తర్వాత అనుమానితులు చిత్రాలు విడుదల చేసినప్పటికీ, ఈ రోజు వరకు దర్యాప్తులో ఎటువంటి పురోగతి లేదని పిటిషన్ తెలిపింది.

జల్లికట్టుకు ఏడబ్ల్యూబీఐ మార్గదర్శకాలు

చెన్నై : తమిళనాడులో జల్లికట్టు సీజన్ ప్రారంభమైంది. ఈ క్రీడను పర్యవేక్షించేందుకు భారత పశుసంవర్థక బోర్డు (ఏడబ్ల్యూబీఐ) ఆరుగురు సభ్యులతో కమిటీని నియమించింది. జల్లికట్టు క్రీడను కొనసాగించవచ్చునని ఈ కమిటీ పేర్కొంటూ అందుకు 20 సవరించిన మార్గదర్శకాలను జారీచేసింది. క్రీడలో పాల్గొనేందుకు అవి ఫిట్ అని ప్రకటించడానికి ముందు జంతువులకు నికోటిన్, కొకైన్ పరీక్షలు నిర్వహించాలని ఏడబ్ల్యూబీఐ ఈ ఏడాది సవరించిన మార్గదర్శకాలలో ఒకటిగా ఉన్నది. "పోటీలో పాల్గొనే జంతువును ఎంపిక చేసేందుకు నాటికన్ టెస్టు, కొకైన్ టెస్టు నిర్వహించాలి. ఆ టెస్టులు నిర్వహించిన తరువాతనే పశువులు క్రీడలో పాల్గొనవచ్చునని అధికారులు సర్టిఫికెట్లు జారీచేయాలి" అని ఏడబ్ల్యూబీఐ జారీచేసిన మార్గదర్శకాలు పేర్కొన్నాయి. "ఈ క్రీడను వీడియోగ్రాఫ్ తీయాలి, మూడేళ్లలోపు, 15 ఏళ్ల వయస్సు పైబడిన పశువులను క్రీడలో పాల్గొనేందుకు అనర్హులు" అని కూడా మార్గదర్శకాలు పేర్కొన్నాయి. జల్లికట్టును సాధారణంగా సంక్రాంతి సందర్భంగా జనవరి మధ్యలో నిర్వహిస్తారు. ఈ క్రీడపై నిషేధం విధించడంతో గత మూడు సంవత్స రాలుగా నిర్వహించడం లేదు. జల్లికట్టుపై విధించిన నిషేధం ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనవెల్లువెత్తింది. క్రీడను నిర్వహిం చేందుకు మార్గం సుగమం చేస్తూ 2017 జనవరి 23వ తేదీన రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా సవరణ బిల్లును ఆమోదించింది.

జాతి నిర్మాణానికి రైల్వేలు సాధనం

రాష్ట్రపతి కోవింద్



న్యూఢిల్లీ : జాతి నిర్మాణం, జాతీయ సేవకు భారతీయ రైల్వేలు ఒక సంస్థ అని రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ప్రశంసించారు. రైల్వేలలోని వివిధ విభాగాలకు చెందిన ప్రొబిషనరీ అధికారుల గ్రూప్‌నుద్దేశించి బుధవారం కోవింద్ మాట్లాడారు. దేశ సంస్కృతి, వారసత్వం, సంప్రదాయాలు కొనసాగించడానికి, వ్యాప్తిచేయడానికి రైల్ నెట్‌వర్క్ దోహదపడుతున్నదని రాష్ట్రపతిని ఉటంకిస్తూ రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ప్రకటన తెలిపింది. 2015-16 ఒక్క సంవత్సరంలోనే భారతీయ రైల్వేలు 8బిలియన్లకుపైగా ప్రయాణీకులకు సేవలు అందించిందని తెలిపారు. పారిశ్రామిక, వ్యవసాయ సరుకులను రైల్వేలు రవాణా చేస్తాయని, రక్షణ పరికరాలను, సైనిక సిబ్బందిని తీసుకువెళతాయని కోవింద్ చెప్పారు. "అంతేకాకుండా, పండగలు, ప్రత్యేక సందర్భాలు, కుంభమేళాలు వంటి సమయాలలో ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడుపుతోంది" అని అన్నారు. నగరాలలో ప్రజా సత్వర రవాణాగా రైల్వేలు అవతరిస్తున్నాయని కోవింద్ ప్రశంసించారు. "త్వరితగతిన, భద్రత కలిగిన పట్టణ అనుసంధానాన్ని అందుబాటులో ఉంచేందుకు అనేక నగరాలు మెట్రో ప్రాజెక్టు పద్ధతిని అనుసరిస్తున్నారు" అని రాష్ట్రపతి తెలిపారు.

నగరాల మధ్య అంతరాయా లను తగ్గించేందుకు, కార్బన్ పాదముద్రలను తగ్గించేందుకు ఇది సహాయ పడుతుందని చెప్పారు. రైల్వేలలో చేరే ప్రొబిషనరీ అధికారులకు దేశానికి సేవచేసే, రోజుకు పదుల లక్షల సంఖ్యలో ప్రయాణీకులకు సేవలు అందించే అరుదైన అవకాశం లభిస్తుందని అన్నారు. జీవితంపై ఆశను, సానుకూల దృక్పథాన్ని పెంపొం దించాలని ప్రొబిషనరీ అధికారులకు కోవింద్ సూచిం చారు. "ఈ విధంగా చేయడం వల్ల పని ప్రదేశం అదే విధంగా సమాజంలో మీరు అర్థవంతమైన మార్పులను అనుమతించ గలుగుతారు" అని అన్నారు.

లింగవివక్షపై గళమెత్తేలా శిక్షణ

అన్ని రాష్ట్రాలకు హెచ్‌ఆర్‌డీ లేఖ

న్యూఢిల్లీ : స్కూళ్లలో లింగవివక్ష, వేధింపులు, హింసను అరికట్టేందుకు హెచ్‌ఆర్‌డీ శాఖ చర్యలు చేపట్టింది. విద్యాలయాల్లో పిల్లలకు సురక్షితమైన వాతా వరణంతో పాటు సమాన విద్యను అందించే ఉద్దేశంతో అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. స్కూళ్లలో తమపై లైంగిక దాడులను ఏ విధంగా ప్రతిఘటించడం, ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది విద్యార్థులకు అవగాహన కల్పించాలని, ఈ మేరకు వారికి శిక్షణ ఇవ్వాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది. లైంగిక దాడులు, హింస, లింగ వివక్షకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రతిఘటన చర్యలను వివరిస్తూ యునెస్కో రూపొందించిన పోస్టర్లను షేర్ చేసింది. విద్యార్థులు తమపై దాడులను సమర్థవంతంగా ప్రతిఘటించడంతో పాటు వాటిపై గళమెత్తేలా వారిని తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైతే పూర్తిగా సహకరిస్తామని రాష్ట్రాలకు హెచ్‌ఆర్‌డీ స్పష్టంచేసింది. స్కూల్ రిలేటెడ్‌జెండర్ బేస్ట్ వైలెన్స్ (ఎస్ఆర్‌జీబీవీ) ప్రభావం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబాలు, సంఘాలపైనా ఉంటుందని పేర్కొంది. పురుషాధిక్య సమాజమే ఇలాంటి

Government of India
Ministry of Human Resource Development

దాడులకు దారితీస్తోందని అభిప్రాయపడింది. 'లెర్నింగ్ వితవుట్ ఫియర్' పేరిట రూపొందించిన పోస్టర్లలో స్కూళ్లలో చోటుచేసుకునే వివక్ష, దాడుల సన్నివేశాలను, తీసుకోవాల్సిన చర్యలను చిత్రీకరించారు. వివక్షకు గురయ్యే విద్యార్థులు చదువులో రాణించలేరని తెలిపింది. పిల్లలకు స్కూళ్లలో భద్రత, సమాన విద్యావాతావరణం కల్పించేందుకు ఇలాంటి హింసలను అరికట్టడం అత్యంత కీలకమని లేఖలో స్పష్టంచేసింది. శిక్షణకు అవసరమైన సామాగ్రి, పోస్టర్లు, ప్రాంతీయ భాషలోకి అనువాదించడం వంటివాటిలో పూర్తిగా సహకరిస్తామని అన్ని రాష్ట్రాలకు హామీనిచ్చింది.

1984 ఘర్షణలు : 186 కేసుల్లో సుప్రీం పున:విచారణ

న్యూఢిల్లీ : 1984 ఘర్షణలకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మూసివేసిన 186 కేసులను సుప్రీంకోర్టు తిరిగి తెరిపించ నుంది. ఈ కేసుల పున: విచారణ కోసం హైకోర్టు మాజీ జడ్జి నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. సిట్ బృందాన్ని ఏర్పాటు చేయడం కోసం అర్హులైన సభ్యుల పేర్లను ప్రతిపాదించాల్సిందిగా సీజేఐ దీపక్ మిశ్రా ధర్మాసనం కేంద్రాన్ని కోరింది. ఈ బృందంలో ఓ రిటైర్డ్ పోలీసు అధికారి, విధుల్లో వున్న మరో అధికారి సభ్యులుగా ఉంటారని పేర్కొంది. రిటైర్డ్ అధికారి హోదా డీఐజీ స్థాయికి తగ్గకుండా ఉండాలని స్పష్టం చేసింది. 241 కేసుల్లో 186 కేసులను విచారించకుండా మూసివేసినట్టు కోర్టు నియమిత పర్యవేక్షణ సంఘం గుర్తించినట్టు తెలిపింది. ఈ సంఘం నెంబర్ లాక్‌తో కూడిన లెదర్ బాక్స్‌లో సమర్పించిన నివేదికను అత్యున్నత న్యాయస్థానం బుధవారం పరిశీలించింది.

కేంద్రీయ విద్యాలయాల్లో హిందూ ప్రార్థనలా..

కేంద్రానికి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ : కేంద్రీయ విద్యాలయాల్లో విద్యార్థులు తమ మతవిశ్వాసాలతో సంబంధం లేకుండా అసెంబ్లీలో హిందువుల ప్రార్థనను తప్పనిసరిగా ఆచరించాలన్న నిబంధనను తప్పుబడుతూ దాఖలైన ఫిర్యాదును సుప్రీంకోర్టు బుదవారం పరిశీలించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ సమాధానాన్ని కోరుతూ నోటీసు జారీచేసింది. స్కూళ్లల్లో ప్రార్థనలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధికి అడ్డంకిగా మారింది. దీంతో పిల్లల ఆలోచనశైలి మారిపోతోంది. వారు తమ సమస్యలను ప్రత్యక్షంగా ఎదుర్కొనే దృక్పథాన్ని విడనాడి దేవుడిపై విశ్వాసం చూపుతూ పరమాత్మ సహాయాన్ని కోరడం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో వీరిలో ఏదైన విషయాన్ని తెలుసుకోవాలన్న ఉత్సాహం, ఆసక్తి సన్నగిల్లుతోంది' అని మధ్యప్రదేశ్‌కు చెందిన వినాయక్‌షా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓ మతానికి సంబంధించిన ప్రార్థనను తప్పనిసరి చేయడంతో మైనారిటీలు, నాస్తికులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ఇది రాజ్యాంగవిరుద్ధమని, అప్రజా స్వామ్యమని అంటున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా విద్యాలయాల్లోని విద్యార్థులు, టీచర్లకు ఒకటే ప్రార్థనను ప్రభుత్వం అమలు చేస్తుందా అన్నది ప్రధాన ప్రశ్నగా షా పేర్కొన్నారు. ప్రార్థనలను మానుకొని సాంకేతిక, శాస్త్రీయ విజ్ఞానాన్ని పిల్లల్లో పెంపొందిం చడంపై విద్యాలయాలు దృష్టిపెట్టాలని సూచించారు. హెచ్‌ఆర్‌డీ శాఖ ఆధ్వర్యంలో నడిచే కేంద్రియా విద్యాల యాలు దేశ వ్యాప్తంగా ఒకటే సిలబస్‌ను, కరికులంను అమలు చేస్తాయి. దాదాపు 1,125 స్కూళ్లకు వ్యాపించి వున్న ఈ నెట్‌వర్క్ అతిపెద్దది కావడంతో 'వరల్డ్స్ లార్జెస్ట్ చెయిన్ ఆఫ్ స్కూల్స్'గా ప్రఖ్యాతిగాంచింది. ఈ స్కూళ్లు 50 ఏళ్లకుపైగా నడుస్తున్నాయి.



15న సంక్రాంతి సెలవు : కేంద్రం

న్యూఢిల్లీ : సంక్రాంతి పండుగ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఏపీ, తెలంగాణలో కేంద్ర కార్యాలయాలకు 15న సెలవు ప్రకటించింది. గతంలో జనవరి 15వ తేదీన కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు లేదు. అయితే ఆప్షనల్ హాలీడేగా ఉన్న ఈ రోజును పూర్తి సెలవు దినంగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ ఆదేశాలు జారీ చేసింది. ఇంతకు ముందు సెలవు దినంగా ప్రకటించిన సెప్టెంబర్ 3వ తేదీన కార్యాలయాలు యథావిధిగా పని చేస్తాయని స్పష్టం చేసింది.

యూపీలో మాజీ గ్రామ సర్పంచ్ హత్య

సంబాల్ : మాజీ గ్రామ సర్పంచ్‌ను గుర్తుతెలియని దుండగులు కాల్చిచంపిన ఘటన బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని సంబాల్‌లో చోటుచేసుకుంది. అస్మోలీ పోలీసుస్టేషను పరిధిలో మద్యం దుకాణం ముందు నుంచొని ఉన్న మాజీ గ్రామ ప్రధాన్ శివరాజ్ సింగ్ (65)ను ఐదుగురు దుండగులు మోటారుసైకిళ్లపై వచ్చి కాల్చి చంపారని పోలీసులు తెలిపారు. దీంతో శివరాజ్ సింగ్ అక్కడికక్కడే మృతిచెందినట్టు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో తొక్కిసలాట - ఒకరి మృతి

డెహ్రీ అన్ సోన్ : బీహార్‌లో ఆర్మీ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో తొక్కిసలాట జరగడంతో ఒకరు మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయి. రోహతస్ జిల్లాలోని డెహ్రీలో మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులైన్స్ గేటు నుంచి దరఖాస్తుదారులు ఒక్కసారిగా బీఎంపీ గ్రౌండ్‌కు తోసుకురావడంతో ఈ ఘటన చోటుచేసుకుందని ఎస్పీ ఎంస్ ధిల్లాన్ తెలిపారు. మృతుడిని గయా జిల్లాకు చెందిన ముఖేష్‌కుమార్‌గా గుర్తించినట్టు తెలిపారు.గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీలో రసాభాస

జమ్మూ : జమ్మూ, కాశ్మీర్ అసెంబ్లీ సమావేశం బుధవారం రసాబాసగా సాగింది. రాష్ట్రంలో ఎంతోమంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారని, ఈ హత్యలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫ లమైందంటూ జమ్మూ, కాశ్మీర్ అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టడంతో సభలో గందరగోళం నెలకొంది. మంగళవారం కుల్గాం జిల్లాలో కుద్వానిలో ఉగ్రవాదిని కాల్చి చంపిన నేపథ్యంలో భద్రతాదళాల కాల్పుల్లో 20 ఏళ్ల యువకుడు మృతిచెందడంపై ప్రతిపక్ష సభ్యులు మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఛైర్‌పర్సన్‌పై రాజద్రోహం కేసు

బరైలీ : ఉత్తరప్రదేశ్‌లోని నవాబ్‌గంజ్ నగర్ కొత్త ఛైర్‌పర్సన్ షెహ్లా తాహిర్, ఆమె భర్తపై రాజద్రోహం కేసు నమోదైంది. ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన అనంతరం విజయోత్సవ సంబరాల్లో వీరితోపాటు మరో 500 మంది పాక్‌కు అనుకూలంగా నినాదాలు చేసినట్టు నవాబ్‌గంజ్‌నగర్ వీహెచ్‌పీశాఖ ఛైర్మన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. డిసెంబరు 23న వారు 'పాకిస్తాన్ జిందాబాద్' అని నినాదాలు చేసినట్లు సీడీలో రికార్డయిన ఈ సంఘటన వైరల్ అయ్యిందని చెప్పారు.

రూ.40 లక్షల విలువైన మద్యం స్వాధీనం

గోపాల్‌గంజ్ : బీహార్‌లో గోపాల్‌గంజ్ జిల్లాలో రూ.40 లక్షల విలువైన 300 మద్యం సీసాల డబ్బాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ విభాగం బుధవారం తెలిపింది. కుచకోట్ పోలీసు స్టేషను పరిధిలో చెక్‌పోస్టు వద్ద తనిఖీలో నకిలీ నెంబర్ ప్లేట్‌తో ఉన్న ట్రక్కులో హర్యానాలో తయారైన మద్యంను తరలిస్తున్నట్టు కనుగొన్నామని చెప్పారు. మద్యసీసాలను స్వాధీనం చేసుకున్నా మని తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

మేఘాలయలో మహిళా ఓటర్లే ఎక్కువ

షిల్లాంగ్ : మేఘాలయలో ఓటర్ల నమోదు తుది జాబితాను ఎన్నికల అధికారి (సీఈఓ) ఎఫ్ఆర్ ఖర్కొంగర్ విడుదల చేశారు. రాష్ట్రంలో 50.4 శాతం మంది మహిళా ఓటర్లు నమోదైనట్టు తెలిపారు. మొత్తం 18, 30104 మంది ఓటర్లలో 9,23,848 మంది మహిళలు ఉన్నట్టు చెప్పారు. ఈ ఏడాది మొదట్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిశీలించి తుది జాబితాను విడుదల చేశారు.

అజ్మీర్ ఉపఎన్నిక : బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్

జైపూర్ : అజ్మీర్ లోక్‌సభ నియోకవర్గం ఉపఎన్నికలో పోటీకి బీజేపీ అభ్యర్థి రామ్‌స్వరూప్ లంబా, కాంగ్రెస్ అభ్యర్థి రఘు శర్మ బుధవారం నామినేషన్ వేశారు. ఈ ఇద్దరు నేతలు వారి వారి పార్టీ నాయకులు, మద్దతుదారులతో కలిసి వచ్చి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ నెల 29న అజ్మీర్, అల్వార్ లోక్‌సభ నియోజకవర్గాలకు మండలఘర్ అసెంబ్లీ నియోజవర్గాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి. గత ఏడాది సన్వార్ లాల్‌జత్ గుండెపోటుతో మృతిచెందడంతో అజ్మీర్ లోక్‌సభ స్థానం ఖాళీ అయ్యింది.

పంజాబ్, హర్యానాలో గజగజ

చండీగఢ్ : పంజాబ్, హర్యానాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. జలంధర్‌లోని ఆదంపూర్‌తో పాటు ఈ రెండు ప్రాంతాల్లో చలిగాలులు వణికిస్తున్నాయి. ఆదంపూర్‌లో 0.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారి బుధవారం తెలిపారు. చండీఘర్‌లో 4.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందన్నారు. హర్యానా, నార్నైల్, కర్నాల్‌లో 2.5, 2.2, అంబాల, హిస్సార్, రోహతక్‌లో 5.2, 5.1, 5.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపారు.

బాలీవుడ్ నటుడిని మోసగించబోయిన బిల్డర్‌పై కేసు

ముంబై : ప్రముఖ బాలీవుడ్ నటుడు దిలీప్ కుమార్ బంగ్లాను నకిలీ పత్రాలతో స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించిన బిల్డర్‌పై ముంబై ఆర్థిక నేరాల విభాగం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల దిలీప్‌కుమార్ భార్య సైరాభాను బిల్డర్ భోజవనిపై ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. 1953లో బంగ్లాలోని ప్లాట్లను రూ.1.40 లక్షలకు దిలీప్‌కుమార్ తండ్రి కొన్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ కేసు విచారణ సాగుతోందని తెలిపారు.

బాల నేరస్తుల గృహం నుంచి ఇద్దరు పరారీ

న్యూఢిల్లీ : పంజాబ్‌లో బాల నేరస్తుల గృహం నుంచి ఇద్దరు తప్పించు కున్నారు. దొంగతనానికి సంబంధించిన వివిధ కేసుల్లో విచారణ పొందుతున్న ఇద్దరు బుధవారం గిల్‌రోడ్డులోని బాల నేరస్తుల గృహం నుంచి తప్పించుకున్నారని పోలీసులు తెలిపారు. వీరిని లూథియానాకు చెందిన విశాల్ (15), శంగ్రూర్‌కు చెందిన జస్వంత్ సింగ్ (17)గా గుర్తించినట్టు తెలిపారు. హోంలో రెండవ అంతస్తులో గ్రిల్, వైర్ మెష్‌ను కట్ చేసి తప్పించుకున్నారని చెప్పారు. వాళ్లను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్య

తిరునల్వేలి : తమిళనాడులో బుధవారం మధ్యవయస్కురాలు, ఆమె ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వసుదేవనల్లూర్‌లోని శంకుపురంలో సీత (55) అనే వితంతువు తన ఇద్దరు కుమార్తెలు సోర్నా (26), పద్మ (20)లతో నివసిస్తుందని చెప్పారు. పెద్ద కుమార్తె సోర్నా ప్రేమించిన వ్యక్తితో పెళ్లికి ఆ అబ్బాయి తరపు కుటుంబం ఒప్పుకోలేదని, అతనికి వేరొక అమ్మాయితో పెళ్లి ఏర్పాట్లు చేస్తుండటంతో వీరు మనస్తాపం చెందారని తెలిపారు. సుసైడ్ నోట్‌ను రాసి ఆత్మహత్య చేసుకున్నారని, కేసు దర్యాప్తు సాగుతుందని పోలీసులు తెలిపారు.

ఎన్నికల పోరుకు సిద్ధమవ్వాలి : కాంగ్రెస్

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జమ్మూ,కాశ్మీర్‌లో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు పార్టీ నాయకులు,కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని ఆ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీఏ మిర్ కోరారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పీడీపీ-బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లో పోరుకు సిద్ధమవ్వాలన్నారు.



ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

విశాలాంధ్ర - మంగళగిరి : గుంటూరుజిల్లా మంగళగిరి మండలంలోని చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రి వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షులు డాక్టర్ ముక్కామల అప్పారావు తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శస్త్ర చికిత్స వివరాలను ఆయన వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం చాదరాసికుంట గ్రామానికి చెందిన నాయుడు పావని డిసెంబరు 3వ తేదీన తన భర్త మురళికి చెందిన ఆటోలో ఓ ఫంక్షన్‌కు వెళుతోంది. ఈ క్రమంలో ఆమె తన కుడి చేతిని ఆటోలో నుంచి బయటవైపు పెట్టడంతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ తగిలింది. దీంతో పావని కుడిచేయి మోచేతి పై వరకు పూర్తిగా తెగి రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆటో నడుపుతున్న పావని భర్త మురళి ఒక్కసారిగా కంగుతిని విరిగి రోడ్డుమీద పడివున్న చేతిని జాగ్రత్తగా ఓ గుడ్డలో చుట్టి దానిని ఓ ప్లాస్టిక్ కవర్‌లో చుట్టడంతోపాటు థర్మాకోల్ ఐస్‌బాక్సులో భద్రపరిచి మూడు గంటల వ్యవధిలో చినకాకాని ఎన్నారై ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ప్లాస్టిక్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ దుగ్గిరాల ప్రతాప్ ఆధ్వర్యంలోని వైద్య బృందం ఎనిమిది గంటల పాటు శ్రమించి ఎముకలు, రక్తనాళాలు, కండరాలకు శస్త్రచికిత్స నిర్వహించారు. పూర్తిగా విరిగిపోయిన చేతిని రీ ఇంప్లాంటేషన్ ద్వారా విజయవంతంగా అతికించారు. ఈ శస్త్రచికిత్స ప్రక్రియలో డా.మాదల రాజశేఖర్, ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డా. సి. హనుమంతరావు, డా.కె సత్య కుమార్, మత్తువైద్య నిపుణులు డా.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. క్షతగాత్రురాలు పావని పూర్తిగా కోలుకుని సురక్షితంగా వున్నట్లు డాక్టర్ ప్రతాప్ తెలిపారు. ఇటువంటి అరుదైన శస్త్రచికిత్స నవ్యాంధ్ర రాష్ట్రంలో మొదటిసారిగా ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో నిర్వహించడం ఆంధ్రరాష్ట్రానికే గర్వకారణంగా చెప్పవచ్చునన్నారు. ఆరువారాల తరువాత పావనికి మరో శస్త్రచికిత్స నిర్వహించాల్సిఉంటుందని, ఆ తరువాత ఏడాదిపాటు ఫిజియోథెరపీ చేయిస్తే యథావిధిగా తన పనులు తాను చేసుకోగలుగుతుందని ఆయన తెలిపారు.

సికింద్రాబాద్ - కాకినాడటౌన్ ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : సంక్రాంతి పండుగకు ప్రయాణికుల రద్దీని నివారించడానికి సికింద్రాబాద్, కాకినాడ టౌన్ మధ్య రెండు సాధారణ ప్రత్యేక రైళ్లు (అన్ని జనరల్ కోచ్‌లు) నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 07050 గా ఈనెల 11,12 తేదీల్లో సికింద్రాబాద్‌లో రాత్రి 11.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.00 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌లలో ఆగుతుంది.



ఎస్వీయూ ఇంజనీరింగ్ అధికారి ఇంటిపై ఏసీబీ దాడులు

విశాలాంధ్ర - తిరుపతి (ఎస్వీయూ) : అవినీతి నిరోధక శాఖ పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ అధికారి అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేసింది. ఏక కాలంలో 6 చోట్ల పకడ్బందీగా దాడులు చేసిన అధికారులు భారీగా అవినీతి ఆస్తులను బయటకు తీశారు. ఎస్వీయూలో అవినీతి చేపకు గాలం వేస్తే ఏకంగా తిమింగలం దొరికిన ఘటన నగరంలో సంచలనం రేపుతోంది. తిరుపతి అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ శంకర్‌రెడ్డి నేతృత్వంలో నలుగురు సీఐలతో కలిసి దాడులు నిర్వహించారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్ (డ్రాఫ్ట్‌మాన్)గా విధులు నిర్వహిస్తు న్న ఎన్. రుద్రకుమార్ అవినీతి, అక్రమాలపై అధికారు లు పక్కా సమాచారం సేకరించారు. బుధవారం వేకువజాము నుంచి కుటుంబ సభ్యుల ఇళ్లతో సహా 6 చోట్ల ఏకకాలంలో దాడులు నిర్వహించారు. తిరుపతి నగరంలోని ఎల్ఎస్ నగర్‌లోని రుద్రకుమార్ ఇంటితోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సోదరి, సోదరి ఇళ్లతోపాటు నెల్లూరు నగరంలోని బంధు వుల ఇంటిలో సోదాలు చేపట్టారు. ఎస్వీయూ ఇంజనీరింగ్ విభాగంపై గత కొన్ని నెలలుగా నిఘా ఉంచారు. ఈ సందర్భంగా డీఎస్పీ శంకర్‌రెడ్డి మాట్లాడు తూ తమకు అందిన సమాచారం మేరకు రుద్రకుమార్ ఇంటిపై దాడులు నిర్వహించామని, ఇందులో ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ అంచనా మేరకు రూ. 3 కోట్ల మేర ఆస్తులు గుర్తించామని, మరో 3 లాకర్లు ఇతర ప్రాంతాల్లోని ఆస్తుల వివరాలు సేకరించాల్సి ఉందన్నారు. ఇందులో ఆయన భార్య పేరుతో నగరంలో 10 ఇంటి స్థలాలు, పుత్తూరు సమీపంలోని గోవింద పాళెంలో రు. 4.20 కోట్లతో 1.7 ఎకరాల భూమి కొనుగోలుకు సంబంధించి న అగ్రిమెంట్లు, ఇందులో రూ.55 లక్షలు అడ్వాన్సు చెల్లించిన పత్రాలు లభించినట్లు తెలిపారు. వీటితో పాటు నగరంలో రెండు భవనాలు, మరో మూడు తాత్కాలిక ఇళ్లు గుర్తించినట్లు తెలిపారు. ఇంట్లో రూ. 1.5 లక్షల నగదు, అర కిలో బంగారం, 3 కేజీల వెండి లభించాయి. 2 కార్లతో పాటు రూ. 8.5 లక్షలు బ్యాంకు ఖాతాల్లో ఉన్నట్లు, రూ. 5లక్షలకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రూ. 11 లక్షలకు ప్రామిసరీ నోట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు పదుల సంఖ్యలో నగదు రాయని ప్రామిసరీ నోట్లను అధికారులు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో ఈ మొత్తం ఆస్తుల విలువ దాదాపు రూ. 40 కోట్ల పైచిలుకు ఉన్నట్లు సమాచారం. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు చంద్రశేఖర్, గిరిధర్, ప్రసాద్ రెడ్డి, విజయ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులంటే భయపడే పరిస్థితి కల్పిస్తున్నారు

విశాలాంధ్ర - గుంటూరు సిటీ : బ్యాంకులంటే భయపడే పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని సమాచార హక్కు అమలు ఉద్యమ కమిటీ కన్వీనర్ పి.నరసింహులు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు టి.నారపరెడ్డి అధ్యక్షతన వివిధ బ్యాంకుల ఖాతాదారుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో నరసింహులు మాట్లాడుతూ ప్రజల డిపాజిట్లే ప్రధాన వనరుగా కొనసాగే బ్యాంకులు డిపాజిటర్లను, ఖాతాదారులను దూరం చేసుకునే స్వయంకృతాపరాధానికి ఒడిగట్టాయన్నారు. ఇన్నాళ్ళుగా ఖాతాదారులకు, బ్యాంకులకు ఉన్న సత్సంబంధాలు చెడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌డీఐ బిల్లుతో బ్యాంకుల మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్నదని, 'బెయిల్-ఇన్-క్లాజు' ద్వారా తమ డిపాజిట్లు చెల్లించరేమోనని ఖాతాదారులు భయపడుతున్నారన్నారు. రైతు నాయకుడు వై. గాంధీరామ్మోహనరావు మాట్లాడుతూ డిపాజిటర్లు, ఖాతాదారులు తమ బ్యాంకు అకౌంట్ల విషయమై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బ్యాంకుల ఎత్తివేత, విలీనం తదితర చర్యలు చురుగ్గా సాగుతున్నాయని పూర్తిగా బ్యాంకులపై ఆధారపడే పరిస్థితులు మంచిదికాదన్నారు.



ఖాతాదారుల ఫోరం ఏర్పాటు : భవిష్యత్తులో బ్యాంకుల వలన ఎదురయ్యే సమస్యలపై ఖాతాదారుల తరపున చర్చించేందుకు, ఉద్యమించేందుకు గాంధీ రామమోహన్‌రావు కన్వీనర్‌గా, ఎస్.కృష్ణారావు కో-ఆర్డినేటర్‌గా మరో పది మంది కమిటీ సభ్యులుగా బ్యాంకు ఖాతాదారుల ఫోరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఏయూ పరిశోధన ప్రవేశాలకు బ్రేక్!

- ఏపీ ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు
- అబెయన్స్‌లో ఆర్ సెట్ అభ్యర్థుల అడ్మిషన్లు
- రాష్ట్ర ప్రభుత్వ ఆకస్మిక నిర్ణయంతో గందరగోళం
- ఆందోళనలో వేల మంది విద్యార్థులు



విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇటీవల తీసుకున్న నిర్ణయంతో ఇప్పటికే పరిశోధనా ప్రవేశాలకుగాను పరీక్ష నిర్వహించి ర్యాంకులు ప్రకటించిన ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిశోధన ప్రవేశాల అభ్యర్థుల భవిత అగమ్యగోచరమైంది. ఇటీవల ఉన్నత విద్యామండలి రాష్ట్ర మానవవనరుల శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన గుంటూరు తాడేపల్లి గూడెంలో రాష్ట్రవ్యాప్త వైస్ ఛాన్సలర్ల సమావేశం నిర్వహించి ఒక తీర్మానం చేసింది. ఈ మేరకు ఈ ఏడాది విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో ఉన్న 14 విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ తీర్మానం ఉత్తర్వులను అన్ని యూనివర్సిటీలకు పంపుతూ ఇప్పటినుండి యూనివర్సిటీల్లో పరిశోధనల అడ్మిషన్లు పెండింగులో ఉంచాలని తదుపరి సమావేశం తరువాత మరో కొత్త నోటిఫికేషన్ జారీచేసి ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. దీంతో ఒక్కసారిగా ఏయూతోపాటు రాష్ట్ర విద్యా రంగంలో కలకలం రేగింది.

ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు ఇవే

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉత్తర్వుల ప్రకారం ఇకపై పరిశోధనల కోర్సులకు విశ్వవిద్యాలయాలు స్వతంత్రంగా ప్రవేశపరీక్ష నిర్వహించుకునే అవకాశం ఉండదు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఉమ్మడి ప్రవేశపరీక్ష మండలి ఆధ్వర్యంలో ఆయా వర్సిటీలను భాగస్వామ్యం చేస్తూ పరీక్ష నిర్వహిస్తారు. నాణ్యమైన పరిశోధనలు సమాజానికి అందించే ప్రధాన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీన్ని విద్యావేత్తలంతా స్వీకరించారు. కానీ ఇప్పటికే ప్రవేశ పరీక్ష నిర్వహించి ర్యాంకులు కూడా ప్రకటించి సీట్లు కేటాయింపు జరపడానికి సిద్ధంగా ఉన్న యూనివర్సిటీలకు ఆయా ప్రవేశాలు పెండింగులో ఉంచాలని తెలపటం ఆందోళన కలిగిస్తున్నది.

ఆర్‌సెట్‌కు వేల మంది విద్యార్థులు పోటీ

దేశంలోనే ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంగా పేరొందిన ఏయూలో పరిశోధన కోర్సుల్లో చేరడానికి రాష్ట్రంతో పాటు తెలంగాణా, దేశంలోని పలు యూనివర్సిటీల నుంచి పెద్దసంఖ్యలో పది వేల పైన దరఖాస్తులు అందాయి. గత నాలుగేళ్లుగా పరిశోధనల ప్రవేశపరీక్ష నిర్వహించకపోవడం, రాష్ట్రంలోని పలు కళాశాలలు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పీహెచ్‌డీ తప్పనిసరి చేయడంతో పెద్దఎత్తున ఆర్‌సెట్‌కు దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది జూన్‌లో ఈ నోటిఫికేషన్ జారీచేశారు. పరీక్ష రుసుం రూ.1000, ప్రత్యేక కేటగిరిలో రూ. 700, వివిధ ఆలస్య రుసుం రూ. వెయ్యి, మూడువేలు, అయిదువేలుగా నిర్ణయించారు. దీంతో కోటి రూపాయల పైనే ఫీజుల రూపంలో యూనివర్సిటీకి ఆదాయం వచ్చింది.

అడ్మిషన్ల కేటాయింపునకు సిద్ధమైన అధికారులు

ఆర్‌సెట్‌కు పది వేల మంది పైనే దరఖాస్తు చేసుకుంటే అందులో 8800 మంది పరీక్ష రాశారు. వారిలో మౌఖిక పరీక్షకు సుమారు 5వేల మంది అర్హత సాధించారు. వారు కూడా ఒక్కొక్కరు రూ. 1000 వరకూ కౌన్సిలింగ్ ఫీజుగా చెల్లించారు. దీంతో అదనంగా మరో రూ. 50లక్షల వరకూ వర్సిటీకి ఆదాయం కూడా వచ్చింది. ఇప్పటికే ఫుల్‌టైమ్ పీహెచ్‌డీకి సంబంధించి ర్యాంకులు కూడా ప్రకటించారు. పార్ట్‌టైమ్ కూడా మరో రెండురోజుల్లో ర్యాంకుల విడుదలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక సీట్ల పంపిణీయే తరువాయి. దీంతో ఖాళీగా ఉన్న 1600 పరిశోధనా కోర్సుల సీట్లపై సుమారు ర్యాంకులు సాధించిన మూడువేల మంది విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న ఉన్నత విద్యామండలి నుంచి ఈ ఉత్తర్వులు అందాయి. దీంతో అధికారులు ఏమి చేయాలో తెలియని స్థితిలో పడ్డారు.

ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు స్వతంత్రంగా పరిశోధనా ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహించుకునేవారు. గత ఏడాది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ప్రకారం కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 50లోపు ర్యాంకు, లేదంటే నాక్ ర్యాంకింగ్‌లో 3.5 పైన పాయింట్లు వచ్చిన యూనివర్సిటీలు మాత్రమే స్వంతంగా పరిశోధనలకు ప్రవేశ పరీక్ష నిర్వహించుకోవచ్చుని, మిగిలిన యూనివర్సిటీలు నెట్, సెట్ ఆధారంగా మాత్రమే ప్రవేశాలు కల్పించాలని సూచించింది. ఈ నిబంధనలు లెక్క చూసుకున్నా ఏయూకు సొంతంగా సెట్ నిర్వహించుకునే అవకాశం ఉంది. ఇప్పుడు మరలా కొత్త నిబంధనలు తీసుకువచ్చి ఏయూకు మినహాయింపు ఇవ్వక విద్యావర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాదికి ఇప్పటికే ఏయూ ప్రవేశపరీక్ష నిర్వహించింది కనుక ఈ నిబంధనల నుంచి వర్సిటీకి మినహాయింపు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. వేల మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి అధికారులు ఏ విధంగా వ్యవహరిస్తారో వేచిచూడాల్సి ఉంది.

చర్చిస్తున్నాం, విద్యార్థులకు నష్టం కలగనివ్వం : ఏయూ వీసీ

ఉన్నత విద్యామండలి ఉత్తర్వులపై వారితో సంప్రదింపులు జరుపుతున్నామని, ఇప్పటికే ర్యాంకులు కూడా ప్రకటించాం కనుక పరిశోధన ఉమ్మడి ప్రవేశ పరీక్షనుంచి ఏయూకు మినహాయింపు కోరుతున్నామని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. నాగేశ్వరరావు తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోను ఆర్‌సెట్ అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ప్రాణాలైనా అర్పిస్తాం..'మాంగనీస్' తవ్వనివ్వం

అధికారులను అడ్డుకున్న గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు



విశాలాంధ్ర-సాలూరు రూరల్ : ప్రాణాలైనా అర్పిస్తాం గానీ తమ ప్రాంతంలో మాంగనీస్ గనుల తవ్వకాలు జరపనివ్వమని విజయనగరం జిల్లా సాలూరు మండలం పట్టుచెన్నూరు పంచాయతీ శిఖపరువు గ్రామ గిరిజనులు తేల్చిచెప్పారు. మాంగనీస్‌ఓర్ ముడిఖనిజం ఉత్పత్తికి సంబంధించిన తవ్వకాలపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించేందుకు అధికారులు బుధవారం శిఖపరువు గ్రామానికి వెళ్ళారు. అయితే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడానికి వచ్చిన అధికారులను పంచాయతీ ప్రజాప్రతినిధులు, గిరిజనులు గ్రామసమీపంలో అడ్డుకున్నారు. ఘనికొండవద్దకు వెళ్లకుండా గ్రామస్తులు అధికారులను చుట్టుముట్టారు. కార్యక్రమానికి వేసిన టెంట్లు, ఇతర సామాగ్రిని గిరిజనులు తొలగించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం జేసీ శ్రీకేశ్‌లఠ్కర్ సమక్షంలో భారీ పోలీసుబందోబస్తు మధ్య ప్రజాభిప్రాయసేకరణ జరిపారు. పట్టుచెన్నూరు సర్పంచ్ ప్రతినిధి కొండపల్లి సింహాచలం, పగులుచెన్నూరు సర్పంచ్ ప్రతినిధి చోడిపల్లి బీసు, ఏపీ గిరిజనసమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మి అప్పలరాజుదొర, సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యాన అనేకమంది గిరిజనులు తమ అభిప్రాయాలను జేసీకి తెలియజేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని, ఇచ్చినట్లయితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని వారు హెచ్చరించారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మి అప్పలరాజుదొర మాట్లాడుతూ గిరిజనులకు కొండలే జీవనాధారమని, కొండలపైనే పోడువ్యవసాయం చేసుకొని జీవనం కొనసాగిస్తారన్నారు. కొండదిగువన జీడి, మామిడితోటల పెంపకాన్ని చేపడుతున్నారని, పశువులను కూడా ఈ కొండపైనే మేతకు తీసుకెళ్తుంటారని, ఇదే మైనింగ్ తవ్వకాలు జరిగినట్లయితే గిరిజన అటవీ ఉత్పత్తులుపోయి జీవనాధారం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడిప్పుడే ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా అభివృద్ధి చేయడానికి సహకరించాలని సీపీఎం నాయకులు మర్రి శ్రీనివాసరావు కోరారు. 2013లో కూడా ఇదేవిధంగా ప్రజాభిప్రాయసేకరణ జరిపారని, అప్పుడు గిరిజనులంతా వ్యతిరేకించారని, ఇప్పుడు కూడా ఆ విధంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సామాన్య గిరిజనుల పొట్టగొట్టి కాంట్రాక్టర్ జేబులు నింపేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నదని, ఈ పద్ధతి సరికాదన్నారు.

అనంతరం జేసీ లఠ్కర్ మాట్లాడుతూ మాంగనీస్ తవ్వకాలపై గిరిజనులు వెలిబుచ్చిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చారు. 2013లో జరిగిన అభిప్రాయసేకరణ ఏవిధంగా ఉందో తెలుసుకుంటామన్నారు. శిఖపరువు గిరిజనుల అభిప్రాయం మాంగనీస్ తవ్వకాలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని స్పష్టంగా అర్థమవుతున్నదని, ఇదే విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. కాలుష్య నియంత్రణమండలి ఈఈ సుదర్శన్ మాట్లాడుతూ 2013లో ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించినా గడువు ముగిసినందున మరల నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని, అందుకే నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజాప్రతినిధులు, గిరిజనులు ప్రజాభిప్రాయ సేకరణ విషయాన్ని గ్రామ ప్రథమ పౌరులైన తమకు తెలియజేయలేదని చెప్పడంతో ఈఈ సుదర్శన్‌పై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక సంఖ్యలో పోలీసులను మోహరింపజేసి ఎలాగైనా మైనింగ్ కాంట్రాక్టర్లకు అనుకూలంగా ప్రజాభిప్రాయసేకరణ నివేదికను సమర్పిద్దామన్న అధికారుల వ్యూహానికి అడ్డుకట్టపడింది. వివాదాస్పద ఏఓబీ సరిహద్దు గ్రామాల్లో ఈ గ్రామం కూడా ఉండటంతో అన్‌సర్వే భూముల్లో మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఏవిధంగా మంజూరు చేసిందన్నదానిపై చర్చనీయాంశమైంది. ఒడిశా అధికారులు కూడా ఈ విధంగానే కొండలను తవ్వుకుంటూపోతే రెండు రాష్ట్రాలమధ్య నలిగి తాము జీవనోపాధి కోల్పోతామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఆర్‌డీఓ బి.సుదర్శనదొర, తహశీల్దార్ జనార్దనరావు, సీఐ సంజీవరావు, ఎస్ఐలు, అధిక సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - పెందుర్తి : విశాఖపట్నంలోని పెందుర్తి పోలీసుస్టేషను ఎదుట బుధవారం ఉదయం ఓ వ్యక్తి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. సీఐ మురళి అందించిన వివరాలివి...పాత పెందుర్తి ప్రాంతా నికి చెందిన ఎం.మహాలక్ష్మి నాయుడు గత అక్టోబరులో భార్యను బ్యాట్‌తో మోది హత్య చేసిన ఘటనలో జైలుశిక్ష అనుభవించాడు. ఆ తర్వాత బెయిల్‌పై వచ్చిన నాయుడు కన్నపిల్లల్ని సైతం హింసించాడు. దీనిపై బంధువులు, స్థాని కులు మహాలక్ష్మినాయుడ్ని అదుపులోకి తీసుకో వాలని గత రెండురోజులుగా నిరసనలు చేపట్టా రు. ఈ క్రమంలో మహాలక్ష్మినాయుడు బుధవారం ఉదయం పోలీసుస్టేషను ఎదుట అందరూ చూస్తుండగానే శరీరంపై పెట్రోలు పోసుకొని నిప్పంటించు కున్నాడు. ఈ ఘటన లో అతడు 70 శాతం కాలిన గాయాలతో కేకలు పెడుతుండగా, స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

అనంతను దత్తత తీసుకుంటా



విశాలాంధ్ర - పెనుకొండ : రాయలసీమలోనే కరవు జిల్లాగా పేరుగాంచిన అనంతపురం జిల్లాను దత్తత తీసుకుని అన్ని రంగాల్లోనూ అభివృద్ధిలో ముందుకు సాగేలా కృషి చేస్తానని ఐటీ, పంచాయతీరాజ్ శాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంతో ఘన చరిత్ర ఉన్న పెనుకొండ పట్టణానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని, అనంతపురం జిల్లా ప్రజల అభిమానాన్ని తన ప్రాణం ఉన్నంత వరకు గుర్తు పెట్టుకుంటానన్నారు. అధికారుల చుట్టూ ప్రజలు తిరిగే కాలం పోయిందని, అధికారులే ప్రజల చుట్టూ తిరిగేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నూతన పద్ధతులను తీసుకువచ్చారన్నారు. నదుల అనుసంధాన ప్రక్రియ ముఖ్య మంత్రి అయిన 18 నెలల్లోనే పూర్తి చేసి గోదావరి, కృష్ణా జలాలను పట్టిసీమ, హంద్రీనీవా ద్వారా రాయల సీమకు తీసుకువచ్చారన్నారు. భారతదేశ చరిత్రలోనే కియా పరిశ్రమ అనేది ఎంతో పెద్దదని, అలాంటి పరిశ్రమను పెనుకొండకు తీసుకురావడానికి ముఖ్యమంత్రి ఎన్నో కష్టాలు పడ్డారన్నారు. అనంతపురం జిల్లాకు అతిసమీపంలో ఉన్న బెంగళూరు నుంచి ఐటీ సంస్థలు వెయ్యి ఎకరాల్లో టౌన్‌షిప్ ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయని, వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మంత్రులు సునీత, ఉమా మహేశ్వరరావు, ఎంపీ కిష్టప్ప, ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ తిప్పేస్వామి పాల్గొన్నారు.

జన్మభూమిని అడ్డుకున్న మదనంతపురం గ్రామస్తులు



విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : జన్మభూమిలో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదంటూ జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. కర్నూలుజిల్లా కొలిమిగుండ్ల మండలంలోని మదనంతపురం గ్రామంలో దేవాదాయ భూములను ఒక వ్యక్తి ఆక్రమించుకున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు తెలియచేసినా పట్టించుకోలేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మదనంతపురం గ్రామంలోని సర్వేనెం 705లో 9.60ఎకరాల చెన్నకేశవస్వామి భూములు, సర్వేనెం 703లో 6 ఎకరాలు వీరభద్రస్వామికి సంబంధించిన భూములున్నాయి. సాగుకు ఎలాంటి వేలం వేయకుండా ఒక స్వార్థపరుడు భూములను ఆక్రమించుకున్నా ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన డిప్యూటీ కలెక్టర్ పుల్లయ్య అప్పటికప్పుడు దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను నెలరోజులలోపల పరిష్కరిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన గ్రామస్తులు ఆ తరువాత జన్మభూమి కార్యక్రమానికి సహకరించారు. కర్నూలు మండలం పూడూరు- పడిదెంపాడు రహదారి సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గ్రామంలోకి అంబులెన్స్ కూడా వచ్చే అవకాశాలు లేవని రోడ్డుపై అధికారులను నిలదీసి జన్మభూమి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఉదయం నుండి జన్మభూమి కోసమని స్కూల్ పిల్లలను తీసుకుని వచ్చి ఎండలో కూర్చోబెట్టడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు, డ్రైనేజీలు సక్రమంగా లేవని అధికారుల తీరుపై నిరసనలు తెలియచేస్తూ ఆందోళనకు దిగుతున్నారు.

దుగరాజపట్నమా? రామాయపట్నమా?

- పోర్టు ఏ పట్నాన్ని వరిస్తుందో?
- స్పష్టత కరవు

విశాలాంధ్రబ్యూరో - నెల్లూరు : నెల్లూరు జిల్లాలో పోర్టు నిర్మాణంపై సందిగ్ధత నెలకొంది. జిల్లాలో నూతనంగా పోర్టు నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. కానీ ఎక్కడ నిర్మించాలనే దానిపై స్పష్టత లేదు. ప్రభుత్వం వాకాడు మండలం దుగరాజపట్నంలో నిర్మించాలని సన్నాహాలు చేసింది. కానీ దానికి సాంకేతికంగా అవాంతరాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. అనంతరం మళ్లీ పున : పరిశీలనకు నివేదిక పంపారు. కానీ ఇంతవరకు ఎటువంటి ప్రకటన రాలేదు. బీజేపీ ఇటీవల జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు. కృష్ణపట్నం పోర్టు యాజమాన్యంతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై ఇలా వ్యవహరిస్తోందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ సైతం దుగరాజపట్నంలోనే పోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్, బీజేపీ దుగరాజపట్నం వైపు మొగ్గుచూపుతున్నాయి. కానీ సీపీఐ, సీపీఎం, వైసీపీ మాత్రం కావలి సమీపంలోని రామాయపట్నంలో నిర్మించాలని పోరు ఉధృతం చేశాయి. రామాయపట్నంలోనే ఏర్పాటు చేయాలని



కావలిలో కమ్యూనిస్టు, ప్రజాసంఘాలు, వైసీపీలు కలిసి పోర్టు సాధన సమితిగా ఏర్పాటయ్యాయి. అందుకు సంబంధించి కావలి నుంచి రామాయపట్నం వరకు పాదయాత్ర, ర్యాలీలు, సభలు కూడా గత ఏడాది నిర్వహించారు. పోర్టు దుగరాజపట్నంలో గానీ రామాయపట్నంలోగానీ ఏర్పాటుకు అనుకూలం. కానీ దీనిపై ప్రభుత్వాలు ఎటువంటి స్పష్టత ఇవ్వడం లేదు. దుగరాజపట్నంలో ఏర్పాటుకు పలు అడ్డంకులు ఉన్నందువల్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా లేనట్టు తెలుస్తోంది. జిల్లాలో కృష్ణపట్నం పోర్టు ఉంది. దీనికి సమీపంలోనే దుగరాజపట్నం ఉంది. అదేవిధంగా జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరికోట ఉంది. షార్‌కు అతి దగ్గరలోనే ఉంది. సముద్ర మార్గం ద్వారా ఇంకా దగ్గరగా ఉంటుంది. పోర్టు అంటే నిత్యం నౌకలు, పడవలు, సరకుల రవాణాతో రద్దీగా ఉంటుంది. ఆగంతకులు ఆ మార్గం గుండా షార్‌లోకి అక్రమంగా ప్రవేశించే అవకాశం ఉంది. షార్ భద్రతా దృష్ట్యా, జిల్లాలో ఒక పోర్టు ఉండగా దానికి సమీపంలో మరొక పోర్టు అవసరం లేదని గతంలో కేంద్ర కమిటీ నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. వీటన్నిటి దృష్ట్యా దుగరాజపట్నంలో ఏర్పాటుకు అవకాశాలు తక్కువనే చెప్పాలి. కానీ రామాయపట్నం కావలికి అతి దగ్గరగా ఉంటుంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల సరిహద్దుల్లో ఉండడం వల్ల రెండు జిల్లాల ప్రజలకు మేలు జరుగుతుంది. రెండు ప్రాంతాల్లో ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంది. కానీ బీజేపీ మాత్రం దుగరాజపట్నం పోర్టుకు చట్టబద్ధత, రాజ్యాంగ బద్ధమైన హక్కులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నదని చెబుతోంది. దుగరాజపట్నంలో నిర్మించడం వల్ల ఉపయోగం లేదని, సాంకేతిక అనుమతులు ఇవ్వకుండా జాప్యం జరగడమే కాకుండా అసలు పోర్టు రద్దు అయ్యే అవకాశం ఉందని, నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో ఉన్న రామాయపట్నంలో పోర్టు ఏర్పాటువల్ల రెండు జిల్లాలకు మేలు జరుగుతుందని, ఇక్కడ ఏర్పాటుచేసేంతవరకు పోరు ఆగదని కమ్యూనిస్టు, వైసీపీ స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నాయి.

ఏపీకి కొత్త గవర్నర్‌ను నియమించాలి : విష్ణుకుమార్ డిమాండు

విశాలాంధ్ర అమరావతి : అసెంబ్లీ ఆమోదించిన నాలా బిల్లుపై రచ్చ జరుగుతోంది. ఈ బిల్లు ఆమోదించే విషయంపై గవర్నర్ ఈఎస్ఎల్. నరసింహన్, ప్రభుత్వం మధ్య లేఖల వివాదం కొనసాగుతుండగా, బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు బుధవారం మరో అడుగు ముందుకేసి ఏపీకి కొత్త గవర్నర్‌ను నియమించాలంటూ గళం విప్పారు. నాలా బిల్లు వ్యవహారం మూడు నెలల క్రితం ప్రారంభ మైంది. రాష్ట్రంలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు ప్రస్తుతం 9 శాతం ప్రభుత్వ రుసుంగా వసూలు చేస్తున్నారు. అయితే పలువురు వ్యాపా రస్తులు, పారిశ్రామికవేత్తలు 9 శాతం చెల్లింపు భారంగా ఉందని చెప్పటంతో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మరికొందరు ప్రజా ప్రతినిధులు నాలా ట్యాక్స్‌ను తగ్గించా లని కోరారు. అందుకు ప్రభుత్వం సంబంధించి ట్యాక్స్‌ను తగ్గించేందుకు నిర్ణయించి ఆర్డినెన్స్ తెచ్చింది. ఆ తర్వాత అసెంబ్లీలో నాలా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపచేసింది. డిసెంబర్ 2న అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఆ బిల్లు ఆమోదానికి ప్రభుత్వం గవర్నర్‌కు పంపింది. అయితే గవర్నర్ ఆమోదించలేదు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ వ్రాసినా గవర్నర్ తాను చేసిన సూచన లను పరిగణనలోకి తీసుకోలేదంటూ మరోసారి బిల్లును వెనక్కు పంపుతూ నాలా బిల్లుకు సంబంధించి సీఎంకు గవ ర్నర్ రెండు రోజుల క్రితం లేఖ రాశారు. దీంతో గవర్నర్ లేఖను సీఎం చంద్రబాబు రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్ర టరీ మన్మోహన్‌సింగ్‌కు పంపించి తగిన చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. అయితే తెలంగాణలో నాలా బిల్లు ను గవర్నర్ గతేడాదే ఆమోదించారు. ఏపీ బిల్లు విష యంలో ఎందుకు అభ్యంతరాలు తెలిపేది ఎవరికీ అర్ధం కావటం లేదు. ఈ బిల్లు ఆమోదం విషయంలో గవర్నర్ వ్యవహారశైలిని విష్ణుకుమార్ రాజు కొద్దిరోజుల నుంచి తప్పుపడుతూ వస్తున్నారు. వారం క్రితం మీడియాతో మాట్లాడుతూ నరసింహన్‌పై విమర్శలకు దిగారు. ఏపీ పట్ల గవర్నర్ వివక్ష చూపుతున్నారన్నారు. ఈ విషయంలో గవర్నర్ ఆమోదం తెలపకపోతే తాను రాష్ట్రపతి, ప్రధాన మంత్రిలను కలిసి గవర్నర్‌పై ఫిర్యాదు చేస్తానన్నారు. అయితే గవర్నర్ రాజు విమర్శలు చేసిన తర్వాత కూడా తిరిగి నాలా బిల్లును వెనక్కు పంపటంతో బుధవారం విష్ణు కుమార్‌రాజు ఏపీకీ కొత్త గవర్నర్‌ను నియమించాలంటూ డిమాండ్ చేశారు.

విదేశీ కంపెనీలకు గేట్లు బార్లా

- పలు రంగాల్లో ఎఫ్‌డీఐలకు అనుమతి
- ఎయిర్ ఇండియాలో 49 శాతం
- సింగిల్ బ్రాండ్ రిటైల్, నిర్మాణ రంగంలో 100 శాతం
- వైద్య పరికరాలు, ఆడిట్ సంస్థలకూ నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తన పంతాన్ని నెగ్గించుకుంది. దేశ ఆర్థిక విధానాల విషయంలో విపక్షాలు, ఆర్థిక నిపుణులు, వాణిజ్య వర్గాలు చేస్తున్న హెచ్చరికలను బేఖాతరు చేస్తూ దేశంలోని విభిన్న రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లకు ద్వారాలు తెరిచింది. బడ్జెట్ నేపథ్యంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానంలో సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమించింది. సింగిల్ బ్రాండ్ రిటైల్, నిర్మాణ రంగం, విద్యుత్ ఎక్ఛేంజ్‌లలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు నిబంధ నలను సరళతరం చేస్తూ బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక రుణ ఊబిలో చిక్కుకున్న ఎయిర్ ఇండియాలో విదేశీ విమానయాన సంస్థలు 49 శాతం వరకు పెట్టుబడులు పెట్టేందుకు అనుమతి ఇచ్చింది. విదేశీ నిధులు అందుకునే కంపెనీలకు సంబంధించిన ఆడిట్ సంస్థలు, వైద్య పరికరాల కోసం ఎఫ్‌డీఐ విధానాన్ని ప్రభుత్వం సరళతరం చేసింది. ఇక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఈ నిర్ణయాలు తీసుకుంది. ఇకియా వంటి విదేశీ రిటైలర్లకు ఈ చర్య ఎంతో ఊపునిచ్చేదిగా ఉంది. సింగిల్ బ్రాండ్ రిటైల్ వాణిజ్యంలో ఆటోమేటిక్ రూట్ కింద 100 శాతం ఎఫ్‌డీఐను ప్రభుత్వం ఆమోదించింది. అయితే ఇంతకుముందు ఈ రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతించింది. కానీ దానిని



ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది. 'కేంద్ర మంత్రివర్గం ఎఫ్‌డీఐ విధానంలో అనేక సవరణలను ఆమోదించింది. దేశంలో 'సులభతర వ్యాపారం'(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ఏర్పాటుకు ఎఫ్‌డీఐ విధానాన్ని సరళీకృతం చేయాలన్నది ప్రధాన ఉద్దేశం. దీంతో పెట్టుబడులు, ఆదాయం, ఉపాధి వృద్ధికి ఎఫ్‌డీఐ ప్రవాహాలు దోహదపడతాయి' అని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వరంగ రవాణా సంస్థ నుంచి పెట్టుబడిని ఉపసంహరించుకునేందుకు ఎయిర్ ఇండియాలో అనుమతి మార్గం కింద 49 శాతం పెట్టుబడులకు విదేశీ విమానయాన సంస్థలకు అనుమతి ఇచ్చేందుకు నిర్ణయించింది. 'భారత ప్రభుత్వం అధీనంలోని ఎయిర్ ఇండియాపై అజామయిషీ ఆ సంస్థకే ఉంటుందని, ఎఫ్‌డీఐలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా 49 శాతానికి మించ కూడదు' అని ఆ ప్రకటన పేర్కొంది. కాగా 2017 మార్చి నాటికి ఎయిర్ ఇండియా మొత్తం రుణం సుమారు రూ.48,877 కోట్లుగా ఉంది. ఇందులో 17,360 కోట్లు విమానాల రుణం కాగా, రూ.31,517 కోట్లు వ్యాపార పెట్టుబడులకు సంబంధించిన రుణం. ఇదిలా ఉండగా 2017-18 కాలానికి నికర నష్టం రూ.3,579 ఉండవచ్చని ఈ విమానయాన సంస్థ భావిస్తోంది. ఇక విద్యుత్ ఎక్ఛేంజ్‌లకు సంబంధించిన అంశంలో కూడా విదేశీ పెట్టుబడుల విధానాన్ని సరళీకరించారు. అయితే విద్యుత్ ఎక్ఛేంజ్‌లలో ఆటోమేటిక్ మార్గం క్రింద 49 శాతం ఎఫ్‌డీఐగా ప్రస్తుత విధానం ఉంది. కాగా ఎఫ్ఐఐ/ఎఫ్‌పీఐ కొనుగోళ్లు ద్వితీయ శ్రేణి మార్కెట్‌కు మాత్రమే పరిమితం చేయబద్దాయి. 'అలాగే ప్రాథమిక మార్కెట్ ద్వారా విద్యుత్ ఎక్ఛేంజ్‌లలో పెట్టుబడులకు ఎఫ్ఐఐ/ఎఫ్‌పీఐలను అనుమతిం చేందుకు పాత నిబంధనను ఎత్తివేయాలని నిర్ణయించాం' అని ఆ ప్రకటన వివరించింది. 'రియల్ ఎస్టేట్ మధ్యదళారీ సేవల వల్ల రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతినకూడదన్నది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేస్తూ నిర్మాణ అభివృద్ధి రంగంలో సరళీకరణకు సంబంధించి ఆటోమేటిక్ మార్గం కింద 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. అభివృద్ధి అంశంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు మాట్లాడుతూ విదేశీ పెట్టుబడులు అందుకునేందుకు అడ్డంకులను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిబంధనలను సరళీకరించడం ద్వారా ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. 2016 జూన్‌లో భారీ మార్పుల తర్వాత ఎన్‌డీఏ ప్రభుత్వం మరోసారి ఎఫ్‌డీఐ విధానంలో భారీ సరళీకరణ చర్యలు చేపట్టింది.

ఈ-పాస్ మెషిన్ల ట్యాంపరింగ్ గుట్టురట్టు

అదుపులో 40 మంది డీలర్లు

విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో: ప్రజా పంపిణీ వ్యవస్థలో మాఫియా వ్యవహారం గుట్టు రట్టైంది. ఈ-పాస్ మెషిన్లలో ట్యాంపరింగ్‌కు పాల్పడి అక్రమ మార్గంలో టన్నుల కొద్దీ బియ్యం స్వాహా చేసిన నెల్లూరు, గూడూరు, కోవూరు తదితర ప్రాంతాల్లోని 40 మంది చౌకదుకాణాల డీలర్లను క్రైమ్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. జిల్లా యంత్రాంగం ఇచ్చిన ఫిర్యాదుతో అక్రమార్కుల డొంక కదిలింది. పేదలకు చేరాల్సిన బియ్యాన్ని అక్రమ మార్గంలో డీలర్లు స్వాహా చేశారు. చౌకదుకాణాల డీలర్లు కంప్యూటర్ ఆపరేటర్లు కుమ్మకై ప్రజా పంపిణి వ్యవస్థకు చిల్లులు పెట్టి ప్రతి నెల లక్షల రూపాయాల స్వాహా చేశారు. జాయింట్ కలెక్టర్, డీఎస్వో లాగిన్లతో ఈ అక్రమానికి పాల్పడ్డారు. అధికారపార్టీ నాయకుల అండదండలు ఉన్న పసుపు డీలర్లను అరెస్ట్ చేయాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బోగస్ ఆధార్ నెంబర్లు నమోదు చేయడం, వీఆర్వోల ఆధ్వర్యంలో చేస్తున్న పంపిణి విషయంలో డీలర్లు అక్రమాలకు పాల్పడ్డారు. రేషన్ పంపిణీ అధిక శాతం చేసినట్లు రికార్డుల్లో చూపించి బియ్యం స్వాహా చేశారు. జిల్లాలో 8.63 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. 1863 చౌకదుకాణాలు ఉన్నాయి. ప్రతి నెల 15 వేల మెట్రిక్ టన్నులు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెల 300ల టన్నుల బియ్యం పక్కదారి పడుతున్నట్లు సమాచారం. టన్ను బియ్యం ఎకనామిక్ ధర ప్రకారం రూ 33.25 పైసలు. టన్ను బియ్యం రూ 33250. 300ల టన్నుల బియ్యం విలువ బహిరంగ మార్కెట్‌లో కోటి రూపాయాలు ఉంటుందని అంచనా. జిల్లా వ్యాప్తంగా డీలర్లు ప్రతి నెల రూ కోటి రూపాయాల అక్రమాలకు పాల్పడుతున్నారు. స్వాహా చేసిన దానిలో కింది స్థాయి నుంచి అందరికి వాటాలు పంచుతున్నాట్లు విమర్శలు ఉన్నాయి. ప్రజా పంపిణి వ్యవస్థలో లోపాలను సవరించేందుకు ప్రభుత్వం ఈ-పోస్ విధానాన్ని రెండేళ్ల నుంచి అమలు చేస్తోంది. కొంతమంది చౌకదుకాణాల డీలర్లు సివిల్ సప్లయి శాఖ కంప్యూటర్ ఆపరేటర్లను లోబరచుకొని అక్రమాకలు పాల్పడ్డారు. ఈ-పోస్ విధానంలోని లోపాలను తెలివిగా ఉపయోగించుకుని ఈ వ్యవహారం నడిపారు. చౌకదుకాణంలో 70 శాతం ప్రజా పంపిణి జరిగితే దానిని 80 శాతం జరిగినట్లు ట్యాంపరింగ్ చేస్తున్నారు. ట్యాంపరింగ్ చేసినందుకు కంప్యూటర్ ఆపరేటర్‌కు టన్నుకు రూ 3 నుంచి 4 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం జిల్లా యంత్రాంగం దృష్టికి రావడంతో క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కార్తీక్, వినయ్, పవన్, శ్రీనివాస్ తదితర కంప్యూటర్ ఆపరేటర్లను అదుపులోకి తీసుకుని విచారించారు. వారిచ్చిన సమచారం మేరకు అక్రమాలకు పాల్పడ్డ చౌకదుకాణాల డీలర్లను అదుపులోకి తీసుకున్నారు. పూర్తి సమచారం సేకరించిన తరువాత డీలర్లపై కేసులు సమోదు చేసే అవకాశం ఉంది. ట్యాంపరింగ్‌కు కారణమైన అసలు డీలర్లను పోలీసులు అదుపులోకి తీసుకోలేదు. కంప్యూటర్ ఆపరేటర్లను అదుపులోకి తీసుకున్న సమయంలో అసలు అక్రమాదారులు జాగ్రత్తపడ్డారు. అధికారపార్టీ నాయకులచేత ఒత్తిడి చేయించి వారు తప్పించుకుని తిరుగుతున్నారు. ప్రధానమైన నాలుగు డీలర్లు ట్యాంపరింగ్ విషయంలో తమకు సంబధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ట్యాంపరింగ్‌కు సంబంధించి డీలర్ల నుంచి టన్నుకు రూ 6 వేలు వసూలు చేస్తారు. రూ 3 వేలు కంప్యూటర్ ఆపరేటర్‌కు ఇచ్చి మిగిలిన మూడు వేలు వారు జేబులో వేసుకుంటారు. అటువంటి వారిని పోలీసులు అదుపులోకి తీసుకోలేదు. ఈపాస్ టాంపరింగ్ అక్రమాలపై ఒకటో నగర పోలీసులు కేసు నమోదు చేశారు. ఈవిషయమై కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణతో మాట్లాడారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్లో

కేజీబీవీలకు పతకాల పంట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతిష్టాత్మక సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్(ఐఎంవో) 2017-18 పరీక్షల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ) విద్యార్థులు సత్తా చాటారు .బుధవారం విడుదలైన ఐఎంవో పరీక్షా ఫలి తాల్లో వివిధ స్థాయిల్లో కేజీబీవీ విద్యార్థులు పతకాల పంట పండించారు. జోనల్ స్థాయిలో 25 అవార్డులు, స్కూల్ లెవెల్లో 115 బంగారు పతకాలు, 6రజత పతకాలు, 5 కాంస్య పతకాలు దక్కాయి. 346 మంది లెవెల్-2కు అర్హత సాధించారు. ఐఎంవోలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

18, 19 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

విశాలాంధ్ర అమరావతి : కలెక్టర్ల సదస్సును ఈ నెల 18,19ల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనను బుధవారం విడుదల చేసింది. సీఎం చంద్ర బాబు నివాసం సమీపంలో ఉన్న గ్రీవెన్స్‌హాల్ లో కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (రెవెన్యూ) డాక్టర్ మన్మోహన్ సింగ్‌ప్రకటనలో పేర్కొన్నారు.

సివిల్స్-2017 మెయిన్స్ ఫలితాలు విడుదల

ఢిల్లీ: సివిల్స్-2017 మెయిన్స్ ఫలితాలను యూనియన్ పబ్లిక్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు (గ్రూప్-ఏ, గ్రూప్-బి) సంబంధించి ఉద్యోగుల ఎంపిక కోసం గత ఏడాది అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకు ఈ పరీక్షలను యూపీఎస్సీ నిర్వహించింది. ఎంపికైన అభ్యర్థులు సంబంధిత పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 19 నుంచి ఇవి ప్రారంభం కానున్నాయి.

ఏపీకి 60.. తెలంగాణకు 50 టీఎంసీలు

కృష్ణా నీటియాజమాన్య బోర్డు

విశాలాంధ్ర-హైదరాబాద్: కృష్ణానదిలో అందుబాటులో ఉన్న జలాలను ఆంధ్రప్రదేశ్ 60, తెలంగాణ 50 టీఎంసీలు చొప్పున వినియోగించుకోవాలని కృష్ణా నీటియాజ మాన్య బోర్డు స్పష్టం చేసింది. హైదరాబాద్ జలసౌధలో జరిగిన బోర్డు సమావేశం బుధవారం ముగిసింది. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) మురళీధర్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇప్పటి వరకు వినియోగించు కున్న నీటితో పాటు భవిష్యత్ వినియోగంపైనా సమావేశంలో చర్చించారు. అందు బాటులో ఉన్న 139 టీఎంసీల నీటిని వచ్చే ఆగస్టు నెల వరకు జాగ్రత్తగా ఉపయో గించుకోవాలని బోర్డు మంగళవారం ఇరు రాష్ట్రాలకు సూచించింది. వాటిలో నుంచి 20 టీఎంసీల నీటిని పక్కకు పెట్టి 110 టీఎంసీల నీటిని మాత్రమే రెండు రాష్ట్రాలు వినియోగించుకునేలా సమావేశంలో నిర్ణయించారు. దాని ప్రకారం అందుబాటులో ఉన్న నీటిలో ఆంధ్రప్రదేశ్ 60, తెలంగాణ 50 టీఎంసీల నీరు వినియోగించుకోవాలని త్రిసభ్య కమిటీ స్పష్టం చేసింది. టెలిమెట్రీ, చిన్న నీటి వనరుల వినియోగం సహా ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన కమిటీలు ఇచ్చేనివేది కల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయం తీసుకున్నారు.



పోలవరానికి అదనంగా

రూ.40 వేల కోట్లు కేటాయించాలి

సత్యాగ్రహ సభలో రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు : పోలవరం ప్రాజెక్టు 2018 నాటికి పూర్తి కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో 40 వేల కోట్లు రూపాయలు అదనంగా కేటాయించాలని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి డిమాండు చేశారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో బుధవారం నిర్వహించిన సత్యాగ్రహ సభలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్మాణానికి వైఎస్ రాజశేఖరరెడ్డి అన్ని అనుమతులు తీసుకు వచ్చారని గుర్తు చేశారు. అయితే వీటి నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం కారణంగా పూర్తి స్థాయిలో పనులు వేగం పుంజుకోలేదని తెలిపారు. ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో, సీలేరులో నీటి నిల్వలు పడిపోవడంతో ఉభయ గోదావరి జిల్లాల్లో తీవ్ర సాగునీటి సమస్య ఏర్పడిదని రఘువీరారెడ్డి తెలిపారు. నాట్లు పూర్తి కాకుండానే వంతుల వారీ విధానం అమలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాబోయే రోజుల్లో పోలవరం పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామని ఆయన చెప్పారు. ఈ నెల 7వ తేదీన ధవళేశ్వరం నుంచి పోలవరం కోసం చేపట్టిన మహాపాదయాత్ర, సత్యాగ్రహ దీక్షతో నాలుగు రోజులపాటు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పనబాక లక్ష్మి, కిల్లీ కృపారాణి, పల్లం రాజు, జేడీ శీలం, వట్టి వసంత కుమార్, ఎన్.తులసీరెడ్డి, కనుమూరి బాపిరాజు, రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, జెట్టి గురునాధరావు, కరాటం రాంబాబు, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్రీడలు

స్కీయింగ్‌లో భారత్‌కు పతకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికపై భారత్ మరోసారి సత్తా చాటింది. స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకాన్ని అందించి చరిత్ర సృష్టించింది హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలికి చెందిన 21 ఏళ్ల ఆంచల్ ఠాకూర్. టర్కీలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీ స్కీ(ఎఫ్ఐఎస్) ఆధ్వర్యంలో ఆల్పైన్ ఎజ్డర్ 3200 కప్ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో భాగంగా మంగళవారం స్లాలోమ్ రేస్ కేటగిరీలో పాల్గొన్న ఆంచల్ కాంస్య పతకం కైవసం చేసుకుంది. స్కీయింగ్‌లో భారత్ పతకం సాధించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆంచల్ తన ట్విటర్ ద్వారా పతకం గెలిచిన ఫొటోలను పంచుకుంది. 'చివరిగా ఊహించనిది జరిగింది. ఇది నా తొలి అంతర్జాతీయ పతకం. టర్కీలో ఎఫ్ఐఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో మంచి ప్రదర్శన చేశాను' అని పేర్కొన్న ఆంచల్.. వన్ హిమాచల్, హిమాలయన్ గర్ల్స్ అని హ్యాష్ ట్యాగ్‌లు పెట్టింది.





టీమిండియా టీ20 షెడ్యూలు ఖరారు

ముంబై: విరాట్ కోహ్లీ నేతృత్వంలోని భారత క్రికెట్ జట్టు ఐర్లాండ్‌తో ట్వంటీ20 సిరీస్ ఆడనుంది. ఇంగ్లండ్‌తో సిరీస్ కంటే ముందుగానే భారత జట్టు ఐర్లాండ్‌కు బయలుదేరనుందని బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) వెల్లడించింది. ఈ మేరకు బుధవారం బీసీసీఐ పాలక మండలి ఐర్లాండ్ పర్యటన షెడ్యూలు ఖరారు చేసింది. డబ్లిన్ వేదికగా రెండు టీ20లు జరగనున్నాయి. జూన్ 27న తొలి టీ20, 29న రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా, ఐర్లాండ్ జట్లు తలపడతాయి. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరీ ఓ ప్రకటన విడుదల చేశారు. జూలైలో ఇంగ్లండ్ పర్యటన ఉండగా, అంతకు కొన్ని రోజుల ముందు భారత జట్టు ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్ ఆడనుంది. అయితే ఐర్లాండ్, భారత్ జట్లు పొట్టి ఫార్మాట్లో కేవలం ఒకే ఒక్క మ్యాచ్‌లో తలపడ్డాయి. 2009 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా నాటింగ్‌హామ్‌లో ఈ జట్లు తలపడ్డ తర్వాత దాదాపు 9 ఏళ్లకు మరోసారి ఎదురపడనున్నాయి. అయితే భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య ద్వైపాక్షిక టీ20 సిరీస్ ఇప్పటివరకూ జరగలేదు.



సౌతాఫ్రికా సిరీస్‌కు

మిథాలీనే కెప్టెన్

న్యూఢిల్లీ: వచ్చే నెల దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత మహిళ జట్టు సభ్యుల వివరాలను బీసీసీఐ ప్రకటించింది. ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయర్ తర్వాత దక్షిణాఫ్రికా మహిళ జట్టుతో ఫిబ్రవరిలో మరోసారి భారత్ తలపడనుంది. ఈ సిరీస్‌లో టీం ఇండియా కెప్టెన్‌గా మిథాలీరాజ్, వైస్-కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ వ్యవహరించనున్నారు. కాగా దక్షిణాఫ్రికాతో భారత్ మూడు వన్డేలు, ఐదు టీ-20లు ఆడనుంది. 16 మంది సభ్యుల జట్టులో యువ క్రీడాకారిణి జెమిమా రోడ్‌రిగ్యూస్ తొలిసారి స్థానం దక్కించుకుంది. జట్టు వివరాలు: మిథాలీ రాజ్(కెప్టెన్), హర్మన్‌ప్రీత్ కౌర్(వైస్-కెప్టెన్), సుష్మా వర్మ(కీపర్), ఎక్తా బిస్త్, స్మృతి మంధన, పూనమ్ యాదవ్, పునమ్ రౌత్, రాజేశ్వరి గైక్వాడ్, జెమిమా రోడ్‌రిగ్యూస్, గుల్షన్ గోస్వామి, దీప్తి శర్మ, శిఖ పాండే, మోనా మెష్రామ్, పూజా వస్త్రాకర్, వేదా కృష్ణమూర్తి, తనియా భాటియా(కీపర్).

వివేక్‌పై టీసీఏ ఫైర్

హైదరాబాద్: ప్రభుత్వ సలహాదారు, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జి.వివేక్‌పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. జిల్లాల్లో క్రికెట్ టోర్నీలు నిర్వహించని వివేక్.. ఆ పేరుతో కోట్ల రూపాయలు దిగమింగారని టీసీఏ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ గురువారెడ్డి ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడిన టీసీఏ ప్రతినిధులు.. హెచ్‌సీఏ అక్రమాల చిట్టాను బయటపెట్టారు.

వెంకటస్వామి ట్రోఫీకి అనుమతి ఎవరిచ్చారు?

'క్రికెట్‌లో ఓనమాలు కూడా తెలియని వివేక్ రాజకీయాలను అడ్డం పెట్టుకుని హెచ్‌సీఏ అధ్యక్షుడయ్యారు. జిల్లాల్లో టోర్నమెంట్లు నిర్వహించకున్నా ఆపని చేసినట్లు చెప్పుకుని నిధులు కాజేశారు. రెండు సంవత్సరాలలో రూ.2కోట్ల నిధులు దారి మళ్లించారు. హెచ్‌సీఏ కార్యదర్శి(శేష్‌నారాయణ్) సస్పెన్షన్ విషయంలో నిబంధనలు పాటించలేదు. వెంకటస్వామి పేరు మీద ట్రోఫీ నిర్వహించడానికి హెచ్‌సీఏ జనరల్ బాడీ అనుమతి ఉందా? వివేక్ తన విశాఖ సంస్థ ప్రచారం కోసం క్రికెట్ సంఘాన్ని వాడుకుంటున్నారు'' అని లక్ష్మీనారాయణ అన్నారు.



పోరాటం చేస్తాం..

తెలంగాణ జిల్లాలన్నీ హెచ్‌సీఏ పరిధిలోకే వస్తాయని వివేక్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. టీసీఏ చైర్మన్‌గా మంత్రి ఈటల రాజేందర్, చీఫ్ ప్యాట్రన్‌గా కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ ఉన్నారు. ఇప్పటివరకు మేం(టీసీఏ) 1200 మ్యాచ్‌లు నిర్వహించాం. అవసరమైన మేరలో సీనియర్ క్రికెటర్ల సేవలను వినియోగించుకుంటాం. క్రికెట్ కోసం ఇంతగా కష్టపడుతోన్న టీసీఏకి బీసీసీఐ గుర్తింపు విషయంలో హెచ్‌సీఏ అనుమతి అవసరమే లేదు. వివేక్ ఆధ్వ ర్యంలో హెచ్‌సీఏలో కొనసాగుతోన్న అక్రమపర్వాలపై చట్టపరమైన పోరాటం చేస్తాం..' అని గురువారెడ్డి వ్యాఖ్యానించారు.

సెంచూరియన్ వ్యూహం ఇదే..!


కేప్‌టౌన్: భారత్-దక్షిణాఫ్రికా మధ్య సెంచూరియన్‌లోని సూపర్ స్పోర్ట్ పార్కులో శనివారం నుంచి రెండో టెస్టు ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దక్షిణాఫ్రికా జట్టు కోచ్ గిబ్సన్ సెంచూరియన్‌లో ఏ వ్యూహంతో బరిలోకి దిగుతారో సూచనప్రాయంగా చెప్పాడు. 'కేప్‌టౌన్‌లో జరిగిన తొలి టెస్టులో నలుగురు సీమర్లతో బరిలోకి దిగిన మా వ్యూహం ఫలించింది. శనివారం ప్రారంభంకానున్న రెండో టెస్టులోనూ ఇదే వ్యూహంతో బరిలోకి దిగుతాం. సెంచూరియన్ పేసర్ల స్వర్గధామం. మొదటి టెస్టులో నలుగురు సీమర్లలో ముగ్గురు 140కి పైగా వేగంతో బంతులేశారు. కేప్‌టౌన్ టెస్టు విజయం మాలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. నంబర్‌వన్ జట్టుపై ఆడేప్పుడు చాలా జాగ్రత్త వహించాలి. అన్ని విభాగాలను బ్యాలెన్స్ చేసుకోవాలి. నలుగురు పేస్ బౌలర్లతోనే బరిలోకి దిగాలని కోరుకుంటా. కుదరని పక్షంలో మరో విధంగా జట్టు కూర్పు ఉంటుంది. సొంత గడ్డపై ఆడుతున్నప్పుడు మనకున్న పూర్తి బలంతోనే బరిలోకి దిగాలి' అని గిబ్సన్ తెలిపాడు. భారత్‌తో తొలి టెస్టులో గాయపడిన పేసర్ డేల్ స్టెయిన్ స్థానంలో యువ పేసర్ డ్యున్ ఒలివరన్‌ను సెలక్టర్లు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. పాదం గాయం కారణంగా స్టెయిన్ ఈ సిరీస్ మొత్తానికి దూరమైన సంగతి తెలిసిందే. ఒలివర్‌తో పాటు మరో ఫాస్ట్ బౌలర్ లుంగి కూడా దక్షిణాఫ్రికా జట్టులోకొచ్చాడు.



మేనేజ్‌మెంట్ మెకాలడ్డు

ముంబై : శ్రీలంకతో టెస్టు సిరీస్ అనంతరం మురళీ విజయ్, రహానె, పుజారాను ముందుగానే దక్షిణాఫ్రికా పంపిద్దామనుకుంది బీసీసీఐ. ఇదే ప్రతిపాదనను టీమ్ మేనేజ్‌మెంట్ వద్ద ప్రస్తావించగా వారు నో చెప్పారట. కొందరు ఆటగాళ్లు ముందుగానే అక్కడికి వెళ్తే ప్రాక్టీస్‌తో పాటు వాతావరణ పరిస్థితులకు వారు అలవాటు పడతారని బీసీసీఐ సూచించిందట. కానీ, టీమ్ మేనేజ్‌మెంట్ వద్దనడంతో ఇక చేసేది ఏమీ లేక బీసీసీఐ వెనక్కి తగ్గింది. కేప్‌టౌన్ టెస్టులో భారత్ పరాజయం పాలవ్వడంతో ఒక్కో డొల్లతనం బయటపడుతోంది. రహానె, రాహుల్‌ని కాదని ధావన్, రోహిత్‌కు తుది జట్టులో స్థానం కల్పించడంపై ఇప్పటికే పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బీసీసీఐ కూడా నోరు విప్పింది. డిసెంబరు 27న కోహ్లి నాయకత్వంలోని టీమిండియా సఫారీ పర్యటనకు బయల్దేరిన సంగతి తెలిసిందే. ఐతే 27 కంటే ముందే బీసీసీఐ పలువురు ఆటగాళ్లను ముందుగానే దక్షిణాఫ్రికా పంపిద్దామన్న ప్రతిపాదనను టీమ్ మేనేజ్‌మెంట్ ముందు ఉంచిందట. 'శ్రీలంకతో వన్డే, టీ20 సిరీస్‌లతో పాటు దేశవాళీ మ్యాచుల్లో పాల్గొనని రహానె, పుజారా, మురళీ విజయ్‌ను ముందుగానే దక్షిణాఫ్రికా పంపిస్తామని టీమ్ మేనేజ్‌మెంట్‌ను కోరాం.

ఆ ఖర్చులన్నీ బీసీసీఐ భరిస్తుందని కూడా చెప్పాం. కానీ, వారు వద్దన్నారు. గతంలో భారత్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు సచిన్, వీవీఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్ ముందుగానే వెళ్లేవారు. వీరి కోసం బీసీసీఐ ప్రత్యేకంగా ప్రాక్టీస్ గేమ్స్ కూడా సిద్ధం చేసేది.' అని ఓ బీసీసీఐ అధికారి తెలిపారు.





బహిరంగ సభలో అభివాదం చేస్తున్న జంగాల అజయ్, దోనేపూడి శంకర్, అక్కినేని వనజ, ఓబులేసు, రామకృష్ణ, డి రాజా, సురవరం సుధాకర రెడ్డి, కె నారాయణ, అతుల్ కుమార్ అంజాన్, జల్లీ విల్సన్, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీఎస్ఎన్ మూర్తి, పీజే చంద్రశేఖర్, రావుల వెంకయ్య, సీహెచ్ కోటేశ్వరరావు, పల్లా సూర్యారావు, తూము కృష్ణయ్య



విప్లవ గేయాలు ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు గొల్లపల్లి జానీ, చంద్రానాయక్, నజీర్, పిచ్చయ్య, గని తదితరులు

కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులు

- బ్రిటీష్ పాలకులతో ఆర్ఎస్ఎస్, బీజేపీ రాజీ
- నరేంద్ర మోడీ పాలనలో పెరిగిన దాడులు
- సీపీఐ జాతీయ కార్యదర్శి డి రాజా



విశాలాంధ్రబ్యూరో - అమరావతి:

కమ్యూనిస్టుల దేశభక్తిని ప్రశ్నించే అర్హత బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు లేదని, దేశానికి స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులపై పోరాడిన ఘన చరిత్ర సీపీఐకి ఉందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డి రాజా అన్నారు. సీపీఐ ఆవిర్భావానికి కొద్ది నెలల ముందే ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందని, కాని స్వాతంత్ర్య పోరాటంలో ఎక్కడా అది భాగస్వామ్యం కాలేద న్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కమ్యూ నిస్టులు పోరాటం చేస్తుంటే, ఆర్ఎస్ఎస్ బ్రిటీష్ పాలకులతో రాజీపడిందని ఆయన విమర్శిం చారు. సీపీఐ జాతీయ సమితి సమావేశాల ముగింపు సందర్భంగా బుధవారం సాయంత్రం విజయవాడలోని జింఖానా మైదానంలో జరిగిన బహిరంగ సభలో రాజా మాట్లాడుతూ, కమ్యూనిస్టు కురువృద్ధులు ఎందరో స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలను త్యాగం చేశారని, ఇంకా అనేక మంది జైలు శిక్ష అనుభవించారని చెప్పారు. ఆర్ఎస్ఎస్ వాదులు దేశం కోసం జైలుకు వెళ్లిన ఘటనలు చరిత్రలో ఎక్కడా లేవని, ఉంటే చూపించాలని ఆయన సవాల్ చేశారు. తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. సీపీఐ అగ్రనేతలు చంద్ర రాజేశ్వరరావు, ఎన్ గిరిప్రసాద్, గుజ్జుల యలమందారెడ్డి, దాసరి నాగభూషణరావు వంటి వారు అనేక త్యాగాలు చేయటం వల్లే దేశం ఐక్యంగా ఉందన్నారు. దేశ చరిత్రలో సీపీఐకి ఘన చరిత్ర ఉంటే, ఆర్ఎస్ఎస్ పాత్ర ఎక్కడా కనిపించదని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ వాదులు తామే స్వాతంత్ర్యం కోసం పోరాడామని, తామే జాతీయవాదులమని ప్రచారం చేసుకోవటం గర్హనీయమన్నారు. అలా చెప్పుకునే అర్హత బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు లేదన్నారు. కమ్యూనిస్టులకు మించిన గొప్ప దేశ భక్తులు మరెవ్వరూ లేరని, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి, నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత దళితులు, ముస్లిం మైనార్టీలు, మేధావులు, రచయితలపై దాడులు పెరిగాయని విమర్శించారు. అధికారమదంతో బీజేపీ రాజ్యాంగ హక్కులను కూడా హరించేస్తోందని దుయ్యబట్టారు. ప్రజలపై హిందూ మతన్మోదాన్ని రుద్దేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దేశంలోని దళితులు, మైనార్టీలు, రైతుల సమస్యలు పాలకులకు ఏమాత్రం పట్టవని, కేవలం మతోన్మాదాన్ని రెచ్చగొట్టటమే వారు పనిగా పెట్టుకున్నట్లు చెప్పారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ పాలనలో దేశం అత్యంత ప్రమాదంలో పడిందని, ప్రజలు నేడు అనేక ఇబ్బందులు, సవాళ్లను ఎదుర్కొంటున్నారని రాజా చెప్పారు. దేశ భద్రతకు, ప్రజల సామాజిక భద్రతకు రక్షణ లేకుండాపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలను కూడా ప్రజలకు దక్కకుండా పాలకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులు ప్రజలకు రక్షణ కల్పించేందుకు, సామాజిక భద్రత కల్పించేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ దేశాన్ని ఆర్ఎస్ఎస్, బీజేపీ నుంచి ఏవిధంగా రక్షించుకోవాలో తమకు తెలుసునన్నారు. దేశాన్ని అవస్థలకు గురి చేస్తున్న పాలకులపై పోరాటం చేసేందుకు ఇదే సరైన సమయమని, ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష వాదులు ఐక్యంగా పోరాటాలు చేసేందుకు ముందుకు రావాలని రాజా పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో పోరాటాలను మరింత ఉధృతం చేసేందుకు ప్రత్యేక ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇక దేశంలోని ప్రాంతీయ పార్టీలు ప్రమాదకర బీజేపీతో పొత్తు ఎందుకు పెట్టుకున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు అసలేం చేస్తున్నారో అర్థంకావటంలేదన్నారు. ఇదే పరిస్థితిని కొనసాగిస్తే బీజేపీతో పొత్తు పెట్టుకున్నందుకు చంద్రబాబుతోపాటు ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రాజా హెచ్చరించారు.

మోడీని వ్యతిరేకిస్తే వారికి జైలే!

- రాష్ట్రాల హక్కుల కోసం ఎందుకు ప్రశ్నించడంలేదు?
- ప్రజాస్వామ్య హక్కులన్నీ కాలరాస్తున్న బీజేపీ
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:

ప్రధాని నరేంద్రమోడీని వ్యతిరేకించిన మరుసటి రోజే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ జైలుకెళ్లడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. బీజేపీని వ్యతిరేకించినందునే మాజీ కేంద్రమంత్రి లాలుప్రసాద్ యాదవ్, జయలలిత నెచ్చెలి శశికళ సహా అనేక మంది జైలుపాలైనట్లు ఆయన ఉదహరించారు. అందరి జాతకాలు మోడీ చేతిలో ఉన్నందునే భయపడుతున్నారని చెప్పారు. ఇతర పార్టీలలో ఉన్నవారిని దేశద్రోహులుగా ముద్రవేసే బీజేపీ, తీరా ఆపార్టీ తీర్థం పుచ్చుకోగానే వారిని గంగిగోవులుగా చూస్తోందని ఆయన తనదైనశైలిలో విమర్శించారు. సీపీఐ జాతీయ సమితి సమావేశాల ముగింపు సందర్భంగా బుధవారం జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడారు. రాష్ట్రాల హక్కుల గురించి చంద్రబాబు, కేసీఆర్ కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడంలేదన్నారు. ఇక్కడ మీసాలు తిప్పి, తీరా ఢిల్లీ వెళ్లాక అక్కడ మోడీకి మోకరిల్లుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీజేపీ అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించేందుకు భయపడుతున్న ముఖ్యమంత్రులను మోడీ బానిసలుగా ఆయన అభివర్ణించారు. విభజన హామీల విషయమై మాట్లాడేందుకు తమ ముఖ్యమంత్రికి అపాయింట్‌మెంట్ ఇవ్వాల్సిందిగా కోరుతూ టీడీపీకి చెందిన పది మంది ఎంపీలు, ఇద్దరు మంత్రులు మోడీని ప్రాధేయపడితే చివరకు అంగీకరించారన్నారు. దేశంలో కాంగ్రెస్ రిటైల్‌గా అవినీతికి పాల్పడితే బీజేపీ ఏకంగా హోల్‌సేల్‌గా తెరలేపిందన్నారు. రైతులకు రుణాలు ఇవ్వకుండా ఏడ్పిస్తూ కార్పొరేట్లకు మాత్రం రూ. 13 లక్షల కోట్లను రాయితీలుగా ఇవ్వడం దారుణమన్నారు. దేశంలో నల్లధనాన్ని నిర్మూలిస్తామని చెబుతూ గత ఏడాది నవంబరులో పెద్దనోట్లను రద్దు చేసిన మోడీ ఏమేరకు నల్లధనాన్ని రాబట్టగలిగారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండు చేశారు. సరిహద్దుల్లో ఉగ్రవాదం ఆగలేదని, డ్రగ్‌మాఫియాకు చెక్ పెట్టలేదన్నారు. అలాగే ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని నిలువరించలేకపోయారనడానికి ఉత్తరప్రదేశ్, గుజరాత్ ఎన్నికలే ఉదాహరణగా నిలుస్తాయన్నారు. పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రవేశపెట్టిన రూ. 2వేల నోటు ఇంకా పూర్తిగా చెలామణిలోకి రాకముందే అనేక మంది పెద్దల దగ్గరికి చేరుకోవడానికి ఆర్‌బీఐనే కారణమన్నారు. నల్లధనంపై దాడి కేవలం బూటకమన్నారు. అలాగే వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వల్ల కూడా పెద్దలకే లాభం చేకూరిందని తెలిపారు. గతంలో 33 శాతంగా ఉన్న పన్నులను 28 శాతానికి తగ్గించి కార్పొరేట్లకు మేలు చేసిన మోడీ, జీరో శాతంగా ఉన్న పన్నులను 5 నుంచి 28 శాతానికి పెంచడం ద్వారా సామాన్యులపై అదనపు భారాన్ని మోపారని తెలిపారు. బీజేపీ గవర్నర్లతోపాటు సీబీఐ, ఎన్నికల కమిషన్‌ను తనకు అనుకూలంగా ఉపయోగించుకోవడం ద్వారా రాజ్యాంగ వ్యవస్థను ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరు ప్రశ్నిస్తారో, ఆందోళనలు చేస్తారో వారిని దేశద్రోహులుగా చిత్రీకరించి ప్రజాస్వామ్య హక్కులన్నీ కాలరాస్తున్నారన్నారు. దేశంలోనే తొలిసారిగా పాలకవర్గమే రాజ్యాంగానికి ప్రమాదం కలిగించే విధంగా ఇంతగా దిగజారిన ప్రధానిని ఇంతవరకూ చూడలేదన్నారు. సంఘ్‌పరివార్ శక్తులు చెప్పినట్లుగా వింటున్న మోడీని ఆయన తోలుబొమ్మతో పోల్చారు. విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు సాగిస్తూ దేశంలో మాఫియా రాజ్యాన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు. బీజేపీతోపాటు దానిని సమర్థించే పార్టీలను ఎండగట్టాల్సి ఉందన్నారు. అలాగే మతోన్మాద దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలను సాగించేందుకు సిద్ధం కావాలని నారాయణ పిలుపునిచ్చారు.

బాబూ.. అభివృద్ధి ఎక్కడ..?

- హోదా వస్తేనే రాష్ట్రానికి న్యాయం
- డబ్బు పంపిణీ చేయకుండా ఒక్క సీటైనా గెలవగలరా?
- మరిన్ని పోరాటాలకు సిద్ధంకండి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:

మూడున్నరేళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నానని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి ఎక్కడ జరిగిందో ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండు చేశారు. ఏ దేశంలో పర్యటిస్తే ఆ దేశ రాజధానిగా తీర్చిదిద్దుతానని గొప్పలు చెప్పుకున్న బాబు చివరకు బాహుబలి సెట్టింగ్‌లతో కలర్ డిజైన్లను చూపించడమే అభివృద్ధా? అని ప్రశ్నించారు. సీపీఐ జాతీయ సమితి సమావేశాల ముగింపును పురస్కరించు కుని బుధవారం సాయంత్రం జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు రుణంతో రాజధాని అమరావతిని, నాబార్డు రుణంతో పోలవరం ప్రాజెక్టును నిర్మించి రాష్ట్రాన్ని అప్పులపాల్జేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం పోలవరం, రాజధాని నిర్మాణానికి నిధులను కేంద్రమే ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే కేంద్రంతో మాట్లాడే దమ్ము, ధైర్యం పాలకులకు లేకపోవడం వల్లే రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని తెలిపారు. నవ్యాంధ్ర అభివృద్ధి పథంలో నడవాలంటే విభజన హామీలను నెరవేర్చాల్సిందేనన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వశాఖల్లోనూ అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని, లంచగొండితనం రాజ్యమేలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) అధికారులపై జరిపినట్లే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల ఇళ్లపై కూడా దాడుల జరపాలని డిమాండు చేశారు. పెద్దనోట్లను రద్దు చేసిన కేంద్రం రూ. 2వేల నోటును కేవలం చంద్రబాబు కోసమే విడుదల చేసిందని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో ఓట్లను కొనుగోలు చేసేందుకు బాబు ఇప్పటికే రూ.100 కోట్లను కూడబెట్టినట్లు చెప్పారు. ప్రజల్లో 80 శాతం సంతృప్తి ఉండాలని, రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ టీడీపీ విజయం సాధించాలని బాబు ఉవ్విళ్లూరుతున్నారని తెలిపారు. తన సొంత గ్రామం నారావారిపల్లె ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో డబ్బు పంపిణీ చేయకుండా గెలిస్తే రాష్ట్రం మొత్తం టీడీపీ వెంటే ఉందని భావిస్తామని ఆయన సవాలు విసిరారు. పోరాటాలు సాగించిన చరిత్ర కలిగిన సీపీఐ మూడేళ్ల కాలంలో ప్రత్యేక హోదా, రైతు సమస్యలు, అగ్రిగోల్డు బాధితుల సమస్యలు, ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం ఇలా.. అనేక అంశాలపై బస్సు యాత్రలు, ధర్నాలు, బంద్‌లు, నిరసన ప్రదర్శనలు నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కష్టజీవులు, కార్మికులు, నిరుపేదలు, అణగారినవర్గాలు, దళితులు, బీసీలు, గిరిజనులు, మైనార్టీలు సీపీఐ వైపు చూస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు సాగించేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.





ప్రభంజనం

- కార్మికులు, కార్యకర్తల ప్రదర్శన
- గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు

విశాలాంధ్రబ్యూరో -అమరావతి:

మూడు రోజులపాటు విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో జరిగిన ఆ పార్టీ జాతీయ సమితి సమావేశాల ముగింపు సందర్భంగా గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన బహిరంగ సభకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, కార్మికులు, కర్షకులు, మహిళలు ఉవ్వెత్తున తరలివచ్చారు. మూడు రోజులపాటు జరిగిన జాతీయ సమితి సమావేశాలలో రూపొం దించిన రాజకీయ విధానం, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై అగ్రనేతలు చేసే ప్రకటనను ప్రత్యక్షంగా తెలుసుకోవాలనే ఉత్సుకతతో భారీ సంఖ్యలో ప్రజలు బహిరంగ సభకు తరలివచ్చారు. విజయవాడ నగరంతోపాటు కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలలో పార్టీ శ్రేణులు జింఖానా గ్రౌండ్‌కు తరలివచ్చాయి. విజయవాడలోని పలు ప్రాంతాల నుంచి ఏఐటీయూసీ అనుబంధ ముఠా కార్మికులు, ట్యాక్సీ వర్కర్స్, క్లాత్ మర్చంట్స్ ముఠా కార్మికులు డప్పు వాయిద్యాలతో ప్రదర్శనగా తరలివచ్చాయి. జిల్లాలోని శివారు ప్రాంతాలకు చెందిన ప్రజలు మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. జాతీయ సమితి సమావేశాల సందర్భంగా బహిరంగ సభ ఉంటుందని ముందుగానే తెలియడంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలివచ్చారు. సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు భారీగా ప్రజలను సమీకరించారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, సీపీఐ జాతీయ మహాసభలు జరగనున్న వేళ పార్టీ అగ్ర నేతలు ఎలాంటి నిర్ణయాలు చేయబోతున్నారో తెలుసుకోవాలనే ఆసక్తితో భారీ సంఖ్యలో జనం సభకు హాజరయ్యారు. పలు ప్రాంతాల నుంచి ప్రదర్శనలు జింఖానా గ్రౌండ్‌కు చేరుకునే సమయానికి సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి డీ రాజా, రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కూడా సభా ప్రాంగణానికి వచ్చారు. వారు కూడా ప్రదర్శనలో భాగస్వామ్యమై అగ్రభాగాన నడిచారు. అంతకుముందే గ్రౌండ్‌కు చేరుకున్న మరో జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి సభకు హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలతో ముచ్చటించారు. నేతలు సభా ప్రాంగణానికి చేరుకునేసరికే జింఖానా మైదానం ప్రజలతో నిండిపోయింది. బహిరంగ సభ ఆరంభంలోనే పార్టీ అగ్ర నాయకులు ప్రజలకు విప్లవపూరిత అభివాదం చేయడంతో ఒక్కసారిగా గ్రౌండ్‌లో సీపీఐ జిందాబాద్ అంటూ నినాదాలు మారుమోగాయి. తొలుత విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ పార్టీ నాయకులను వేదికపైకి ఆహ్వానించినప్పుడు రెడ్‌షట్ వాలంటీర్లు రెడ్ సెల్యూట్, రెడ్ సెల్యూట్ అనే నినాదాలతో సాదర ఆహ్వానం పలికారు. సభకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లి విల్సన్ అధ్యక్షత వహించారు. సభా ప్రాంగణంలో రెడ్‌షర్ట్ వాలంటీర్లు సభకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు కూడా ఎర్ర చీరెలు కట్టుకుని వాలంటీర్లుగా వ్యవహరించారు.

ఉత్సాహం నింపిన విప్లవ గేయాలు, నృత్యాలు

సీపీఐ బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ప్రజా న్యాటమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు, కన్నా జానపద నృత్య కళాకారుల ప్రదర్శనలు ప్రజలలో ఉత్సాహాన్ని నింపాయి. ఆనాటి మేటి విప్లవ గేయాలతో సభా ప్రాంగణం మారుమోగింది. ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు ఘని, ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, సీనియర్ కళాకారులు ఆర్ పిచ్చయ్య, నజీర్ విప్లవ గీతాలను అలపించారు. ఎర్ర జెండాలతో కళాకారులు నృత్యం చేయడంతో సభకు హాజరైన వారిలో ఉత్సాహం రెట్టింపైంది.

బిల్‌గేట్స్‌ను దాటిన బెజోస్



న్యూయార్క్:

అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ సంపద 10,500 కోట్ల డాలర్లకు పెరగడంతో బిల్ గేట్స్ సంపదను మించిపోయినట్టయింది. అమెజాన్ షేర్లు 12 నెలల గరిష్టస్థాయికి పెరగడంతో బెజోస్ నికర సంపద భారీగా ఎగిసింది. దీంతో ఆన్‌లైన్ షాపింగ్ దిగ్గజం అమెజాన్ మార్కెట్ విలువ 57 శాతం పెరిగింది. ఈ ఏడాది అమెజాన్ షేర్లు 6.6 శాతం ఎగిశాయి. అమెరికాలో థ్యాంక్స్‌గివింగ్ డే అనంతరం 5 వారాల వ్యవధిలో ఆన్‌లైన్ స్పెండింగ్ మార్కెట్‌లో అమెజాన్ ఏకంగా 89 శాతం మార్కెట్ షేర్‌ను దక్కించుకోవడం గమనార్హం. బెజోస్ సంపద భారీగా పెరగడంతో 1999లో బిల్ గేట్స్ మైక్రోసాఫ్ట్ చేరుకున్న గరిష్ట మార్కెట్ విలువను అధిగమించారు. అయితే బిల్ గేట్స్ తన సంపదలో అధిక భాగాన్ని బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌కు ఇవ్వకుంటే ఆయన నికర సంపద 15,000 కోట్ల డాలర్లు దాటలేదని నిపుణులు పేర్కొంటున్నారు. 1996 నుంచి గేట్స్ 70 కోట్ల మైక్రోసాఫ్ట్ షేర్లు, 300 కోట్ల డాలర్ల నగదు సహా పలు ఇతర ఆస్తులను బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌కు ఇచ్చారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.